



ESTD: 1999
www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ 27-03-2026 శుక్రవారం | సంపుటి : 27 | సంచిక : 24
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on






# ఇందిరమ్మ బీమా

## 1.15 కోట్ల కుటుంబాలకు వర్తింపు

# పేదలకు భీమా



- రెండున్నరేళ్లలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్ల ఖర్చు
- ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ కు భారీ కేటాయింపు
- రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం
- చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ప్రోత్సాహకాలిస్తాం
- ఆస్పత్రుల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమిస్తాం
- పీహెచ్‌సీ నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి26 (వుదయం ప్రతినిధి) :** ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. అసెంబ్లీ సమావేశంలో గడిచిన 27 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం...రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను సీఎం గురువారం శాసనసభ ముందు వివరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వేలెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నట్లు చెప్పారు. పేదలకు జీవిత బీమాను అందించి పేదల్లో ధీమా కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు.

మిగతా 2లో

**చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం**
ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం రేవంత్ రెడ్డి
సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష
2

## ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్

# నేవీ చీఫ్ మృతి

## గల్ఫ్ లో మరింతగా ఉద్రిక్తతలు



**వుదయం డెస్క్, మార్చి 26 :** బందర్ అబ్బాస్‌పై తాము చేసిన దాడిలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నావికాదళాధిపతి కమోడోర్ అలీరెజా తంగ్సిరి మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించడంతో, గురువారం గల్ఫ్ అంతటా ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. హొర్ముజ్ జలసంధికి సమీపంలో ఉన్న ఈ తీరప్రాంత నగరం, ఇరాన్ కు అత్యంత వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన సముద్ర కేంద్రాలలో ఒకటి. 2018 నుండి ఐఆర్‌జిసి నావికాదళానికి నాయకత్వం వహిస్తున్న తంగ్సిరిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగిందని ఒక ఇజ్రాయెల్ అధికారి చెప్పినట్టు ది జెరూసలేం పోస్ట్ పేర్కొంది. ఇది ధృవీకృతమైతే, ప్రాంతీయ ఘర్షణలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ పరిణామం ఇరాన్ సైనిక కమాండ్‌కు ఒక పెద్ద ఎదురు దెబ్బ అవుతుంది. అతి వాద వైఖరి కలిగిన అనుభవజ్ఞుడైన కమాండర్ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో తొలిసారిగా ప్రాముఖ్యత పొందిన తంగ్సిరి, ఇరాన్ భద్రతా వ్యవస్థలో ఒక అనుభవజ్ఞుడైన నావికాదళ అధికారిగా పరిగణిస్తారు. పూర్తి కమాండ్‌ను చేపట్టక ముందు, ఆయన బందర్ అబ్బాస్‌లోని ఐఆర్‌జిసి నావికాదళం 1వ నావికా జిల్లాకు నాయకత్వం వహించారు. ఆగష్టు 2018లో అలీ ఖమేనీ



ఆయనను ఈ దళానికి అధిపతిగా నియమించారు. సంవత్సరాలు గడిచేకొద్దీ, తంగ్సిరి అమె రికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా తన తీవ్రమైన విమర్శలకు ప్రసిద్ధి చెందారు. రెచ్చగొడితే ఇరాన్ అమె రికా బలగాలను గల్ఫ్ ఆఫ్ మెక్సికో వరకు కూడా తరిమికొడుతుందని 2007లో ఆయన హెచ్చరించారు. 2016లో, ఇరాన్ జలాల్లో అమెరికా నావికులను నిర్బంధించిన ఘటనను అమెరికా బలగాలు ఇరా న్‌కు లొంగిపోవడంగా ఆయన అభివర్ణించారు. ఇటీవలి కాలంలో, ఇరాన్ నావికా సామర్థ్యాలను ప్రదర్శించడంలో ఆయ న ప్రముఖ పాత్ర పోషించారు. ఫిబ్రవరి 2025లో, ఆయన దేశపు మొట్టమొదటి డ్రోన్

మిగతా 2లో

## మిడ్ డేలో చేప కూర



- ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు వడ్డన
- అసెంబ్లీలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటన



**హైదరాబాద్, మార్చి 26 (ఎఎంస్) :** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఇప్పటికే సన్నబియ్యంతో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుండగా.. ఇక నుంచి చేపలు కూడా అందించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గురువారం అసెంబ్లీలో పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో బలమైన పశు సంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అందులో భాగంగానే వారి కోసం ప్రత్యేక జాతికి చెందిన చేపల్ని పెంచి మధ్యాహ్న భోజనంలో అందించనున్నట్లు వెల్లడించారు.

మిగతా 2లో

# సిఎంలతో నేడు ప్రధాని వీడియో చర్చ

## కరోనాలో మాదిరి టీమ్ ఇండియా స్ఫూర్తిని ఆవిష్కరించే దిశగా..

**న్యూఢిల్లీ, మార్చి 26 (వుదయం) :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నడుమ, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణ దృష్ట్యా రాష్ట్రాల సంసిద్ధతను సమీక్షించేందుకు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం (మార్చి 27) ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక సమావేశాన్ని నిర్వహించనున్నారని ఎన్డీటీవీ నివేదిక తెలిపింది. టీమ్ ఇండియా' స్ఫూర్తితో చేపట్టిన కృషిలో సమన్వయాన్ని సాధించడంపైనే ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారిస్తుందని సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధం వల్ల సంభవించే పర్యవసానాలను ఎదుర్కోవడంలో రాష్ట్రాల సంసిద్ధతను సమీక్షించడం, అలాగే కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం. సరఫరా గొలుసు అంతరాయాలు, ఇంధన భద్రతా ఆందోళనలు, యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లోని భారత పౌరుల భద్రత వంటి కీలక సమస్యలను ప్రస్తావనలోకి వచ్చే అవకాశం ఉంది. యుద్ధ ప్రభావాలు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరుతూ, మంగళవారం తన రాజ్యసభ ప్రసంగంలో ప్రధానమంత్రి



ఈ విధానానికి పిలుపునిచ్చారు.
భారతదేశపు పటిష్టమైన వృద్ధి పథం నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సవిస్తూ, కోవిడ్-19 మహమ్మారి సమయంలో కేంద్రం, రాష్ట్రాలు పరీక్షలు, టీకా పంపిణీ, నిత్యావసర వస్తువుల సరఫరా వంటి అంశాలలో పరస్పరం సహకరించుకుంటూ ప్రదర్శించిన ఆదర్శప్రాయమైన 'టీమ్ ఇండియా' స్ఫూర్తిని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ సమష్టి కృషి ద్వారా, దేశం ఈ తీవ్రమైన ప్రపంచ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతుంది. మనం అదే 'టీమ్ ఇండియా' స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలి, అని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో విధానసభ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ సమావేశంలో పాల్గొనవని సమాచారం. దీనికి ప్రత్యామ్నాయంగా, ఎన్నికల ప్రక్రియకు ఎటువంటి ఆటంకం కలగకుండానే పరిపాలనాపరమైన సంసిద్ధతను నిర్ధారించేందుకు, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సచివాలయం ద్వారా ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ నెలాఖరు వరకు**

# పిఆర్ సి గడువు పెంపు

## ప్రభుత్వానికి చేరని కొత్త పీఆర్‌సీ నివేదిక




**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ గడువును ప్రభుత్వం పెంచింది. పీఆర్సీ గడువు సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. ప్రస్తుత పీఆర్‌సీ కమిటీ గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు కమిటీ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిర్ణయం తీసుకుంది. కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొత్త పీఆర్‌సీ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ కొత్త పీఆర్‌సీ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరలేదు. ఈ తరుణంలో కొత్త పీఆర్‌సీ కోసం ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.

**రెండు రోజుల క్రితం అసెంబ్లీలో**

ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల సందర్భంగా విపక్షాలు సైతం ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొత్త పీఆర్సీ ఇస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారని కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావొస్తున్నా పీఆర్సీ ఇవ్వలేదు.

మిగతా 2లో

## రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

**దావోస్ పర్యటనపై**

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** దావోస్ పర్యటనల ద్వారా తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. 2024, 2025 దావోస్

మిగతా 2లో

**ఉపాధి హాజరు యాప్‌కి**

# డిజిటల్ బురిడీ!

## కొత్త ముఖ గుర్తింపు హాజరు నమోదులో కూడా అవినీతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ', ఆజీవిక మిషన్ (గ్రామీణ్) అమల్లో కేంద్రం మరిన్ని కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఉపాధిలో జరుగుతున్న నకిలీ హాజరు అరికట్టే విధంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) యాప్ లో మరింత కఠిన తరంగా అందుబాటులోకి కేంద్రం తీసుకువచ్చింది. ఉపాధి హామీ కూలీల హాజరు రోజుకు రెండుసార్లు ఉదయం పని ప్రారంభంలో పని ముగింపు సమయంలో ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా లైవ్ లొకేషన్ క్యాప్చర్ చేసి కూలీల ఫోటోకు జియో ట్యాగ్ చేయాలని నిబంధనలు తీసుకొచ్చింది. గతంలో ఉపాధి కూలీలు పనిచేసిన చేయకపోయినా ఒకరి పేర్ల మీద మరొక బినామీ ఫోటోలతో పెట్టి నకిలీ హాజరు నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి. అలా ఉపాధిలో జరుగుతున్న అవకతవకలను, సామాజిక తనిఖీల్లో భారీగా బయటపడుతున్న

మిగతా 2లో

**ఇంటిగ్రేటెడ్**

# 2 నుంచి 5 మండలాల్లో భూభారతి

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** త్వరలోనే తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ( ఇ ంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మ ండ లాల్లో ప్రయోగాత్మకంగా

మిగతా 2లో

## వైద్యరంగం బలోపేతం

**వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 9.45 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలు, సేవలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. గతంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే సేవలు అందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ. 52 కోట్లు చెల్లిస్తే,

మిగతా 2లో









# భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలు

• మంత్రి తుమ్మల నాగేశ్వరరావు • ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం • సీతారాముల కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో



ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై... ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వీవీఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధి పై చర్యలు తీసుకుంటున్నామని, అమరావతి–జగదల్‌పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

**ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష...**

మంత్రి పర్యటన తర్వాత మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ నేవీ చీఫ్ మృతి

**మొదటి పేజీ తరువాయి..**

క్యారియర్‌ను ఆవిష్కరించి, దానిని ఇరాన్ చరిత్రలో అతిపెద్ద నావికా సైనిక ప్రాజెక్ట్ అని అభివర్ణించారు. ఆ తర్వాత చేసిన వ్యాఖ్యలలో, ఇరాన్ స్థానాన్ని సవాలు చేస్తే శత్రువులను నరకపు అగాధంలోకి పంపుతామని ఆయన హెచ్చరించారు. ఏప్రిల్ 2025లో ఇరాన్ సముద్ర ప్రభావాన్ని ఎదుర్కొనే సామర్థ్యం అమెరికా నావికాదళానికి లేదు అని ప్రకటించారు.

**అనేక ఫ్రంట్లకు విస్తరిస్తున్న ఘర్షణ...**

అనేక ఫ్రంట్లలో ఇజ్రాయెల్‌కు సంబంధించిన ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. దాని ఉత్తర సరిహద్దు వెంట, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు హిజ్బుల్లాతో ఘర్షణలకు దిగుతున్నాయి. ఆ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్లలో తమ సైనికులలో ఒకరు మరణించినట్లు ఇజ్రాయెల్ అధికారులు ధృవీకరించారు. దీంతో మార్చి ఆరంభం నుండి ఆ ప్రాంతంలో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ ఏకకాల పరిణామాలు ఘర్షణ పరిధి విస్తరిస్తోందని సూచిస్తున్నాయి. ఇజ్రాయెల్ తన సరిహద్దులకు సమీపంలోనూ, సుదూరంలోనూ ఆపరేషన్లు నిర్వహిస్తోంది.

**తెహ్రాన్ అధికారికంగా ధృవీకరించ లేదు...**

తంగ్సిరి మరణాన్ని ఇరాన్ అధికారికంగా ధృవీకరించలేదు. ఇరాన్ అధికారుల నుండి ప్రకటన లేకపోవడం అనిశ్చితికి తావిచ్చింది. స్వతంత్ర ధృవీకరణ ఇంకా రావలసి ఉండటంతో పలు ఊహాగానాలు చక్కర్లు చేస్తున్నాయి. అయినప్పటికీ, ఈ నివేదిక ఇరాన్ నావికాదళ కమాండ్ వ్యవస్థ, గల్ఫ్‌లో దాని వ్యూహాత్మక వైఖరిపై సంభావ్య ప్రభావం గురించి ఇప్పటికే ఊహాగానాలకు దారి తీసింది. ఒకవేళ ఇది ధృవీకృతమైతే, ఇంతటి ఉన్నత స్థాయి కమాండర్‌ను కోల్పోవడం వలన గణనీయమైన కార్యాచరణ, ప్రతీకాత్మక పరిణామాలు సంభవించవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

## రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

**మొదటి పేజీ తరువాయి..**

పర్యటనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను సముపార్జించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం సభలో దావోస్ పర్యటనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయా పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఫలితంగా కొత్తగా 68,150 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు.2024లో 18 ఎంవోయూలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా, 2025లో 26 ఎంవోయూలతో రూ.1,78,950 కోట్లు కలుపుకుని మొత్తం 44 ఎంవోయూలతో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు.దావోస్ పర్యటనల్లో రూ.81,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. నిజామాబాద్ ఐటీ టవర్ మొత్తం 681 సీట్ల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం అక్కడ 11 కంపెనీలు 276 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రస్తావించారు.



## వైద్యరంగం బలోపేతం

**మొదటి పేజీ తరువాయి..**

ప్రస్తుతం నెలకు రూ. 89 కోట్లు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ. 130 కోట్ల ఈహెచ్ఎస్ బకాయిలను కూడా క్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని మంత్రి తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2400 కోట్లకు పైగా పేమెంట్స్ చేశామని, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు కేవలం రూ. 250 కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరిస్తున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 330గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య ఇప్పుడు 537కు పెరగడమే తమ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

## డిలిమినేషన్‌పై పార్లమెంట్‌లో చర్చకు రావాలి

కాంగ్రెస్ ఎంపీలకు రఘునందన్ రావు సవాల్

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే పార్లమెంట్‌లో డీలిమిటేషన్ పై కేంద్రం నిర్వహించతలపెట్టిన చర్చకు ముందుకు రావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ అనేది ఎన్నికల అంశం కాదన్న ఆయన ఇప్పటికే దానిని పార్లమెంట్‌లో అన్ని పార్టీల దృష్టికి తీసుకువచ్చామని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా రేవంత్ రెడ్డి ఒక మంచి లెక్కల టీచర్‌ను పెట్టుకోవాలని సలహా ఇచ్చారు. ప్రస్తుతం డీలిమిటేషన్‌లో భాగంగా ఉన్న స్థానాల్లో సగం స్థానాలు పెరుగుతాయని స్పష్టత ఇచ్చారు. మొదటి నుంచి నరేంద్ర మోడీ ఏది చేసినా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉంది కాబట్టి అక్కడ సీట్లు పెరుగుతాయని, దక్షిణాదిన సీట్లు తగ్గుతాయని చెప్పారు. ఇలా అర్థం లేని వాదనలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తామన్నా వ్యతిరేకించారని ఆరోపించారు. ఇప్పుడు 50 శాతం సీట్లు పెంచుతామంటే ఒప్పుకోమంటున్నారని మండిపడ్డారు.

## పిఆర్‌సి గడువు పెంపు

**మొదటి పేజీ తరువాయి..**

మళ్లీ ఎక్స్‌టెన్షన్ ఇస్తారా? కనీసం ఇప్పుడైనా రిపోర్ట్ తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని రెండు రోజుల క్రితం శాసనసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం మాత్రం మరోసారి పీఆర్సీ కమిటీ పొడిగింపుకే మొగ్గు చూపింది.

## ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు

• స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి • ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాల పై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ పేదలకు ధీమాబీమా

**మొదటి పేజీ తరువాయి..**

2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. అదే ఇప్పుడు ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని తమపై పెట్టిందన్నారు. గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ.600.27 కోట్లు అన్నారు. అందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ360.16 కోట్ల బకాయి ఉందన్నారు ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ.2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించినట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ927.99 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ 1,480.52 కోట్లు చెల్లించామన్నారు. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ. 54 కోట్లు అందించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు అన్నారు గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ100 కోట్లు మాత్రమేనన్నారు.. ఇందులోనూ ప్రభుత్వ ఆస్పత్రులకే ఎక్కువగా రూ.496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆస్పత్రులకు రూ231.44 కోట్లు ఉందన్నారు.

**1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా...**

రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడంతో చికిత్స అందడం లేదన్న వాదన అవాస్తవం అన్నారు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందేనన్న సీఎం... మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించామన్నారు. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు రూ. 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆస్పత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నట్లు చెప్పారు వైద్యులకు హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడంతో వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయన్న రేవంత్ రెడ్డి... నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఆస్పత్రుల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని ప్రకటించారు.విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను రూపొందిస్తున్నామన్నారు. వైద్యరంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తామన్నారు. అలాగే విద్య పరంగా నర్సరీ నుంచి పైస్థాయి వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.




## 2నుంచి 5 మండలాల్లో భూభారతి

**మొదటి పేజీ తరువాయి..**

అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేశామన్నారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు.

ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్ – డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకువచ్చామన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు.

ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు.

అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్‌బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో చేప

**మొదటి పేజీ తరువాయి..**

'మధ్యాహ్న భోజన పథకంలో చేపల కర్రీ అందిస్తాం. ఇప్పటికే కేబినెట్‌లో ఈ అంశంపై చర్చించాం. విద్యార్థులకు అందించేందుకు తిలాపియా అనే చేప రకాన్ని ప్రత్యేకంగా పెంచుతాం. ఈ చేపలో మధ్యలో వెను ముళ్లు మాత్రమే ఉంటుంది. పిల్లలు తినే సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ తిలాపియా చేపను ప్రత్యేకంగా పెంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తాం. అన్ని రంగాల్లోనూ తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.' అని వాకిటి శ్రీహరి తెలిపారు.

## డిజిటల్ బురిడీ..

**మొదటి పేజీ తరువాయి..**

అవినీతికి అడ్డుకట్ట వేసే విధంగా కేంద్రం ఉపాధిలో పనిచేసే కూలీల ఆధార్ కార్డును అనుసంధానం , ఈ కేవైసీ చేస్తూ ముఖ గుర్తింపు ద్వారా తమ హాజరును నమోదు చేసుకునే విధంగా కఠినంగా నిబంధనలు ప్రవేశ పెట్టిన విషయం అందరికీ తెలిసిందే.ఈ కొత్త నిబంధనల వల్ల ఉపాధి హామీ పనులలో పారదర్శకత పెరుగుతుందని, బినామీ కూలీల సమస్య తొలగిపోతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది . కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వలసలను తగ్గిస్తూ వారు నివసిస్తున్న చోటే ఉపాధిని కల్పించాలనే సంకల్పంతో గతంలో సంవత్సరానికి కనీసం వందరోజుల ఉపాధిని కల్పించారు. ప్రస్తుతం కొత్త చట్టం అమల్లోకి వచ్చాక సంవత్సరానికి 125 రోజుల పని దినాలు కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వరంగా భావిస్తారు. ఇదంతా ఇలా ఉంటే కేంద్రం ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న నకిలీ హాజరు అవినీతిని అరికట్టే విధంగా ఇంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెట్టిన కొంతమంది అవినీతిదారులు గతంలో లాగే నకిలీ డిజిటల్ ఫోటోలతో ముఖ గుర్తింపు ఆధారిత హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ను బురిడీ కొట్టించడం చర్చనీఅంశంగా మారింది. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని పలువురు నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం పరిధిలోగల పొట్లపల్లి గ్రామపంచాయతీలో ఎక్కడ లేని విధంగా ఉపాధి హామీ పథకంలో కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదు అయ్యేలా సృష్టించిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంలో (ఎన్.ఎం.ఎం.ఎస్) యాప్ ను సైతం బురిడీ కొట్టిస్తూ గత కొన్ని రోజులుగా డిజిటల్ ఫోటోలు క్యాప్చర్ చేయడం. జిల్లావ్యాప్తంగా చర్చనీ అంశంగా మారింది. అన్ని రోజుల నుండి ఫీల్డ్ అసిస్టెంట్ డిజిటల్ ఫోటోలు యాప్ లో నమోదు చేస్తున్న. సంబంధిత పంచాయతీ పర్యవేక్షణ అధికారులు, మండల పర్యవేక్షణ అధికారుల దృష్టికి చెరపోవడం గమనార్హం. జిల్లాలో గత కొన్ని రోజుల కింద ఉపాధిలో పనిచేసిన కూలీల ఫోటోలకు బదులుగా జిరాక్స్ ప్రింటెడ్ పేపర్లను, డిజిటల్ ఫోటోలను, మైనర్ పిల్లల ఫోటోలను సైతం పెట్టి సుజాతనగర్ మండలంలో హాజరును నమోదు చేసిన విషయంపై సంబంధిత మండల పర్యవేక్షణ అధికారుల దృష్టికి తీసుకుపోయిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది 2024 –25 సంవత్సరంలో సుజాతనగర్ మండలంలో భారీ అవినీతి జరిగిందని సామాజిక తనిఖీల్లో వెలువడిన వాస్తవాలు చూస్తూనే ఉన్నారు. అయినా ఈ సంవత్సరంలో కూడా మళ్లీ అవకాతవకలు చేయడం సంబంధిత పర్యవేక్షణ అధికారుల అండతోనే జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. జరుగుతున్న అవకతవకలపై అధికారుల చర్యలు శూన్యంగా మారి అవినీతి దారులు విచ్చలవిడిగా ఉపాధిలో నకిలీ హాజరులతో రాజ్యమేలుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఉపాధిలో నకిలీ ఫోటోలతో హాజరులు నమోదు చేసిన అవినీతిదారులపై నామమాత్రపు చర్యలు తీసుకోవడమే దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పని ప్రదేశంలో అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఉపాధిలో అవినీతి రోజు రోజుకి పెరుగుతుందని పలువురు నుంచి వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధిలో కూలీలు రాకపోయినా వారి స్థానంలో డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేసి కూలీల ఖాతాలో జమ అయిన సొమ్ములో పర్సంటేజీలు తీసుకుంటున్నారని .ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధిలో జరిగిన డిజిటల్ ఫోటోల అవకాతవకలపై సంబంధిత అధికారులను మందలించిన అలా జరగడానికి అవకాశం లేదు డిజిటల్ ఫోటోలు పెట్టిన తీసుకోదు అని పొంతన లేని సమాధానాలు పర్యవేక్షణ లోపంతో చెప్పడం విస్మయం. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పినపాక మండలం పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధిలో జరిగిన భారీ అవకాతవకపై సంబంధిత జిల్లా ఉపాధి అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి. సంబంధితలపై, చర్యలు తీసుకొని మరల ఉపాధిలో అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పొట్లపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ సందీప్ వివరణ చరవాణిలో కోరగా..

పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధి హామీ పథకంలో జరిగిన డిజిటల్ నకిలీ హాజరు అవకాతవకలపై గ్రామ పంచాయతీ సెక్రెటరీ వివరణ కోరగా వారు మాట్లాడుతూ.. పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధిలో ఏం జరిగిందో ఫీల్డ్ లో నిర్ధారించి ఏం జరిగిందో మళ్లీ చెబుతాం అని అన్నారు. ఆ తర్వాత వివరణ కోసం చరవాణిలో ప్రయత్నించగా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం.

పినపాక మండల ఉపాధి పర్యవేక్షణ అధికారి ఏపీవో స్వామి వివరణ చరవాణిలో కోరగా...

పినపాక మండలం పొట్లపల్లి గ్రామపంచాయతీలో జరిగిన డిజిటల్ నకిలీ ఫోటోల హాజరు నమోదు అవకాతవకలపై పినపాక మండల ఉపాధి పర్యవేక్షణ అధికారి ఏపీఓ వివరణ కోరగా.. పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధిలో జరిగిన హాజరులో డిజిటల్ ఫోటోలు నమోదు చేయరాదు చేసిన తీసుకోదు. నేను నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంలో నమోదు చేసిన హాజరులు సరి చూశాను అవి అప్లోడ్ చేసిన ఫోటోలు ఉపాధి కూలీ లైవ్లో ఉన్న ఫోటోనే డిజిటల్ ఫోటోలు కాదు అంటూ సమాధానం ఇవ్వడం చర్చనీయాంశం.

పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ వివరణ చరవాణిలో కోరగా ..

పొట్లపల్లి గ్రామపంచాయతీ ఉపాధిలో జరిగిన డిజిటల్ నకిలీ ఫోటో హాజరు అప్లోడ్ అవకాతవకలపై ఫీల్డ్ అసిస్టెంట్ ని వివరణ కోరగా... వారు మాట్లాడుతూ ఉపాధి హాజరులో జరిగిన డిజిటల్ ఫోటోల హాజరు నమోదు ఉపాధి కూలీ అందుబాటులో లేనందుకు అప్లోడ్ చేసాం కానీ అది తప్పేం ఉంది . కానీ అప్పుడు మనిషి రావాలి అందుబాటులో లేక నలుగురివి పెట్టాం.దానిని అధికారులతో మాట్లాడి హాజరును తొలగిస్తాం . నకిలీ డిజిటల్ ఫోటోలు అప్లోడ్ చేసింది నిజమే అని అన్నారు.

పినపాక మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో వెంకటేశ్వరరావు వివరణ చరవాణిలో ప్రయత్నించగా..

పినపాక మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో వెంకటేశ్వరరావు వివరణ చరవాణిలో కోరగా.. వారు మాట్లాడుతూ మీటింగ్ లో ఉన్నాను మరల కాల్ చేస్తా అని చెప్పిన తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం.



# జాతీయం-అంతర్జాతీయం



# దేశంలో ఎల్పీజీ, ఇంధన కొరతలేదు

## ఉద్దేశ్యపూర్వకంగానే భయాందోళనలు సృష్టిస్తున్నారు : పెట్రోలియం మంత్రిత్వ శాఖ

**న్యూఢిల్లీ, మార్చి 26 (వుదయం) :**

భారతదేశ ఇంధన, ఎల్‌పిజి సరఫరాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ గురువారం ధృవీకరించింది. అన్నిరిటైల్ అవుట్‌లెట్లలో తగినంత నిల్వలు ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చెంది భయాందోళనలతో కొనుగోళ్లకు పాల్పడుతున్నప్పటికీ, దేశీయ ఉత్పత్తి, దిగుమతులు ఇంధన సరఫరాకు పూర్తి భద్రతను కల్పిస్తున్నాయని, అనవసరమైన భయాందోళనలను వ్యాపింపజేస్తున్న తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టవద్దని మంత్రిత్వ శాఖ పౌరులకు సూచించింది. భారతదేశం ప్రపంచంలో పెట్రోలియం ఉత్పత్తులను శుద్ధి చేసే దేశాలలో నాలుగవ స్థానంలో, ఎగుమతి చేసే దేశాలలో ఐదవ స్థానంలో ఉంది. ఇది 150కి పైగా దేశాలకు ఇంధనాన్ని సరఫరా చేస్తోంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ లభ్యతకు పూర్తి హామీ ఇచ్చింది. లక్షకు పైగా ఉన్న అన్ని ఇంధన కేంద్రాలు రేషనింగ్ లేకుండా తెరిచే ఉన్నాయి. చెదురుమదురుగా జరిగిన భయాందోళన కొనుగోళ్లు



కూడా సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించే సమాచారం కారణంగానే జరిగాయి. చమురు కంపెనీల డిపోలు రాత్రంతా పనిచేస్తూనే ఉన్నాయి, నిరంతరాయ సరఫరాను నిర్ధారించడానికి పంపులకు రుణ సదుపాయం కల్పించినట్టు మంత్రిత్వ శాఖ వివరించింది.

**ముడి చమురు సరఫరా బలంగా కొనసాగుతోంది**

హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారతదేశం గతంలో కంటే 41కి పైగా సరఫరాదారుల నుంచి ఎక్కువ ముడి చమురును పొందుతోంది. ప్రతి రిఫైనరీ 100% కంటే ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తోంది. రానున్న 60 రోజులకు సరిపడా సరఫరా ఇప్పటికే సమకూరిందని, లభ్యతలో ఎలాంటి అంతరాయం లేదని మంత్రిత్వ శాఖ తెలిపింది.

**తగినన్ని వ్యూహాత్మక నిల్వలు**

కేవలం ఆరు రోజుల నిల్వ మాత్రమే ఉందని చెబుతున్న నివేదికలు అవాస్తవమని మంత్రిత్వ శాఖ తెలిపింది. ముడి చమురు, ఉత్పత్తులు, వ్యూహాత్మక నిల్వలతో కలిపి భారతదేశానికి 74 రోజుల మొత్తం నిల్వ సామర్థ్యం, సుమారు 60 రోజుల వాస్తవ నిల్వ ఉంది. అదనపు ముడి చమురు సేకరణ కొనసాగుతుండటంతో, దాదాపు రెండు నెలల సరఫరాకు భరోసా ఉంది.

**ఎల్పీజీ ఉత్పత్తి పెరిగింది, దిగుమతులు సురక్షితం**

దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 40% పెరిగి, ఇప్పుడు రోజువారీ అవసరాలలో 60% పైగా తీరుస్తోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా సహా ఇతర దేశాల నుండి 800 టీఎంటీల దిగుమతులు సురక్షితం చేశామని మంత్రిత్వ శాఖ పేర్కొంది. నిల్వలను నివారించడానికి వాణిజ్య కేటాయింపులను పెంచడంతో, చమురు కంపెనీలు ప్రతిరోజూ 50 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి.

**పీఎన్‌జీ ప్రోత్సాహానికి ఎల్పీజీ కొరతకు సంబంధం లేదు**

పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) పరిశుభ్రమైనది, సురక్షితమైనది, మరింత సరసమైనది కనుక దానిని ప్రోత్సహిస్తున్నామని పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భారతదేశం రోజుకు 92 ఎంఎంఎస్‌సీఎండీ సహజ వాయువును ఉత్పత్తి చేస్తూ, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తోంది. నగర గ్యాస్ పంపిణీ ప్రాంతాలు 2014లో 57 నుండి 300కు పైగా పెరిగాయి, గృహ కనెక్షన్లు 25 లక్షల నుండి 1.5 కోట్లకు పైగా పెరిగాయి. ఎల్పీజీ సరఫరా సురక్షితంగా ఉంది.

# నీరవ్ మోడీ భారత్‌కు రావలసిందే

## లండన్‌లో ఆయన పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు



**వుదయం డెస్క్, మార్చి 26 :**

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను (పిఎన్‌బి) వేల కోట్లకు ముంచి, పరారైన ఆర్థిక నేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ భారత్‌కు తిరిగి రావడం తప్పేటట్టు లేదు. అతడిని భారత్‌కు అప్పగించాలన్న కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఆయన తరఫు లాయర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఆఫ్ జస్టిస్ కింగ్స్ బెంచి డివిజన్ తిరస్కరించింది. భారత్‌కు రాకుండా ఉండేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలకు కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది.

పిఎన్‌బిని మోసగించిన కేసులో నిందితుడైన నీరవ్ మోడీ ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారు. ఆయనను స్వదేశానికి పంపించాలని భారత్ కోరినప్పుడు అక్కడి కోర్టు అంగీకరించింది. కాగా, దీన్ని సవాలు చేస్తూ నీరవ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భారత్ జైళ్లలో పరిస్థితులు, భద్రతపై భారత అధికారులు ఇచ్చిన హామీలు సందేహాస్పదమని ఆయన వాదించారు. ఈ విషయంపై మరోసారి దృష్టిసారించాలని అన్నారు. కానీ కోర్టు నీరవ్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. గత ఆదేశాలను మళ్లీ సమీక్షించేందుకు కారణాలు ఏవీ లేవని పేర్కొంది.

నీరవ్ మోడీ కేసులో సీబీఐ దర్యాప్తు చేపడుతోంది. ఆయనను భారత్‌కు రప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఆయనపై పలు కేసులు ఉండటంతో ఈడీ కూడా దర్యాప్తు జరుపుతోంది. పీఎన్‌బీ బ్యాంకుకు చెందిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్‌తో నీరవ్, ఆయన బంధువు మేహుల్ చోక్సీ భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిందే.

# హార్ముజ్ ద్వారా సురక్షిత యానానికి భారత్ నౌకలకు అనుమతి

## పశ్చిమ ఆసియా సంఘర్షణలో ఇరాన్ అనుమతించిన ఐదు దేశాలలో భారత్ ఒకటి

**వుదయండెస్క్, మార్చి 26 :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నడుమ, భారత్ సహా ఎంపిక చేసిన మిత్రదేశాలకు చెందిన నౌకలను వ్యూహాత్మకమైన కీలక హార్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా వెళ్లేందుకు అనుమతించాలని ఇరాన్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాగా, మిగిలిన వాళ్లకు ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. సంఘర్షణ ప్రభావిత




ప్రాంతంలో ఇరాన్ పాక్షిక దిగ్బంధనాన్ని అమలు చేస్తూ, అదే సమయంలో తనకు సన్నిహిత సంబంధాలున్న దేశాలకు ప్రవేశాన్ని కల్పిస్తున్న తరుణంలో ఈ చర్య తీసుకుంది. భారతదేశంతో పాటు, రష్యా, చైనా, పాకిస్తాన్, ఇరాక్‌లకు చెందిన నౌకలకు కూడా ఈ కీలకమైన సముద్ర మార్గం గుండా సురక్షిత ప్రయాణానికి అనుమతి లభించింది.

ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, ఆ జలమార్గం పూర్తిగా మూసివేయలేదని, ఈ ఏర్పాటు వల్ల భారతీయ నౌకలు ఇప్పటికే ప్రయోజనం పొందాయని ధృవీకరించారు.

చాలా మంది నౌకా యజమానులు, లేదా ఈ నౌకలను కలిగి ఉన్న దేశాలు, మమ్మల్ని సంప్రదించి, జలసంధి గుండా తమ సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించాలని అభ్యర్థించారు. మేము మిత్రదేశాలుగా భావించే కొన్ని దేశాలకు, లేదా ఇతర కారణాల వల్ల మేము అలా చేయాలని నిర్ణయించుకున్న సందర్భాలలో, మా సాయుధ దళాలు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాయి, అని ప్రభుత్వ టీవీకి చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదిక పేర్కొంది.

మీరు వార్తలలో చూసినట్లుగా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్, భారతదేశం ఇందులో ఉన్నాయి. కొన్ని రాత్రుల క్రితం భారతదేశానికి చెందిన రెండు నౌకలు, మరికొన్ని దేశాలు, బంగ్లాదేశ్ కు చెందినవి కూడా ప్రయాణించాయని తాను నమ్ముతున్నానని, ఇవి తమతో మాట్లాడి, సమన్వయం చేసుకున్న దేశాలంటూ, యుద్ధం తర్వాత కూడా భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని తెలిపారు.

అయితే, తాము శత్రు దేశాలుగా అభివర్ణించిన దేశాలకు, వాటి మిత్రదేశాలకు జలసంధిలోకి ప్రవేశం పరిమితంగానే ఉంటుందని ఇరాన్ స్పష్టం చేసింది. కొనసాగుతున్న సంఘర్షణలో పాల్గొంటున్న యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్, కొన్ని గల్ఫ్ దేశాలకు చెందిన నౌకలను ప్రయాణించడానికి అనుమతించరు.

తాము యుద్ధ స్థితిలో ఉన్నామని, ఈ ప్రాంతం ఒక యుద్ధ క్షేత్రం; కనుక, మా శత్రువుల, వారి మిత్రదేశాల నౌకలను జలసంధి గుండా వెళ్లడానికి అనుమతించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. అయితే, ఇతర దేశాలకు మాత్రం ఈ మార్గం అందుబాటులోనే ఉంటుంది, అని అరఘ్చి పేర్కొన్నారు.

ఈ జలమార్గంపై ఇరాన్‌కు ఉన్న ఆధిపత్యాన్ని అరఘ్చి నొక్కిచెప్పారు. ఈ పాక్షిక దిగ్బంధంపై తొలుత ప్రపంచవ్యాప్తంగా సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఇది ఆ దేశపు వ్యూహాత్మక సామర్థ్యాన్ని స్పష్టంగా చాటిచెప్పిందని ఆయన తెలిపారు. ఇలాంటి పని చేసే ధైర్యం ఇరాన్‌కు లేదని వారు భావించారు. కానీ మేము దానిని ఎంతో బలంగా చేసి చూపించాం. దీనిని అడ్డుకోవడానికి వారు తమ సర్వశక్తులను ఒడ్డారు, కానీ విఫలమయ్యారు. వారు ఇతర దేశాలను కూడా ఆశ్రయించారు. ఈ జలమార్గాన్ని తిరిగి తెరిచేందుకు వచ్చి సహాయపడమని, తాము స్వయంగా శత్రువులుగా భావించే వారిని కూడా వారు వేడుకున్నారు. కానీ ఎవరూ స్పందించలేదు; ఎందుకంటే, ఆ పని ఆచరణసాధ్యం కాదు, అని అరఘ్చి పేర్కొన్నారు.

ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు కేంద్రంగా కొనసాగుతోంది. ఇరాన్ అనుసరిస్తున్న ఎంపిక చేసిన ప్రవేశ విధానం ప్రస్తుతం ఈ ప్రాంతంలో సముద్రయాన కదలికలను ప్రభావితం చేస్తోంది.

ఇతర దేశాలకు చెందిన లేదా వాటితో సంబంధం ఉన్న నౌకలతో సహా, శత్రుత్వం వహించని నౌకలు అవి ఇరాన్‌పై దురాక్రమణ చర్యలలో పాల్గొనకుండా లేదా వాటికి మద్దతు ఇవ్వకుండా, ప్రకటించిన భద్రతా నిబంధనలను పూర్తిగా పాటించిన పక్షంలో సమర్థవంతమైన ఇరాన్ అధికారుల సమన్వయంతో హార్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు అని న్యూయార్క్‌లోని ఇరాన్ మిషన్ ఎక్స్‌పై పోస్టు చేసింది.

# యుఎఇలో క్షిపణి శకలాలు పడి 2 మృతి

**వుదయం డెస్క్, మార్చి 26 :**

అబుదాబిలోని ఒక వీధిపై, వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకున్న క్షిపణుల శకలాలు పడటంతో కనీసం ఇద్దరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది.

ఇరాన్ నుండి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులకు యుఎఇ వాయు రక్షణ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ప్రతిస్పందిస్తున్నాయని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన హెచ్చరికలు వెల్లడిస్తున్నాయి. వాయు రక్షణ వ్యవస్థల ద్వారా ఒక బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డుకున్న అనంతరం, స్వీహాన్ వీధిలో శకలాలు పడిన ఘటనపై అబుదాబి అధికారులు స్పందించారు, అని అబుదాబి మీడియా కార్యాలయం పేర్కొంది.

ఈ ఘటనలో ఇద్దరు గుర్తుతెలియని



వ్యక్తులు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు, పలు కార్లు దెబ్బతిన్నాయి. తదుపరి వివరాలు తగిన సమయంలో తెలియచేస్తామని ఆ సంస్థ పేర్కొంది.

అబుదాబిలో జరిగిన తాజా ఘటనతో మొత్తం మరణాల సంఖ్య 11కి చేరిందని గల్ఫ్ న్యూస్ నివేదించింది.

గతంలో మరణించిన తొమ్మిది మందిలో సాయుధ దళాలకు చెందిన ముగ్గురు సభ్యులు ఉన్నారు.

పాకిస్తానీ, నేపాలీ, బంగ్లాదేశీ, పాలస్తీనియన్ జాతీయతలకు చెందిన ఆరుగురు వ్యక్తులు కూడా ఇప్పటివరకు మరణించారని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఇరాన్ దారుణమైన దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుండి, యుఎఇ వాయు రక్షణ వ్యవస్థలు 357 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,815 యుఎవిలను ఎదుర్కొన్నాయి అని బుధవారం మంత్రిత్వ శాఖ పేర్కొంది. బుధవారం నాటికి మొత్తం 166 మంది గాయపడ్డారు; వీరి గాయాలు స్వల్పం నుండి మధ్యస్థ, తీవ్ర స్థాయిల వరకు ఉన్నాయి. గాయపడిన వారిలో యుఎఇ, ఈజిప్ట్, సూడాన్, ఇథియోపియా, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్, ఇరాన్, ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అజర్‌బైజాన్, యెమెన్, ఉగాండా, ఎరిట్రియా, లెబనాన్, ఆఫ్ఘనిస్తాన్, బహ్రెయిన్, కొమొరోస్, టర్కీ, ఇరాక్, నేపాల్, నైజీరియా, ఒమన్, జోర్డాన్, పాలస్తీనా, ఘానా, ఇండోనేషియా, స్వీడన్, టునీషియా దేశాలకు చెందిన పౌరులు ఉన్నారని అది తెలిపింది.

ఎటువంటి ముప్పులనైనా ఎదుర్కోవడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, దేశ సార్వభౌమత్వం, భద్రత, స్థిరత్వానికి రక్షణ కల్పిస్తూ, జాతీయ ప్రయోజనాలు, సామర్థ్యాలను పరిరక్షించే రీతిలో దేశ భద్రతను దెబ్బతీసే ఏ ప్రయత్నాలనైనా దృఢంగా ఎదుర్కొంటామని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# మీడియా మాపై తప్పుడు ప్రచారాలు చేస్తోంది

## ఇరాన్‌కు మద్దతుపై క్రెమ్లిన్ స్పష్టీకరణ

**వుదయం డెస్క్, మార్చి 26 :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణలో తెహ్రాన్‌కు మాస్కో మద్దతునిస్తూ, డ్రోన్లను పంపడానికి రష్యా సిద్ధంగా ఉందంటూ వచ్చిన వార్తలను క్రెమ్లిన్ ఖండించింది. తమ గురించి అనేక అబద్ధాలు మీడియా ప్రచారం చేస్తోందని, వాటిని నమ్మవద్దని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ విజ్ఞప్తి చేశాయి.

అంతకు ముందు మీడియాలో, అమెరికాఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తోన్న ఇరాన్‌కు రష్యా నుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోందని పేర్కొంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను బట్వాడా చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికానుందని వెల్లడించాయి. డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందంటూ వివరించాయి. ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారు



చేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్‌మెంట్లు చేస్తోంది అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని మీడియా సంస్థలు ఉటంకించాయి.

అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'వాస్తవ సమయ నిఘా' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం. ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. 'ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం అని స్పష్టం చేశారు.

ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రం నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి పిలిపించింది. మంగళవారం ఈ కేంద్రంపై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ కేంద్రాన్ని నిర్మించింది రష్యానే. మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది.

# బుర్జ్ ఖలీఫా చేరిన మహాదేవ్ బెట్టింగ్ యాప్ దర్యాప్తు



**వుదయం డెస్క్, మార్చి 26:** వందల కోట్ల రూపాయల విలువైన మహాదేవ్ యాప్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేపట్టిన దర్యాప్తు ఇప్పుడు బుర్జ్ ఖలీఫా వరకు విస్తరించింది. దుబాయ్ హిల్స్ ఎస్టేట్ లోని అపార్ట్‌మెంట్లు, బిజినెస్ బే, ఎస్ ఎల్ ఎస్ హోటల్ అండ్ రెసిడెన్సెస్‌లోని విలాసవంతమైన నివాసాలు, అలాగే బుర్జ్ ఖలీఫాలోని ఒక ఫ్లాట్‌తో సహా మొత్తం రూ. 1,700 కోట్ల విలువైన ఆస్తులను ఇడి జప్తు చేసినట్లు ఒక అధికారిని ఉటంకిస్తూ ది ప్రింట్ పత్రిక నివేదించింది.

ఎస్ ఐఎతో పాటు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ ఐఎ), ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి పలు జాతీయ సంస్థల నిశిత పరిశీలన పరిధిలోకి ఈ దర్యాప్తు ఇప్పుడు చేరింది.

ఈ ఆస్తులు మహాదేవ్ ఆన్‌లైన్ బుక్ బెట్టింగ్ వేదిక ప్రధాన నిర్వాహకులలో ఒకరైన సౌరభ్ చంద్రకర్‌కు చెందినవని అధికారులు తెలిపారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన నేరాలకు పాల్పడటం ద్వారా సమకూరిన నేర ఆదాయంతో ఈ ఆస్తులను సముపార్జించారు, అని ఆ అధికారి తెలిపారు. వికాస్ ఛపారియా, రోహిత్ గులాటి, అతుల్ అరోరా, నితిన్ తిబ్రెవాల్, సురేంద్ర బగ్రీలతో సహా, అతడు, అతని అనుచరుల నియంత్రణలో ఉన్న సంస్థల ద్వారా ఈ ఆస్తులను కలిగి ఉన్నారు.

**మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు ఏమిటి?**

నకిలీ గుర్తింపులతో తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా వేల కోట్ల రూపాయలు మళ్లించినట్టుగా ఆరోపణలు ఎదుర్కొన్న చట్టవిరుద్ధ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించినది. ఇందులో షెల్ కంపెనీలు, విదేశీ కాల్ సెంటర్లు, హవాలా నెట్‌వర్క్‌తో కూడిన ఒక సంక్లిష్టమైన వలయం కూడా ఉంది.

మహాదేవ్ ఆన్‌లైన్ బుక్ యాప్, పోకర్, కార్డ్ గేమ్స్, అవకాశంపై ఆధారపడిన గేమ్స్ వంటి లైవ్ గేమ్స్ తో పాటు, క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి వర్చువల్ క్రీడలపై కూడా బెట్టింగ్‌కు వీలు కల్పించిందని ఆరోపణలు ఉన్నాయి. వినియోగదారులు టీన్ పట్టి, పోకర్, డ్రాగన్ టైగర్ ఆడటంతో పాటు, భారతదేశంలోని ఎన్నికలపై కూడా పందాలు వేయగలిగారు. వాస్తవానికి భిలాయ్‌కు చెందిన చంద్రకర్, అతని సహచరులు, భారీ సంఖ్యలో వినియోగదారులను సంపాదించి, చట్టవిరుద్ధంగా రూ. 5,000 కోట్లకు పైగా సంపాదించారని, ఆ సొమ్మును హవాలా మార్గాల ద్వారా విదేశాలకు పంపి, లంచాలు చెల్లించడానికి ఉపయోగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

# రష్యా ముడిచమురు రవాణా నౌకపై దాడి

**వుదయం డెస్క్, మార్చి 26:**

విదేశీ జెండాతో తుర్కియే నిర్వహణలో గల ముడిచమురు టాంకర్‌పై నల్లసముద్రంలో దాడి జరిగింది. రష్యా చమురు రవాణా చేస్తున్న నౌకపై దాడి జరిగింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని తుర్కియే రవాణా శాఖ మంత్రి అబ్దుల్‌ఖాదిర్ వెల్లడించారు. తుర్కియే కంపెనీ ఆధ్వర్యంలో విదేశీ జెండాతో వెళ్తున్న నౌక అది. అది రష్యా నుంచి ముడి చమురు తీసుకొస్తోంది. దాని ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించినట్లు తమ ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌కు సమాచారం వచ్చిందని తెలిపారు. ఇంజిన్



రూమ్ లక్ష్యంగా ఆ దాడి జరిగిందని, అది డ్రోన్ కాకపోవచ్చని పేర్కొన్నారు. అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెహికిల్ దాడి కావొచ్చు అని మంత్రి వెల్లడించారు. బాస్ఫరస్ జలసంధికి 30 కి.మీ.దూరంలో ఈ దాడి జరిగింది. ఆ నౌకపై ఉన్న జెండా సియెర్రా లియోన్ దేశానిదని తెలుస్తోంది. నౌకలో దాదాపు ఒక మిలియన్ డాలర్ల రష్యా ముడి చమురు ఉందని తెలుస్తోంది. ఈ నౌక నొవొరొసిస్క్ నుంచి బయలుదేరినట్టు డేటా వెల్లడిస్తోంది.

# విభేధాలను తగ్గించుకునేందుకు జి7 సమావేశం

**వుదయం డెస్క్, మార్చి 26 :**

మధ్యప్రాచ్య యుద్ధంపై అమెరికాతో ఉన్న విభేదాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూనే, ఉక్రెయిన్, గాజా వంటి ఇతర సంక్షోభాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న జి7 యూరోపియన్ దేశాలు, మిత్రదేశాల విదేశాంగ మంత్రులు గురువారం నుంచి పారిస్ వెలుపల సమావేశమవుతున్నారు.

పారిస్ వెలుపల గ్రామీణ ప్రాంతంలోని వాక్స్ డి సెర్నే అబ్బేలో ఏడు ప్రముఖ పారిశ్రామిక ప్రజాస్వామ్య దేశాల రెండు రోజుల సమావేశం జరుగుతున్న తరుణంలో, ట్రంప్ ప్రకటన చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించే ఒప్పందాన్ని ఇరాన్ అంగీకరించకపోతే, తీవ్ర చర్యలు తీసుకోవడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నారని వైట్ హౌస్ పేర్కొంది.

యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి తన తొలి విదేశీ పర్యటనలో భాగంగా, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కెనడా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, జపాన్, యూకే దేశాల అగ్రశ్రేణి దౌత్యవేత్తలతో కలిసి రెండవ రోజు మాత్రమే పాల్గొంటారు.

వంతులవారీగా జి7 అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్న క్రమంలో ఈ ఏడాది ఆ స్థానంలో ఉన్న ఫ్రాన్స్ లక్ష్యాలలో ఒకటి, ప్రధాన ప్రపంచ అసమతుల్యతలను పరిష్కరించే మార్గాలను కొనుగొనడమని పేర్కొంది. మన తోటి పౌరులపై దుష్పరిణామాలను కలిగిస్తున్న అనేక స్థాయిల్లోని ఉద్రిక్తత, శత్రుత్వానికి ఈ అసమతుల్యతే కారణమని, ఫ్రెంచి విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారట్ పేర్కొన్నారు.

ఇరాన్ మద్దతుగల షియా మిలిటెంట్ గ్రూప్ హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లను ప్రయోగించడంతో లెబనాన్‌ను కూడా యుద్ధంలోకి లాగిన నేపథ్యంలో, దక్షిణ లెబనాన్‌లోని ఒక



ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకోవడానికి బలగాలను పంపవద్దని బారట్ ఇజ్రాయెల్‌ను కోరారు.

1975లో సమీపంలోని చాటో డి రాంబొయిలెట్‌లో జరిగిన మొదటి జి6 శిఖరాగ్ర సమావేశంతో ప్రారంభమైన ప్రతిష్టాత్మక జి7 కూటమి పరిధిని విస్తరించే ప్రయత్నంలో, ఫ్రాన్స్ కీలక వర్ధమాన మార్కెట్లైన బ్రెజిల్, భారతదేశంతో పాటు ఉక్రెయిన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియాల విదేశాంగ మంత్రులను కూడా ఆహ్వానించింది.

సోమవారం నాడు, ఆర్థిక మంత్రులు, ఇంధన మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్లను ఒకచోట చేర్చే ప్రత్యేక జి7 సమావేశానికి కూడా ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనుందని ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ గురువారం ఆర్‌టిఎల్ రేడియోతో తెలిపారు.

వీడియో కాల్ ద్వారా జరగనున్న ఈ సమావేశం, లెస్క్యూర్ అభివర్ణించినట్లుగా ఇంధన సమస్యలు, ఆర్థిక సమస్యలు, ద్రవ్యోల్బణ సమస్యల సమ్మేళనం వంటి అంశాలను చర్చించనుంది.

**తప్పుడు విధానాలు**

జి7 దేశాలన్నీ అమెరికాకు సన్నిహిత మిత్ర దేశాలే అయినప్పటికీ, ఇరాన్‌పై దాడికి ఏ దేశమూ స్పష్టంగా మద్దతు ప్రకటించకపోవడం ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది.

జర్మనీ ఆర్థిక మంత్రి, వైస్ ఛాన్సలర్ లార్స్ క్లింగ్‌బీల్ అయితే, మధ్యప్రాచ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న తప్పుడు విధానాలు జర్మనీ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని కూడా ఫిర్యాదు చేశారు.

సంఘర్షణను ముగించేందుకు ఇరాన్ మత వ్యవస్థలోని ఒక అత్యున్నత వ్యక్తితో అమెరికా చర్చలు జరుపుతోందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్ ద్వారా అందించిన శాంతి ప్రణాళికను తెహ్రాన్ తిరస్కరించిందని ఇరాన్ ప్రభుత్వ టీవీ బుధవారం తెలిపింది.

**ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడి చేస్తామన్న ట్రంప్ బెదిరింపు**

ప్రస్తుతం జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆయన ఆ బెదిరింపును విరమించుకున్నారు. కాగా, ఇది ఐరోపా మిత్రదేశాలను కలవరపరిచింది. ఆ దేశాలన్నీ ఉద్రిక్తతలను తగ్గించాలని పిలుపునిచ్చాయి, అంతేకాక ఈ సంఘర్షణలో సైనికపరంగా జోక్యం చేసుకోవద్దని కోరాయి. గాజా శాంతి ప్రణాళిక, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో జరుగుతున్న హింసాకాండపై నుండి యుద్ధం దృష్టిని మళ్లించిందని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభమై నాలుగేళ్లకు పైగా గడిచిన నేపథ్యంలో, ఉక్రేనియన్ ప్రతిఘటనకు మద్దతు, రష్యాపై ఒత్తిడి కొనసాగుతాయని బారోట్ ఎఎఫ్‌పికి తెలిపారు.






“మధ్యవర్తిత్వ పాత్ర కోసం పాకిస్తాన్‌ను అసలు పరిగణనలోకి తీసుకోవడమే, ప్రధాని మోడీ నిష్ప్రయోజక శైలికి దౌత్య వైఫల్యానికి నిదర్శనం. ముంబైలో 26/11 ఉగ్రదాడుల తర్వాత పాకిస్తాన్ ఏకాకిగా మిగిలిపోయిందన్న విషయం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పాకిస్తాన్ దుష్ట పాత్ర గురించి ప్రపంచాన్ని నమ్మించగలిగింది. దీనికి విరుద్ధంగా, గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడులకు పాకిస్తాన్ సైన్యాధిపతి జనరల్ అసిమ్ మునీర్ చేసిన మత విద్వేషపూరిత, విషపూరిత ప్రకటనలే అసలు కారణమైనప్పటికి మనం ఆ విషయాన్ని తగినంతగా ప్రచారం చేసి అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌ను ఏకాకిని చేయలేకపోయాం. నిజానికి పాకిసాన్ ఇప్పుడు మరింత ముఖ్యమైన శక్తిగా మారింది. గత ఏడాది మే 10 తర్వాతే, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి, అతని బృందానికి ఇష్టమైన వ్యక్తి కాగలిగారని స్పష్టమైంది.”

* – జయరాం రమేష్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జి

## వే'మన'పద్యం

**అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బల్కు జల్లగాను**
**కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**



## సంపాదకీయం

# టీం ఇండియా స్ఫూర్తితో...

పర్షియన్ గల్ఫ్ లోని హోర్ముజ్ జలసంధిలో రెండు పదులకు పైగా భారత ఎల్ పి జి, ఎల్ ఎన్ జి ,క్రూడాయిల్ నౌకలు నిలిచి పోవడం దేశంలో వంట గ్యాస్, ఆయిల్ కొరతను తీవ్రతరం చేస్తున్న అంశం. అయినా గ్యాస్ కి గాని ఆయిల్ కి గాని ఎటువంటి కొరత లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నొక్కి వక్కాణిస్తున్నాయి. కాని మీడియా సమాచారాన్ని, ఫోటోలను, క్షేత్ర స్థాయి వాస్తవాలను గమనిస్తే పెట్రోల్, గ్యాస్ కోసం ప్రజలు కళ్ళు కాయలు కాయేలా ఎదురు చూస్తున్నారని బోధపడుతుంది. ప్రతి పెట్రోల్ బంకు వద్ద, గ్యాస్ సరఫరా కేంద్రాలవద్ద ప్రజలు నిరాశా దృక్కులతో దీర్ఘ క్యూలల్లో ఎదురు చూస్తున్న తీరు అందోళణకరంగా ఉంది.కేంద్రం వంట గ్యాస్ వాణిజ్య సరఫరాలను తగ్గించడం తీవ్రమైన దెబ్బ తీసింది. ప్రస్తుతానికైతే కేంద్ర పాలకులు నిబ్బరాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ యుద్ధసంక్షోభం ముగుస్తున్న కొద్దీ దేశంలో వీటి సరఫరాలకు అంతరాయం పెరిగి మధ్య, పేద తరగతుల ఇళ్ల ల్లో పొయ్యిలు వెలగని దుస్థితి సంభవిస్తుంది. పెట్రోల్ గాని గ్యాస్ గాని దేశంలో ఉత్పత్తి అయ్యేవి కాదు, కాని ఇటువంటి అత్యవసర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు నిల్వలను పెంచుకోవడంలో దేశ నాయకత్వ వైఫల్యాన్ని వేలెత్తి చూపకుండా ఉండలేము.స్వాతంత్యం వచ్చి ఇన్నేళ్లయినా ఆయిల్, గ్యాస్ దేశీయ నిక్షేపాల అన్వేషణ ఊపందుకోకపోవడం మన పాలకుల వైఫల్యానికి నిదర్శనమని అనకతప్పదు . అంబానీల వంటి ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ అండతో ఇటు ఒ ఎన్ జి సి వంటి సంస్థలను తమ దారిలో పెట్టుకుని అటు రష్యా నుంచి చౌక ముడి చమురును తెచ్చుకుని శుద్ధి చేసి యూరపు దేశాలకు అమ్ముకుంటూ వచ్చాయి .దేశస్థుల ఇబ్బందులు తీర్చే దారులను వెతకాల్సిన అవసరాన్ని మాత్రం అవి గుర్తించడం లేదనే అభిప్రాయం ఉన్నది.హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న భారత నౌకలలో 1.67 మిలియన్ టన్నుల క్రూడాయిల్, 3.2 లక్షల టన్నుల ఎల్ పి జి, 2లక్షల టన్నుల ఎల్ ఎన్ జి ఉన్నాయని సమాచారం.ఇలా ఇరుక్కుపోయిన టాంకర్ నౌకలను దౌత్య నేర్పుతో అతి కష్టంగా ఒకటొకటిగా బయటికి రప్పించడంలో మన ప్రభుత్వం సఫలమౌతున్నా దానివల్ల తగినంత ప్రయోజనం కలగడం లేదు. పెట్రోల్, గ్యాస్ సంక్షోభం మరింత ముదిరే సూచనలే కనిపిస్తున్నాయి. భారత క్రూడ్ దిగుమతుల్లో 45 శాతం, ఎల్ పి జి లో 60 శాతం హోర్ముజ్ గుండానే వస్తున్న సంగతి గుర్తు పెట్టుగోదగినది.గతంలో రష్యా నుంచి తక్కువ ధరకు క్రూడ్, గ్యాస్ దొరుకుతూ వచ్చిన సులభమైన దారి ఇప్పుడు మూసుకుపో యింది హోర్ముజ్ పై సడలించని పట్టుతో అమెరికా మెట్టు దిగేలా చేసుకున్నానన్న ధీమా ఇరాన్ ను మరింత బిగుసుకుపోయేలా చేస్తుంది.అందుచేత మన దారులను మనం వెతుక్కోవాలి.ఇప్పటికే హోర్ముజ్ బయటి వనరులనుంచి సంగ్రహించే క్రూడ్ కిమ్మత్తును బాగా పెంచినట్లు చెబుతున్నారు. ఇప్పుడు 40 దేశాల నుంచి చము రును సేకరిస్తున్నామని అంటున్నారు. కాని సంక్షోభ తీవ్రత అలాగే ఉన్నట్టు బోధపడుతున్నది. ఈ నేపథ్యంలోనే ప్రధాని నేడు సి ఎం లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు, పరిస్థితి విషమిస్తే కరోనా నాటి మాదిరిగా టీం ఇండియా స్ఫూర్తితో వ్యవహరించాలని ప్రధాని మోడీ అంటున్నారు. అంటే లాక్ డౌన్ వంటి పరిస్థితి వచ్చినా సంఘటితంగా ఎదుర్కోగలగాలి. ఇటువంటి సమయాల్లో అవసరాలు తగ్గించుకుని మరీ జాతి ఔన్నత్యాన్ని చాటాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ‘ఆత్మనిర్భర భారత్’ను ప్రశ్నిస్తున్న సంక్షోభం!

2026 ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హత్య జరగడం మధ్యప్రాచ్యాన్ని గందరగోళంలోకి నెట్టింది. ఇది ఆ ప్రాంతంలో, విదేశాలలో భవిష్యత్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రమాదాన్ని పెంచడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జనవరిలో వెనిజులాలో, ఇప్పుడు ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌లో 'బలవంతుడిదే రాజ్యం' అనే సిద్ధాంతాన్ని ఉపయోగించగా, రష్యా 2022 ఫిబ్రవరి నుండి ఉక్రెయిన్‌లో అదే సిద్ధాంతాన్ని ఉపయోగిస్తోంది. చైనా గత దశాబ్ద కాలంగా తైవాన్‌పై అదే బలప్రయోగ వ్యూహాలను ఉపయోగిస్తోంది. ఉక్రెయిన్ మాస్కోతో తన సంఘర్షణలోకి ఐరోపాను లాగినట్లే, ఇరాన్ పర్షియన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకాయానాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రపంచ ఇంధన సంక్షోభాన్ని ప్రేరేపించింది. తద్వారా తన యుద్ధ వ్యూహానికి మొత్తం మధ్యప్రాచ్యాన్ని, దాని వెలుపలి ప్రాంతాలను కూడా అనూహ్యమైన నష్టాలకు గురి చేసింది. అమెరికా, రష్యా ఇంధన విషయంలో సురక్షితంగా ఉన్నాయని, ఎదుగుతున్న శక్తి అయిన చైనా పైప్‌లైన్‌లు, దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా తన ఇంధన అవసరాలను తీర్చుకుందని మనం గ్రహించినప్పుడు, గతంలో భారత ప్రభుత్వాల దూరదృష్టి లోపం స్పష్టమవుతుంది. గతంలో శాంతి, అలీన విధానానికి ఎన్నడూ వెనుకాడని దేశమైన భారతదేశం, చమురు, ఎల్ఎన్జి, ఎల్పిజి, ఎరువులను అధికంగా దిగుమతి చేసుకోవడం వల్ల నేడు బలహీనంగా మారింది. ఇప్పటికి కూడా దేశంలో సమృద్ధిగా చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని భరోసా ఇస్తున్నారేగాని ఎన్ని రోజులకు సరిపడిన నిల్వలు ఉన్నాయో స్పష్టత లేదు. పెట్రోల్ బ్యాంకుల వద్ద క్యూలు ఎందుకు ఏర్పడుతున్నాయో తెలియదు. ఏ ప్రభుత్వ ప్రతినిధి అయినా, మంత్రి అయినా, పార్లమెంట్ సభ్యుడైనా పెట్రోల్ బ్యాంకుల వద్దకు లేదా గ్యాస్ స్టేషన్ లకు వెళ్లి సమస్య ఎక్కడ ఉందొ చూసే ప్రయత్నం చూస్తున్నారా? మీడియా ప్రకటనలకు పరిమితం అవుతున్నారు. ఐరోపా, జపాన్ వంటి దేశాలలో ఎక్కడా చమురు, గ్యాస్ ల కోసం అలజడి కనిపించడం లేదు. వారు సమృద్ధిగా నిల్వలు ఉంచుకున్నారు. కేవలం దక్షిణాసియా దేశాలలోనే చూస్తున్నాము. గందరగోళంలో రష్యా నుండి గత జనవరిలో చెల్లించిన ధరకు దాదాపు రెట్టింపు ధరలో చమురు దిగుమతి చేసుకోవలసి రావడం మన దివాలాకోరు విధానాలను వెల్లడి చేస్తుంది. ఇటువంటి సమయంలో దేశ ప్రజలను విశ్వాసంలోకి తీసుకొని వాస్తవాలు చెప్పాలి. పాలనలో పారదర్శకత అవసరం. ప్రధాన హార్డ్‌వేర్ ప్లాట్‌ఫారమ్‌లకు భారతదేశం అసలు పరికరాల తయారీదారు కాకపోవడం, తన జాతీయ భద్రతా అవసరాల కోసం రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాలపై ఆధారపడటం భారతదేశ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. భారత సాయుధ దళాలు విదేశాల నుండి పరికరాలను కొనుగోలు చేయడానికే ఇష్టపడతాయి. రక్షణ ఒప్పందాలలో భారీగా ఉండే ముడుపులు మన దేశం స్వావలంబన ఆశయాన్ని వమ్ము చేస్తున్నాయని చెప్పవచ్చు. మరోవంక, భారత ప్రభుత్వ రంగ సంస్థలు నూతన సాంకేతికతను అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. వాటి సామర్థ్యాన్ని పటిష్ఠపరచడం పట్ల దృష్టి సారించడం లేదు. ఈ ప్రక్రియలో నెలకొన్న అవినీతి చర్యల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న సంకేతాలు కనిపించడం లేదు. వీటి ఉత్పత్తులు భారత సాయుధ దళాలలోకి ప్రవేశించేలోపే వాస్తవంగా పాతబడిపోతున్నాయి. కేంద్ర బడ్జెట్ లో రక్షణ రంగానికి లక్షల కోట్ల రూపాయాలు కేటాయిస్తున్నా అందులో 80 శాతం వరకు సిబ్బంది జీతాలు, పెన్షన్లు, నిర్వహణ వ్యయాలకే సరిపోతుంది. ఆధునిక వ్యయాలకు లభించే నిధులు చాలా తక్కువ. భారత ప్రభుత్వం వివిధ దేశాలతో చేసుకున్న రక్షణ దిగుమతుల ఒప్పందాలకు అవసరమైన నిధులు సమకూర్చుకోవాలంటే మన బడ్జెట్ కేటాయింపులు పదేళ్ళకైనా సర్దుబాటు కావని చెబుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆత్మనిర్భరత' గురించి, స్వదేశీ హార్డ్‌వేర్ ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం గురించి ఎంతగానో మాట్లాడుతున్నప్పటికీ, దిగుమతి చేసుకున్న ప్లాట్ ఫారమ్‌లు, స్టాండ్-ఆఫ్ ఆయుధాలపై భారతదేశం ఆధారపడటం గణనీయంగా తగ్గలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ఐటి నిపుణుల దేశంగా పేరొందిన భారత్ లో ఇప్పటివరకు సొంతంగా ఒక ఇమెయిల్ లేదా సోషల్ మీడియా స్థావరం లేదు. సొంతంగా ఒక చిప్ లేదు. పైగా, భారత జాతీయ భద్రతకు చెందిన పౌర-సైనిక యంత్రాంగం భారత రక్షణ రంగాన్ని విశ్వసించడం లేదు. అలాగే రక్షణ రంగం కూడా పౌర-సైనిక యంత్రాంగాన్ని విశ్వసించదు. ఎందుకంటే వారు ఎల్లప్పుడూ సురక్షితమైన మార్గాన్నే ఎంచుకుంటారు. భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, నాలుగవ అతిపెద్ద సైనిక శక్తిగా ఉంది. అదే



సమయంలో ఆయుధాల దిగుమతిలో సహితం గత ఏడాది ఉక్రెయిన్ తర్వాత మొదటి దేశంగా ఉండటం గమనార్హం. సైనిక తయారీ, బాహ్య గూఢచర్యం లేదా శాస్త్ర సాంకేతిక అభివృద్ధి వంటి కీలకమైన విషయాల విషయానికి వస్తే, జాతీయ లేదా ఇంధన భద్రతా అవసరాల కోసం మనం ఇతరులపై ఆధారపడటం తగదు. దానికి తోడు, భారతదేశంలో వ్యాపారం చేయడానికి సిద్ధంగా ఉన్న ఏ పారిశ్రామికవేత్తకైనా అనేక అధికారిక నిబంధనలు దేశాన్ని వెనక్కి లాగుతున్నాయి. అందుకనే విదేశీ పెట్టుబడులు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారమే కొత్త విదేశీ పెట్టుబడుల రాక భారీగా తగ్గిపోగా, ఇప్పటికే దేశంలో ఉన్నవి సైతం వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. దీంతో వరుసగా ఐదో నెలయైన 2026 జనవరిలోనూ నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో భారీ పతనం చోటుచేసుకుంది. ఈ నెలలో భారత్‌లోకి వచ్చిన పెట్టుబడుల కంటే.. ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లిన పెట్టుబడులే ఏకంగా 1.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13వేల కోట్లు) ఎక్కువగా ఉన్నట్లు ఆర్‌బిఐ తేల్చింది. భారతీయ కంపెనీలు విదేశాల్లో పెట్టే పెట్టుబడులు 5.4 శాతం పెరిగి 2.1 బిలియన్ డాలర్లకు చేరాయి. అత్యధికంగా అమెరికా, సింగపూర్, బ్రిటన్, యుఎఇలకు భారత పెట్టుబడులు తరలిపోయాయిమరోవైపు భారత్‌లో వ్యాపారం చేస్తున్న విదేశీ కంపెనీలు తమ నిధులను వెనక్కి తీసుకోవడం లేదా పెట్టుబడుల ఉపసంహరణ ఏకంగా 97.3 శాతం పెరిగి 4.9 బిలియన్లకు చేరింది. ఫలితంగా నికర ఎఫ్‌డిఐ మైనస్ 1.4 బిలియన్లుగా నమోదయ్యింది. అయితే, ఈ అత్యవసర సమస్యలన్నింటికీ పరిష్కారాన్ని పరిశీలించడం ప్రారంభించే ముందే, దేశం ప్రధాన లక్ష్యం ఏమిటనే దానిపై భారతదేశానికి సైద్ధాంతిక స్పష్టత అవసరం. క్షేత్ర స్థాయిలో అమలు లేకుండా కేవలం సమర్థనగా మాత్రమే ఉంటే, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అనేది గందరగోళాన్ని సృష్టించే చర్యగా మారుతుంది. దౌత్యవేత్తలతో సహా భారత అధికార యంత్రాంగం ఇప్పటికీ మోదీ ప్రభుత్వ నిర్ణయాలను అమెరికా, రష్యా, ఇప్పుడు చైనాలకు అనుకూలంగానో లేదా వ్యతిరేకంగానో చూస్తోంది. అలీన విధానం, సోషలిజం, “అమన్ కీ ఆశా”, పాలస్తీనా సమస్య వంటి భావజాలంతో పెరిగిన భారత అధికార యంత్రాంగంలోని ఒక పెద్ద వర్గం నైతిక యోధులుగా ఉంటూ, బలప్రయోగ వాస్తవికతను అసహ్యించుకుంటుంది. భారతదేశం ఒక స్వతంత్ర మహాశక్తి అనే వాస్తవం అటువంటి స్వార్థ శక్తులకు జీర్ణించుకోలేని పరిస్థితిని కల్పిస్తోంది. అదే సమయంలో, ఆ మహాశక్తులు తమ అజెండాలను ముందుకు నెట్టడానికి భారత లాబీయిస్టులను, ప్రభావశీలులను వాడుకుంటున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం భారత భద్రతా ప్రణాళికదారులకు కనువిప్పు కలిగించాలి. ఎందుకంటే ఈ పోరాటంలోని ప్రధాన శక్తులన్నీ ఇతర దేశాల ఇంధన అవసరాల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా తమ స్వప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయి.

ఇరాన్ పౌర నౌకాయానాన్ని లక్ష్యంగా చేసుకోవడం, షియా దేశంపై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన భారీ బాంబు దాడులు ప్రపంచాన్ని అగాధం అంచుకు తీసుకువచ్చాయి. ప్రపంచ ఫార్ములా 1 సర్క్యూట్‌లో న్యూఢిల్లీ అగ్రస్థానం వైపు దూసుకెళ్లాలంటే, భారతదేశం తన పాలనా నిర్మాణాలను, అధికార యంత్రాంగాన్ని సమూలంగా సంస్కరించుకోవలసి ఉంటుంది. ఇక్కడ మరో ప్రధానమైన అంశం మన విదేశాంగ విధానం సహితం క్రియాశీలకంగా రూపొందాలి. గల్ఫ్ దేశాలు 200 డాలర్లకు పైగా పెట్టుబడులతో అమెరికా కల్పించిన రక్షణ వ్యవస్థలతో తాము 'సురక్షిత ప్రపంచం' ఉన్నామని చెప్పుకొంటూ ఇప్పటివరకూ ప్రపంచం నలుమూలల నుండి పెట్టుబడులు ఆకర్షించాయి. కానీ, ఇప్పుడు ఇరాన్ ఆ దేశాలపై డ్రోన్ లను ప్రయోగించడంతో అమెరికా రక్షణ వ్యవస్థ కుప్పకూలిపోయింది. వ్యూహాత్మక దౌత్యం అందించే రక్షణ ఏ దేశానికి కూడా విదేశాల రక్షణ వ్యవస్థలు అందించగలవని గ్రహించాలి. ఇక్కడ ఇరాన్ బలాన్ని తక్కువగా అంచనా వేసి, ఆ దేశాధినేతలు చంపివేస్తే నాలుగు రోజులలో ఆ దేశం లొంగిపోతుందని అంచనావేసి అమెరికా, ఇజ్రాయిల్ అనూహ్యమైన ఎదురుదెబ్బలు తిన్నాయి. గత 20 ఏళ్లుగా అమెరికా దాడులకు వారు సంసిద్ధతను పెంచుకొంటున్నారని, సాంకేతికంగా ఎదిగారని గ్రహించలేక పోయారు. పైగా, నాయకత్వం చనిపోయినా పోరాటపటిమ అంతరించిపోకుండా వారు వ్యూహాత్మకంగా నిర్మించుకున్న భద్రతా వ్యవస్థ నేటి ఆధునిక ప్రపంచానికి ఓ మార్గదర్శి కాగలదు.



చలసాని నరేంద్ర
9849569050

# ‘గ్రామ స్వరాజ్య’ దార్శనికత

తెలంగాణ రాష్ట్రానికి పల్లెలే పట్టుకొమ్మలు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైతేనే రాష్ట్రం సుసంపన్నం అవుతుందనేది జగమెరిగిన సత్యం. ఈ సత్యాన్ని తుచా తప్పకుండా పాటిస్తూ, మహాత్మా గాంధీ కన్న 'గ్రామ స్వరాజ్య' కలలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మార్చి 20, 2026న ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్, పల్లె ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు ఒక పటిష్టమైన వేదికను కల్పించింది. ముఖ్యంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఈ బడ్జెట్‌లో ఏకంగా రూ.33,688 కోట్లు కేటాయించడం అనేది ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఈ నిధుల కేటాయింపు, ఈ శాఖా బాధ్యతలను నిర్వహిస్తున్న మంత్రి సీతక్క చురుకైన పర్యవేక్షణలో సాగుతున్న కార్యక్రమాలు గత పదేళ్ల విధ్వంసం నుంచి పల్లెలను గట్టెక్కించే ఒక సంజీవనిలా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం పంచాయతీలను కేవలం ప్రచారానికే పరిమితం చేసి, నిధుల మళ్లింపుతో సర్పంచ్‌లను అప్పుల పాలు చేసిన చరిత్రను మనం చూశాం. కానీ, నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, మంత్రి సీతక్క కృషితో గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ, పారదర్శక పాలనకు నాంది పలికింది. ఇది కేవలం అంకెల కేటాయింపు కాదు, ఇది పల్లె తల్లి పాదాల చెంత ప్రజా ప్రభుత్వం ఉంచిన ప్రగతి కానుక.

ప్రధానంగా పల్లెల్లో రోడ్ల అనుసంధానతను పెంచేందుకు 'ముఖ్యమంత్రి గ్రామీణ రహదారుల పథకం' కింద భారీగా నిధులు కేటాయించారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్లు నేడు గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఈ దుస్థితిని మార్చేందుకు మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రాధాన్యతా క్రమంలో బి.టి.రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. దీనివల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, గ్రామీణ రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో మార్కెట్లకు తరలించే అవకాశం కలుగుతుంది. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం అందించే ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పల్లెల్లో సి.సి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, వైకుంఠధామాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని సర్పంచ్‌లకు తిరిగి అప్పగించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య విజయం.

మహిళా సాధికారత లేకుండా గ్రామీణ అభివృద్ధి సాధ్యం కాదని నమ్మిన ముఖ్యమంత్రి, 'మహిళా శక్తి' మిషన్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మంత్రి సీతక్క ప్రత్యేక పర్యవేక్షణలో సాగుతున్న ఈ మిషన్ ద్వారా, ఈ బడ్జెట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు రాబోయే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల రుణాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో వేల కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలను అందించడం ద్వారా గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బాటలు వేశారు. కేవలం అప్పులు ఇవ్వడమే కాకుండా, వారు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించేందుకు 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో, ఇతర పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక షోరూమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సోలార్ ఎనర్జీ రంగంలో కూడా మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ, గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించడం ఒక నూతన విప్లవం.





గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు, ఆత్మగౌరవ ప్రదానానికి 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం ఒక దిక్సూచిలా నిలుస్తోంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను ఏళ్ల తరబడి ఊరించడమే కాకుండా, ఒక్క పేదవాడికి కూడా సొంతింటి కలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు. కానీ రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే, స్థలం ఉన్న పేదవారికి సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకురూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయించడమే కాకుండా, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అదనపు ప్రయోజనాలను కల్పించారు. ఇది కేవలం ఒక గృహ నిర్మాణ పథకం కాదు, ఇది పేదవాడి సొంతింటి కల గౌరవప్రదంగా నెరవేరుతున్న తీరుకు నిదర్శనం. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా పారదర్శకమైన ఎంపిక ప్రక్రియను చేపట్టి, ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా ప్రభుత్వం చూస్తోంది. విద్య, వైద్య రంగాలను పల్లె ముంగిటకు చేర్చేందుకు ప్రభుత్వం వినూత్న ప్రయోగాలు చేస్తోంది. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'గా మార్చి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ పథకం గ్రామీణ విద్యార్థుల పోషణలో కీలక పాత్ర పోషిస్తోంది.

ఆరోగ్య రంగంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్' విధానం ద్వారా ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) బలోపేతం కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించారు. దీనివల్ల చిన్న చిన్న రోగాలకు కూడా పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, పల్లెల్లోనే మెరుగైన వైద్యం అందుతుంది. పల్లెల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, మురుగునీటి నిర్వహణ వ్యవస్థలను పటిష్టం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న కుల గణన, సామాజిక సర్వే ఫలితాల ఆధారంగా, రాబోయే రోజుల్లో పంచాయతీ రాజ్ నిధుల పంపిణీలో సామాజిక న్యాయం పాటించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ బకాయిల కింద రూ.14,934 కోట్లు గుర్తించి కేటాయించడం, వెనుకబడిన తరగతుల (బిసి) సంక్షేమం కోసం రూ.12,511 కోట్లు కేటాయించడం ద్వారా పల్లెల్లోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టమవుతోంది. గ్రామీణ ఉపాధి కల్పనలో కీలకమైన ఉపాధి హామీ పథకానికి అదనంగా ప్రభుత్వం తన వంతుగా మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు కేటాయించడం ద్వారా పల్లెల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ఊతమిస్తోంది. కేవలం కూలీలకు పని కల్పించడమే కాకుండా, గ్రామాభివృద్ధికి అవసరమైన కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోంది. పల్లెల్లోని శ్మశాన వాటికల (వైకుంఠధామాలు) నిర్వహణ కోసం, హరితహారం మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పంచాయతీ కార్యదర్శులకు మరియు సర్పంచ్‌లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన బిల్లుల చెల్లింపుల కోసం కూడా ఈ బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కేటాయించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. దీనివల్ల పల్లెల్లో మళ్ళీ కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి సీతక్క అంకితభావంతో తెలంగాణ పల్లెలు నేడు వికాస పథంలో పయనిస్తున్నాయి. ఈ బడ్జెట్ ప్రతి అంకెలోనూ ఒక సామాన్య పల్లెవాసి కల కనిపిస్తోంది. సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం నుంచి మహిళలను కోటీశ్వరులను చేయడం వరకు, పేదవాడికి సొంతింటి భాగ్యం కల్పించడం నుంచిత పచ్చని పొలాలకు పెట్టుబడి సాయం అందించడం వరకు.. ప్రతి అడుగులోనూ ప్రభుత్వం ఒక కొండంత అండగా నిలుస్తోంది. "పల్లెలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అనే నినాదాన్ని నిజం చేస్తూ, అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే గ్రామీణ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తున్న రేవంత్‌రెడ్డి దార్శనికత, మంత్రి సీతక్క పనితీరు అభినందనీయం.

– పురుషోత్తం నారగౌని
సీనియర్ జర్నలిస్ట్,
రాజకీయ సామాజిక విశ్లేషకులు

# బానిసత్వం లేని భారత్ సాధ్యమా?



ప్రపంచ చరిత్రలో 16 – 18వ శతాబ్ద కాలంలో ఆఫ్రికా నుంచి సెంట్రల్/మిడిల్ అమెరికాకు బలవంతంగా అమాయక ఆఫ్రికన్లను తరలించి బానిసలుగా సంకెళ్లు వేసి, వెట్టిచాకిరీ చేయించిన దుర్మార్గపు ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఈ దుర్ఘటన “ట్రాన్స్‌అట్లాంటిక్ బానిసత్వ వ్యాపారం”గా చరిత్ర పుటల్లోకి చేరింది. ఈ విషాదకర ఘటన ప్రభావం నేటికీ ఆఫ్రికన్ల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. యూఎస్‌లో 01 ఫిబ్రవరి 1865న బానిసత్వాన్ని నిషేధించడం జరిగినప్పటికీ జాతి వివక్ష, బానిస బతుకుల ప్రభావం నేటికీ ఆఫ్రికన్ సమాజంపై పడుతూనే ఉంది. 2007లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 25 మార్చిన “అంతర్జాతీయ ట్రాన్స్‌అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం” పాటించుట ఆనవాయితీగా మారింది. అమానవీయ బానిసత్వం నేరమని, మానవ హక్కుల ఉల్లంఘనలు ఆక్షేపణీయం అని, జాతి వర్ణ వర్గ వివక్ష దురాచారమని, మనిషిని మనిషిగా చూడడం మన కనీస బాధ్యత అని అవగాహన కల్పించడం జరుగుతోంది. అగ్రదేశాల హోటల్స్, రెస్టారెంట్లు, సెలూన్లు, వ్యవసాయ పనులు, సంగీత కార్యక్రమాల్లో బానిసత్వ దురాచారం నేటికీ కొనసాగుతున్నది.

**భారతంలో బానిసత్వ దురాచారం:**

ప్రపంచంలోనే అత్యధికంగా 39 శాతం ఆధునిక బానిసలు భారత్‌లోనే ఉన్నారని తెలుస్తోంది. ముస్లిమ్ పాలనలో బానిసత్వం పెరగడం, నేటి డిజిటల్ వెలుగుల్లో కూడా బానిసత్వ చీకట్లు కమ్మడం సోచనీయం. 1843లో భారత్ బానిసత్వ చట్టం అమలులోకి రావడం జరిగినా దాని ప్రభావం అంతగా పౌర సమాజంపై పడకపోవడం దురదృష్టకరం. 2018 నివేదిక వివరాల ఆధారంగా ప్రపంచంలో 46 మిలియన్ల బానిసలు ఉండగా, అందులో 8 మిలియన్లు భారత్‌లోనే ఉండడం విచారకరం. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, బాల్య వివాహాలు, బలవంతపు పడుపు వృత్తి, బాల కార్మిక వ్యవస్థ లాంటివి నేటికీ మన సమాజంలో కనిపించడం బాధాకరం. ఇండియాలో ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు బానిస చీకటి బతుకులు బతుకుతున్నట్లు తేలింది. ఇటుక బట్టీలు, చిరు పరిశ్రమలు, వ్యవసాయం, అసంఘటిత రంగాలు, గృహ సంబంధిత పనులు, బాల్య బానిసత్వ దురాచారాల్లో ఆధునిక బానిసత్వ కదలికలు కనిపిస్తున్నాయి. ఆధునిక బానిసత్వానికి అడ్డుకట్ట వేయడానికి కఠినంగా చట్టాల అమలు, ప్రజల్లో చైతన్యం, బడాబాబుల ఆలోచనల్లో మార్పు రావలసి ఉన్నది. ప్రజల ఆకలిని ఆసరాగా తీసుకొని అమానవీయ బానిసత్వ బంధీఖానాలో కట్టిపడేయడం మూర్ఖత్వం, నేర సమానం. అందరం చేయి చేయి కలిపి మానవ హారం పట్టి బానిసత్వ కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్న అమాయక జీవులకు స్వేచ్ఛను కల్పించి బానిసలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం, అందరి ముఖాల్లో ఆనంద హరివిల్లులు వికసింపజేద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037



# గ్రేటర్ హైదరాబాద్



## బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత



**షాద్‌నగర్, మార్చి 26 (వుదయం):** కొందుర్గ్ మండలం పాత ఆగిర్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నాగం కృష్ణ భార్య నాగమణి శస్త్ర చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వెంటనే స్పందించి సహాయం అందేలా చర్యలు చేపట్టారు. అంజయ్య యాదవ్ చొరవతో ఎమ్మెల్సీ వాణి దేవి సహకారాన్ని పొందుతూ రూ. 2,00,000 విలువైన ఎల్ఓసి మంజూరు చేయించగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మాణయ్య, మాజీ సర్పంచ్ భీమయ్య, నాయకులు అబ్దుల్ కలాం, కుర్వ జంగయ్య, శేఖర్ గౌడ్, సత్యం, గొడుగు సత్యం, జంగం గోపాల్, ఆంజనేయులు, శ్రీశైలం, మహేందర్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కుత్బుల్లాపూర్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. దూలపల్లి వాసులు మేఘన దప్పు రూ .30,000/, జీడిమెట్ల వాసులు వీరమళ్ళ శ్రీ రాములు రూ. 60,000/,కుత్బుల్లాపూర్ వాసులు సావిత్రి మానెనూర్ రూ. 41,000/, బహదూర్ పల్లి వాసులు ఆర్. సతీష్ రూ. 55,000/,దూలపల్లి వాసులు తుడుము రాజ్ కుమార్ రూ.17,500/కు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి లబ్ధిదారులకు సి ఎం ఆర్ ఎఫ్ మంజూరి పత్రాలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం



**జిన్నారం మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** శ్రీరామనవమిని పురస్కరించుకుని జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని కోదండ రామాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. గురువారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కళ్యాణ మహోత్సవానికి సంబంధించిnఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిటీ చైర్మన్ ఆంజనేయులు యాదవ్ తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ వేడుకలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా మంగంపేట గ్రామంలో ని రామాలయంలో వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శ్రీరామనవమి నేపథ్యం లో మున్సిపాలిటీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## విద్యుత్ సంస్థలో సమ్మె సైరన్



**చేవెళ్ల, మార్చి 26 (వుదయం) :** విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె సైరన్ మోగింది.గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏ,సిజెఏసి) ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు ఇబ్రహీంబాగ్ డివిజన్ కార్యాలయం ఎదుట భారీగా ధర్నా నిర్వహించారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు**

- ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఏపీఎస్సిబి రూల్స్ వర్తింపజేయాలి
- సమాన పనికి సమాన వేతనం అందించాలి
- విద్యార్హత ఆధారంగా ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ చేయాలి
- మీటర్ రీడింగ్ కార్మికులకు జీఓ నం.11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలి
- అన్మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్స్ గా గుర్తించాలి

నాయకులు మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.విద్యుత్ కార్మికుల హక్కుల కోసం సమ్మె సైరన్ మోగడంతో రాష్ట్రవ్యాప్తంగా మరింత ముమ్మరం కావచ్చని సంకేతాలు కనిపిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.


**Classified Ads English / Telugu**

వుదయం తెలుగు దిన పత్రిక ద్వారా

@ Rs. 300/-

Pay for 3 Get Free 2 Classifieds

- బహిరంగ ప్రకటనలు
- లీగల్ నోటీసులు
- ఉద్యోగ
- వ్యాపార

5 — 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 9553256199 7013538549

Change of Name | Lost of Documents | Legal Notices
Wanted Employees | Real Estate | Public Notices
Advertise Classifieds Rs. 300/-

వుదయం | Powered by ProjectWe4 Technologies


## ఏఐ, డేటా సైన్స్ రంగాల్లో విద్యార్థులు
# నైపుణ్యం పెంచుకోవాలి

- ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా సిద్ధమవ్వాలి ప్రొఫెసర్స్ కోటిరెడ్డి, విజయలక్ష్మి, కె.ఎల్. నారాయణ
- ప్రపంచ నిపుణుల కీలక ప్రసంగాలు..
- పరిశోధన పత్రాల ప్రదర్శనతో ఇఫహేలో సాంకేతిక సందడి
- ఏఐ, మెషీన్ లెర్నింగ్‌పై అంతర్జాతీయ సదస్సు విజయవంతం



**శంకర్‌పల్లి, మార్చి 26 (వుదయం):** హైదరాబాద్‌లోని ఐసీఫై టెక్-ఇఫహే ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు "ఇకాసినల్-2026" విజయవంతంగా గురువారం ముగిసింది. రెండు రోజులపాటు ఘనంగా జరిగిన కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) రంగాల్లో జరుగుతున్న తాజా పరిశోధనలు, పరిశ్రమ అవసరాలు, భవిష్యత్ అవకాశాలపై ఈ సదస్సులో విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ఈ వేదికపై పాల్గొని తమ అనుభవాలను, పరిశోధన ఫలితాలను పంచుకున్నారు.

ఈ సదస్సును ఐసీఫై టెక్, ఇఫహే లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్‌చైన్ సంయుక్తంగా నిర్వహించాయి. ఏఐ ఆధారిత స్మార్ట్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్ టెక్నాలజీలు, డేటా గోప్యత, పరిశ్రమ అనువర్తనాలు వంటి అంశాలపై సదస్సులో లోతైన విశ్లేషణ జరిగింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు, పరిశోధకులకు, పరిశ్రమ ప్రతినిధులకు కొత్త అవగాహన కల్పించే వేదికగా నిలిచింది. సదస్సు ప్రారంభోత్సవ సమావేశంలో ఇఫహే ఉపకులపతి ప్రొఫెసర్ టి.కోటిరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి, ఐసీఫై టెక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎల్. నారాయణ పాల్గొని ప్రసంగించారు. వారు ఇఫహే విద్యా ప్రమాణాలు, పరిశోధన అభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై తమ కట్టుబాటును వివరించారు. అలాగే ఏఐ, డేటా సైన్స్ రంగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా సిద్ధమవ్వాలని సూచించారు.

ఈ సదస్సును కన్వీనర్ డాక్టర్ సందీప్ కుమార్ పాండా, జనరల్ చైర్ డాక్టర్ పవన్ కుమార్, సహచైర్స్ డాక్టర్ రోహిణి, డాక్టర్ ప్రదోష్ కుమార్ సమన్వయం చేశారు. సదస్సు లక్ష్యాలు, కార్యక్రమ రూపకల్పన, సెషన్ల నిర్వహణపై వారు వివరించారు. ముఖ్యంగా అకడమిక్ పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానించేందుకు ఈ సదస్సు ఉపయోగపడిందని వారు పేర్కొన్నారు. సదస్సులో జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ కెమ్నిట్జ్కు చెందిన డాక్టర్ అలాజేంద్రో మస్రూర్ ట్రైన్ సిస్టమ్ ఆటోమేషన్, వైఫై సెన్సింగ్ టెక్నాలజీలలో మెషీన్ లెర్నింగ్ అనువర్తనాలపై కీలక ప్రసంగం చేశారు. అలాగే ఐఐటీ రూర్కీకి చెందిన ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఆండ్రాయిడ్ మాల్వేర్ గుర్తింపులో ఏఐ వినియోగంపై వివరించారు. ఎన్ఐటీ మేఘాలయకు చెందిన ప్రొఫెసర్ దీప్తేందు సిన్హా రాయ్ స్మార్ట్ డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్‌లో కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. సదస్సులో ప్రధాన ఆకర్షణగా "మానవ మేధస్సును పునర్నిర్వచించడం: ఏఐ, భావోద్వేగ మరియు జ్ఞాన వైవిధ్యం" అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. దీనిని ఐసీఫై యూనివర్సిటీ సిక్కిం ఛాన్సలర్ ప్రొఫెసర్ ఓ. ఆర్. ఎస్. రావు మోడరేట్ చేశారు. అనంతరం సాంకేతిక పేపర్ ప్రెజెంటేషన్లు, సమాంతర సెషన్లు నిర్వహించి అనేక పరిశోధన పత్రాలు ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో నిర్వాహకులు వక్తలు, పాల్గొన్న ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సదస్సు ఏఐ, ఎంఎల్ రంగాల్లో భవిష్యత్ పరిశోధనలకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.



## గడ్డపోతారంలో బడ్జెట్ సమావేశం
### వార్షిక బడ్జెట్ రూ.3138.59 లక్షలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్

**జిన్నారం, మార్చి 26 (వుదయం ప్రతినిధి):** గడ్డపోతారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దె సుష్మ గణేష్ అధ్యక్షతన సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించారు. 11 గంటలకు ప్రారంభమవాల్సిన సమావేశం గంట ఆలస్యంతో 12 గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపల్ బడ్జెట్ వివరాల లెక్కలను అధికారులు సభలో చదివి వినిపించారు. వార్షిక బడ్జెట్ మొత్తం రూ .3138.59 లక్షలు కాగా సాధారణ అంచనా బడ్జెట్ రూ. 1248.59 లక్షలు. దీనిలో పన్నుల రాబడి రూ. 872.71 లక్షలు, పన్నేతర రాబడి రూ. 70.34 లక్షల లెక్కలను వెల్లడించారు. కాగా 2025 26 ఆర్థిక సంవత్సరానికి మిగులు బడ్జెట్ రూ. 305.54 లక్షలు గా సభలో పేర్కొన్నారు. మున్సిపల్ బడ్జెట్ మొత్తం



సొంత ఆదాయాలనుంచి చార్జెడ్ వేయాలకు పొరుగు సేవల ఉద్యోగుల జీతభత్యాలకు 250.00 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చులకు 122 లక్షలు, కరెంటు బిల్లులకు 168.50 లక్షలు హరితవనం పనులకు 94.30 లక్షలు కేటాయింపులు చేశారు. చార్జర్ వేయాలకు 272.45 లక్షలు, మిగిలిన నిధులు 11.94 మున్సిపాలిటీలోని అభివృద్ధి చెందని ప్రాంతాలు బలహీన మైనార్టీ వర్గాల నివాస ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తామన్నారు. మరో 45 లక్షల రూపాయలు వైకుంఠధామాల అభివృద్ధి ప్రజా మరుగుదొడ్లు సమీకృత సంతల అభివృద్ధి జంతువధశాలల నిర్మాణము శాస్త్రీయ పద్ధతిలో డంప్యార్డుల నిర్వహణ 10 లక్షల నిధులు వాటిలలో అభివృద్ధి పనులకు 275 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కేటాయింపులకు పోగా 14.40 లక్షల మిగులు బడ్జెట్ ఉందని వెల్లడించారు. సభ్యులు బడ్జెట్ను ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. కార్యక్రమంలో తాసిల్దార్ దేవదాస్, కమిషనర్ వెంకటరామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ కౌన్సిలర్లు ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



**చేవెళ్ల, మార్చి26 (వుదయం) :** చేవెళ్ల మున్సిపాల్టీ పరిధిలోని 14వ వార్డులో విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ విద్యుత్ శాఖ ఏఈకి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...14వ వార్డులో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో సురక్షితమైన కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, మోడల్ స్కూల్ పరిసరాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, సమగ్రంగా వైరింగ్ మరియు వీధి లైటింగ్ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పథకాలకు ఇందిరా గాంధీ పేరు పెట్టి అవమానించవద్దు

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి)**

కల్తీ లేని ఉత్తర తెలంగాణను నిర్మించాలని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మద్యం బ్రాండ్లలాగే ఇప్పసారాకు పింక్ లేబుల్ వంటి పేర్లు పెట్టి ప్రభుత్వమే సరఫరా చేయాలని సూచించారు. గురువారం ఆసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు.ఉత్తర తెలంగాణలో కల్తీ కల్లు మరణాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలు, ప్రభుత్వ పథకాలకు పెడుతున్న పేర్లపై దుమ్మెత్తిపోశారు. ఉత్తర తెలంగాణలో ఆల్ప్రాజోలం కల్తీ కల్లుతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పథకానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టడం ద్వారా ఆమెను అవమానించవద్దని రాకేష్ రెడ్డి హితవు పలికారు. సోషల్ మీడియాలో ఆమెపై వస్తున్న అభ్యంతరకర వీడియోలను ఖండించిన ఏకైక ఎమ్మెల్యేను తానేనని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలకు తెలంగాణ అమరవీరుల పేర్లు, మాజీ సీఎంల పేర్లు మీకు దొరకడం లేదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీని బలిదేవత అన్న వ్యక్తే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో సీఎం అయ్యారని చురకలంటించారు.



40 ఏళ్లుగా పార్టీకి సేవ చేసిన జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతలను అవమానిస్తూ బయటకు పంపుతున్నారని మండిపడ్డారు. కౌలుదారులు వచ్చి కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్ష ఆరోపణలు చేశారు. జీవన్ రెడ్డి మాటలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన 120 మంది గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని, వారు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమ నిధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి



**హైదరాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి)**

ప్రజా సమస్యల పరిష్కారానికి అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించడానికి సంబంధించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎంతో గురువారం శాసన మండలి సమావేశ హాలులో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు.తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో చర్చించారు.దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న "జన్ సూచన పోర్టల్" తరహాలో తెలంగాణలోనూ 'ప్రజా సూచన పోర్టల్' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఈ పోర్టల్ రూపొందించనున్నారు. ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. మరోవైపు తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్లును నిఖిల్ డే ప్రశంసించారు. ఈ చట్టం దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :** నిజాంపేట్ సర్కిల్, ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా సదురు అధికారులతో మాట్లాడి జి హెచ్ ఎం సి మున్సిపల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కుంచల సైదప్ప, రాము, వాసు, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, రామచందర్ నాయక్, క్యాంటీన్ నాగరాజు, వెంకట్ రెడ్డి, గట్టయ్య, ఆనంద్, మోహన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, విష్ణు, రామకృష్ణ, మల్లేష్, రజినీకాంత్, వెంకటలక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతం



**చేవెళ్ల మార్చ్ 26 (వుదయం)** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా,నిర్వహించబడ్డాయి. న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలుపోస్టులకు పోటీ నెలకొనగా, కొన్ని పదవులు ఏకగ్రీవంగా నిర్ణయించబడ్డాయి.ప్రధాన పోస్టులకు పోటీ ప్రెసిడెంట్ పదవి, పి. మధుసూదన్ రెడ్డి, ఎం. సురేందర్, వైస్ ప్రెసిడెంట్ (జనరల్), కె. అశోక్, ఎన్. చంద్రశేఖర్, బి. యాది రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (మహిళ), జె. గీతా వనజాక్షి, ఎన్. మాధురి, జనరల్ సెక్రటరీ ఎల్. జైపాల్, పి. మల్లేష్.

**ఏకగ్రీవంగా ఎన్నికైన వారు**

జాయింట్ సెక్రటరీ ఈ రవీందర్ రెడ్డి, స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రటరీ: ఏ. ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్: ఈ. జనార్దన్, లైబ్రేరియన్: టీ. మహేష్, **ఎగ్జిక్యూటివ్ కమిటీ (మహిళ):** కే. ప్రవీణ (ఏకగ్రీవం), మనీష (ఏకగ్రీవం), ఎగ్జిక్యూటివ్ కమిటీ (జనరల్) పోటీ, నాలుగు పోస్టులకు ఏడు మంది పోటీ పడగా, ఉత్కంఠ భరిత పోరు నెలకొంది.

**పోటీదారులు:** ఆనంద్, మహేష్, ప్రకాశం, ప్రవీణ్ రెడ్డి, రాజశేఖర్, శివరాజ్, సుదర్శన్.

**ఎన్నికల ఫలితాలు**

**ప్రెసిడెంట్:** పి. మధుసూదన్ రెడ్డి విజయం

**వైస్ ప్రెసిడెంట్ (జనరల్):** ఎన్. చంద్రశేఖర్

**వైస్‌ప్రెసిడెంట్ (మహిళ):** ఎన్.మాధురి

**జనరల్ సెక్రటరీ:** పి. మల్లేష్

**ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు (జనరల్):** బి. ఆనంద్, మహేష్, సుదర్శన్, ప్రవీణ్ రెడ్డి,కోర్ట్ ఆవరణలో ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ కీలక పోస్టులకు పోటీతో ఆసక్తి పెరిగింది. పలుపోస్టులు ఏకగ్రీవంగా ఎంపిక కావడం విశేషం. మొత్తం గా చేవెళ్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా పూర్తై, కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధమైంది.

## టీబీపై అవగాహన కల్పించాలి
### వయసుతో సంబంధం లేకుండా టీబీ: డా. ఎస్.ఏ. రఫీ

**హైదరాబాద్, మార్చి 26 (వుదయం) :** వయసుతో సంబంధం లేకుండా క్షయ (టీబీ) వ్యాధి విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు కిమ్స్ గచ్చిబౌలి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పుల్మనాలజిస్ట్ & స్లీప్ స్పెషలిస్ట్ డా. ఎస్.ఏ. రఫీ. అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్స్ గొచ్చిబౌలిలో క్షయ వ్యాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణీయమైన, చికిత్స పొందదగిన మరియు పూర్తిగా కోలుకో వచ్చిన వ్యాధి, అయినప్పటికీ దేశంలో ఇంకా అనేక మంది దీని ప్రభావంలో ఉన్నారు. "ఇప్పటి క్షయ వ్యాధి నిర్మూలనలో పెద్ద అడ్డంకి చికిత్స లేమి కాదు. ఈ వ్యాధిపై ఉన్న తప్పుడు సమాచారం మరియు స్టిగ్మానే ముఖ్య సమస్య అని అన్నారు." ప్రజలు రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, తగినంత కారణం లేకుండా బరువు తగ్గడం, రాత్రి పూట చెమటలు వంటి ప్రారంభ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రారంభ దశలో నిర్ధారణ మరియు సమయానికి చికిత్స కీలకం. అనంతరం డా. కడ్లి శిరీష్ కుమార్, కన్సల్టెంట్ పుల్మనాలజిస్ట్ & స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ ఏ వయసు, లింగం, జీవనశైలి ఉన్నవారైనా దీని ప్రభావంలో పడవచ్చు. తాజా వైద్య అవగాహన ప్రకారం, క్షయ వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇది కేవలం దగ్గు ద్వారా కాకుండా సాధారణ శ్వాసలోనూ వ్యాపించవచ్చు, ముఖ్యంగా గట్టిగా నిండిన, తక్కువ గాలి ప్రవాహం ఉన్న ప్రదేశాల్లో. వైద్యులు సూచించిన విధంగా, క్షయ రోగులు పూర్తిగా కోలేవరకు మాస్క్ ధరించాలి, తద్వారా వ్యాప్తి తగ్గుతుంది.



కొత్తగా గుర్తించినవారిలో హెచ్ఐవి, మధుమేహం, క్యాన్సర్, దీర్ఘకాలిక స్టెరాయిడ్ చికిత్స పొందేవారు, వృద్ధులు, ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు పిల్లలు, పోషణ లోపం ఉన్నవారు, క్షయ రోగులతో సన్నిహితంగా ఉండే వ్యక్తులు ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితం అవుతారు. వీరి కోసం టీబీ నివారక చికిత్స (టిపిటి) ద్వారా వ్యాధి ప్రారంభ దశలోనే నిరోధం చేయవచ్చు.

**IN THE COURT OF THE HON'BL Ist JR. CIVIL JUDGE, CITY CIVIL COURTS,AT : SECUNDERABAD**
**OS No. 1070 of 2022**

**Between:**
State Bank of India
RACPC – I, Secunderabad
...**Plaintiffs**
**AND**
Mr. N. Lakshmi Kiran & another
...**Defendant**

To,
1) Mr. N. Lakshmi Kiran W/o. C. Dilip Arun,
2) Smt. C. Dilip Arun,W/o. Lakshmi KiranBoth are R/o. H.No. 12-2-582/B/9,Guddimalkapur, Opp,. VBH Garden Apts,Asif Nagar, Hyderabad-500028

**NOTICE**

The above named plaintiff filed suit for Money Recovery against both of you for **Rs 2,55,643/- (Rupees Two Lakhs Fifty Five Thousand Six Hundred and Forty Three only).** before the Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, Hyderabad The Hon'ble Ist Jr. Court has directed notice against you through paper publication and the matter is posted to **17-04-2026** for your appearance. You have to appear before Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, Hyderabad at **10-30 AM** or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**M.P.SANJAY**
**Advocate**
**Counsel for the Plaintiff**
**H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500009 Ph : 040-29558473, Cell : 888 TG – 500053, Cell: - 9391350841**

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## చదువు–అభివృద్ధితో నల్గొండ నంబర్ వన్ లక్ష్యం

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**నల్గొండమార్చి 26 (వుదయం ప్రతినిధి) :**



నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి, అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువు ద్వారానే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, అందువల్ల ప్రతి ఒక్కరు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.కనగల్‌లో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా అల్పాహారం మరియు మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నల్గొండలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేసి, నర్సింగ్ కళాశాల పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు న్యాక్ భవనం, ఏటీసీ కేంద్రం వంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నామని, సెట్విన్ ద్వారా వేలాది మహిళలకు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు పెట్రోల్ పంపులు, సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రహదారుల అభివృద్ధిలో భాగంగా నల్గొండ నుంచి దర్వేశిపురం వరకు డబుల్ రోడ్డు, ఇతర ప్రధాన రహదారుల నిర్మాణానికి భారీ నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, గోడౌన్లు, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్డీఓ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బచ్చన్నపేట మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**
**ఆసుపత్రి, పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల పరిశీలన**

**జనగామ, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**




ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను, అభివృద్ధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**వైద్య సేవలు - ఆసుపత్రి తనిఖీ**

బచ్చన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి, ఐపి రిజిస్టర్లను, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, పచ్చదనాన్ని పెంపొందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

రాఘవాపూర్, మన్సాన్ పల్లి సహా పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని సమీక్షించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు గృహ ప్రవేశం కల్పించాలని స్పష్టం చేశారు.

**అంగన్వాడీ విద్యా వ్యవస్థ**

మన్సాన్ పల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించి, పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువు సామర్థ్యాన్ని పరీక్షించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ నిలువలు

### – జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ప్రజలెవరు అసత్య ప్రచారాలను నమ్మవద్దు**

**ములుగు, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**

జిల్లా ప్రజలకు సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నాయని ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌పీజీ వంట గ్యాస్ మరియు పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు.జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, ముందస్తు బుకింగ్స్ కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా డీలర్లు, రీటైల్ యూనిట్లు, సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు.ప్రజలెవరు సోషల్ మీడియాలో,ఇతర మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలను, వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కోరారు.ఇంధనాన్ని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు

## పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**అవగాహన ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్**

**వరంగల్/గీసుగొండ, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**



రైతులు తమ ఆర్థికాభివృద్ధికి మూలమైన పాడి పశువులను గాలికుంటు వ్యాధి నుండి రక్షించుకోవాలని, ఇందుకోసం ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. 'ప్రజా పాలన-ప్రగతి 99 రోజుల ప్రణాళిక'లో భాగంగా గురువారం రోజున గీసుగొండ మండలం దసరు తండాలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించే ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, 2030 నాటికి తెలంగాణను గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మార్చి 10 నుండి ఏప్రిల్ 9, 2026 వరకు జిల్లా వ్యాప్తంగా ఉచిత టీకాలు వేయబడును. శిబిరం లో 115 పశువులకు టీకాలు వేయడంతో పాటు, పురుగుమందుల పంపిణీ మరియు 75% సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందజేశారు.

వైరస్ ద్వారా సోకే ఈ వ్యాధి మార్చి, ఏప్రిల్, ఆగస్టు మరియు సెప్టెంబర్ నెలల్లో ఎక్కువగా ప్రబలుతుందని అధికారులు వివరించారు.జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ ఎం. బాలకృష్ణ మాట్లాడుతూ.. సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ముందస్తు టీకాలే పశువులకు శ్రీరామరక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమృత, పశువైద్య అధికారులు డాక్టర్ గైని శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, రాధిక, తదితర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉజ్వలమైన ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

**రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అరైవ్ - అలైవ్ ఉద్యమం..-తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు.. - తల్లిదండ్రుల కలలను పిల్లలు నెరవేర్చాలి...- విద్యార్థులు ప్రణాళిక పెట్టుకుని లక్ష్య సాధనకు ముందుకెళ్లాలి..-నరసింహ ఐపీఎస్ ,ఎస్పి**




**సూర్యాపేట వుదయం ప్రతినిధి (మార్చి 26):**

ఉజ్వలమైన, ఉన్నతమైన లక్షాలను ఎంచుకుని నిరంతరం కృషి చేస్తే ,మంచి విజయాలు వస్తాయి, పాఠశాలలు దేవాలయాలు, తరగతి గదులు ప్రయోగశాలలు వీటిని సద్వినియోగం చేసుకోవాలిని ఎస్పి నరసింహ ఐపిఎస్ అన్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధి దురాజుపల్లి గ్రామం వద్ద ఉన్న ఎం.ఎస్.ఆర్ సెంట్రల్ స్కూల్ నందు చివ్వేంల పోలీసులు, షీ టీమ్స్ అధ్వర్యంలో గురువారం నాడు ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నందు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి, మంచి లక్ష్యాలు ఎంచుకోవడం, ప్రణాళికతో చదువుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్ వినియోగం ప్రధాన సమస్యగా ఉన్నాయి.వీటి నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు.యువత, పౌరులు భాగస్వామ్యం కావాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడం, రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు మరణించకుండా సురక్షితంగా గమ్యం చేరడం, రోడ్డు భద్రతా నియమాలు తెలియజేయడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహాఉద్యమం " కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ,ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదు అనేది పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు.

పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదం, నేరముఅన్నారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే రోడ్డు ప్రమాదాలకు గురౌతారు, రోడ్డు పై వెళ్ళేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, డిఫెన్సివ్ వాకింగ్ చేయాలన్నారు. రోడ్డుపై చుట్టూ ఉన్న పరిసరాలు, ప్రమాదాలు, అడ్డంకులు గమనిస్తూ ముందుకు వెళ్లాలి అన్నారు. రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తగా ఉండాలి అన్నారు. అతివేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు. హెల్మెట్ ధరించాలి, సీటు బెల్టు పెట్టుకోవాలి అని అన్నారు. దేశ రక్షణలో చనిపోతే వారికంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోయే వారి సంఖ్య ఎక్కువ అని గుర్తు చేశారు. డ్రగ్స్ బారిన పడి యువత అనారోగ్యం పాలు అవుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడవద్దు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమాజంలో డ్రగ్స్ అనేక రకాల రూపంలో దొరుకుతున్నాయి, దీనిని నిర్మూలించాల్సిన భద్రత యువతపై ఉన్నది దీని సమాచారం పోలీసు వారికి తెలియజేయాలి అని కోరారు. సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో ప్రజలను మోసగించి ఆర్థిక నష్టాలు కలిగిస్తున్నారు, అపరిచితులు ఏదైనా బహుమతులు ఉన్నాయని ఆశ చూపితే అత్యాశకు పోవద్దు వ్యక్తిగత సమాచారం అపరిచితులకు ఇవ్వవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీం, పోలీస్ కళా బృందం విద్యార్థుల రక్షణ, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, షీ టీం ఎస్సై నీలిమ, ఎమ్మెస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## జనాభా లెక్కంపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి



**- కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి :**

జనాభా లెక్కంపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండి జనగణనలో తప్పులకు తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో జనగణన 2027 ఫేస్ 1 గృహేల జాబితా, గృహ గణన నిర్వహణలో భాగంగా నూతనంగా ఎంపికైన టెక్నికల్ అసిస్టెంట్లు, జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు చివరి రోజు శిక్షణ తరగతులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయాలని, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు సాంకేతిక పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అలాగే జనగణన నిబంధనలపై పూర్తి అవగాహనతో తప్పులు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు.

టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ లో చేస్తున్న పని విధాన్ని కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు, సలహా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా గణాంక అధికారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం స్వనిధి లబ్ధిదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్



**ఖమ్మం, మార్చి 26(వుదయం బ్యూరో) :**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు, ఖమ్మం మెప్మా (సమన్వయంతో పీఎం స్వనిధి లబ్ధిదారులైన వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం' నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం శ్రీ యశ్వంత్ సాయి, ఖమ్మం ఎల్‌డీఎం ఏ. రవి ప్రసాద్, టీఎంసీ సుజాత, టీజీబీ రీజినల్ మేనేజర్ శ్రీ ప్రసన్న కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎం శ్రీ హరినాథ్, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీ శ్రీనివాస్ మరియు ఇతర బ్యాంక్ అధికారులు, సీఎఫ్ఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.ముఖ్య అతిథులు వీధి వ్యాపారులకు ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించారు.పొదుపు అలవాటు: వ్యాపార లాభాల్లో కొంత భాగాన్ని భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడంలోని ప్రాముఖ్యత.

**డిజిటల్ లావాదేవీలు:**
నగదు రహిత చెల్లింపుల ద్వారా లభించే క్యాష్‌బ్యాక్, ఇతర ప్రయోజనాలు.

**కేవైసీ&సైబర్ మోసాలు:**
బ్యాంకు ఖాతాల భద్రత, ఓటీపీ ఎవరికీ చెప్పకూడదని మరియు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీమా పథకాలు: పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన మరియు పీఎం సురక్ష బీమా యోజన ద్వారా తక్కువ ప్రీమియంతో లభించే రక్షణ.

అదనపు రుణాలు: రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా తదుపరి విడతల్లో పెద్ద మొత్తంలో రుణాలు పొందే అవకాశం.

ఈ సదస్సులో సుమారు 100 మంది లబ్ధిదారులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా ముగి సింది

## ఎమ్మారై యంత్రం ఏర్పాటు జాప్యం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం

**విద్యుత్తు సరఫరా పనుల్లో నిర్లక్ష్యంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ విధులకు గైర్హాజరుపై షోకాజ్ నోటీస్ జారీ చేయండి: కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 26(వుదయం జిల్లా ప్రతినిధి):**



ఎమ్మారై యంత్రం ఏర్పాటుకు అవసరమైన విద్యుత్తు సరఫరా పనుల్లో జాప్యంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించి ఎమ్మారై పరికరం, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు కోసం అవసరమైన విద్యుత్ సౌకర్యాల కల్పనలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉన్నట్లు గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విధులకు గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఎమ్మారై యంత్రం ఏర్పాటు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డీఓను పర్యవేక్షణ సంబంధిత అధికారిగా నియమించామని తెలిపారు.

విద్యుత్ సరఫరా ఏర్పాటుకు అవసరమైన పరికరాలను ఇప్పటికీ సమకూర్చకపోవడంపై కలెక్టర్ ప్రశ్నిస్తూ, ఈ విధంగా కొనసాగితే పనులు పూర్తి కావడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతాయని అసహనం వ్యక్తం చేశారు. యంత్రం ఏర్పాటు అవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షకులు డా వెంకటరత్నం, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా రాజేష్, టిజిఎంఎస్ ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణే ధ్యేయం!



**నిర్భయ నిధులతో 'పైలట్ ప్రాజెక్ట్' 'ఇన్‌క్లూజివ్ సిటీస్' ద్వారా భారీగా భద్రతా చర్యలు**

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ వెల్లడి**

**ములుగు, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్" పైలట్ ప్రాజెక్ట్‌ను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన, నిర్భయ నిధుల వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహిళల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేకంగా పింక్ ఆటోలను అందుబాటులోకి తీసుకురావడం. జనసమ్మర్ధ ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉండేలా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు. వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న బాలింతలు, వారి శిశువుల సంరక్షణ కోసం పని ప్రదేశాలలో ప్రత్యేక క్రెష్, డే కేర్ సెంటర్ల ఏర్పాటు. పర్యాటక కేంద్రాల వద్ద భద్రత మేడారం, లక్నవరం, రామప్ప, బోగత, మల్లూరు మరియు దేవాదుల వంటి ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో మహిళల కోసం అన్ని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక సెంటర్లు. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తక్షణమే సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, డి.డబ్ల్యు.ఓ ప్రేమలత, మున్సిపల్ కమిషనర్ రమేష్, ఆర్డీవో శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 16వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు కసరత్తు

### కార్యకర్తల అభిప్రాయ సేకరణ
### ముఖ్య అతిథులుగా ఓడిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం



**వరంగల్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ నగరంలోని 16వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా నూతన అధ్యక్షుని ఎంపిక కోసం కార్యకర్తల సమావేశం ఉత్సాహంగా నిర్వహించారు. 16వ డివిజన్ అధ్యక్షులు దుబ్బాక సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఓడిసిఎంఎస్ (ODCMS) మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష పదవికి సంబంధించి కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

పార్టీ కోసం నిరంతరం శ్రమించే, కార్యకర్తలకు అండగా ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సూచించారు.

రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతంపై చర్చ,

ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువ నిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా అధ్యక్షుని ఎంపిక.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సాదాబైనమా, భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట మార్చి 26(వుదయం):**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనమా, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో పెండింగ్ సాదాబైనమా, భూభారతి మరియు భూ సమస్యలపై వెబ్ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీఓ 76 జారీ చేసినట్లు తెలిపారు.

సాదాబైనమా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డులో నమోదు కలిగి ఉండాలని, పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. భూమిపై పొజిషన్ ఉండటంతో పాటు 5 ఎకరాల లోపు భూములు కలిగిన వారికే పరిష్కారం చేయాలని చెప్పారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తైన దరఖాస్తులను పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చలాన్ కట్టే ముందు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు సరిచూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి 13(B) పట్టాలు జారీ చేయాలని తెలిపారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని, కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు తప్పనిసరిగా జవాబు ఇవ్వాలని అన్నారు. స్లాట్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీఫండ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని, ఫారం 6, 7, 8 పెండింగ్ లేకుండా చూడాలని, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్, ఉద్యాన పంటలతోనే రైతులకు భరోసా

**- పంట మార్పిడితో అధిక ఆదాయం పొందవచ్చు**

**- జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న**

**మహబూబాబాద్, మార్చి 26 (వుదయం ప్రతినిధి) :**




సాంప్రదాయ పంటల కంటే మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, ఉద్యాన పంటల సాగుతోనే రైతులకు ఆర్థికంగా అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన & పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. గురువారం ఆయన మరిపెడ, చిన్నగూడూరు, మహబూబాబాద్ మండలాల్లో పర్యటించి ఆయిల్ పామ్, మామిడి, సపోటా తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వేసవి యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు.పంట మార్పిడితో వరి, పత్తి, మిర్చి వంటి పంటలకు బదులుగా ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, మునగ, మల్బరీ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ రాయితీలు: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, తోట నిర్వహణ, అంతర పంటలు మరియు బిందు సేద్యం (డ్రిప్) కలిపి ఎకరానికి మొత్తం రూ. 50,918 రాయితీ లభిస్తుందని తెలిపారు.

ఆధునిక పద్ధతులతో మల్చింగ్, ఫర్టిగేషన్, పందిరి సాగు, ట్రెల్లిస్ పద్ధతిలో టమాటా సాగు వంటి నూతన సాంకేతికతను వాడటం ద్వారా సాగు ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని వివరించారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ ఎకరానికి లక్ష రూపాయల నికర ఆదాయం పొందవచ్చని రైతులకు విజ్ఞప్తి చేశారు.వేసవిలో పచ్చి రొట్ట ఎరువుల వాడకం, వేప నూనె పిచికారీ వంటి సేంద్రియ పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ సిబ్బంది విజయ పాల్ రెడ్డి, రాజ కిశోర్, అనిల్, రైతులు భీమసాగర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## జేసీబీ యజమానిపై రౌడీషీట్ నమోదు చేయాలి

### కేశవపట్నం గ్రామస్థుల డిమాండ్

వుదయం ప్రతినిధి, శంకరపట్నం:



ఊరి జనాన్ని ఇబ్బందులకు గురి చేస్తూ.. తమకు జీవనోపాధి లేకుండా చేసిన జేసీబీ యజమానిపై రౌడీ షీట్ నమోదు చేసి.. గ్రామం నుంచి బహిష్కరించాలని గ్రామ ప్రజలు, గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తనకున్న జేసీబీతో తమకు జీవనోపాధినిచ్చే తాటి చెట్లను అధికారం ఉందనే అహంకారంతో తొలిగించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు డబ్బు, పలుకుబడి ఉందని..ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. ఇంతకు ముందున్న మాజీ సర్పంచ్ అండదండలతో గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసి ఇంటిని నిర్మించాడని.. ఇదీ అధికారులకు కనబడడం లేదా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో కట్టిన ఇంటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. పేదల పొట్టకొడుతున్న జేసీబీ యజమాని కిరణ్‌పై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే.. తామంతా ఏకమై మండలంలోని అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ ప్రజలు తెలిపారు.

## పన్ను వసూళ్ల పై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, మార్చి26 (వుదయం ప్రతినిధి) గ్రామాలలో 100% పన్ను వసూళ్ల పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రతి నిర్మాణం యొక్క అసెస్మెంట్ 100% పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో అక్రమ నిర్మాణాలు జర్గకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రాలలో ఉన్న వ్యాపార సంస్థల యొక్క సంపూర్ణ వివరాలు దగ్గర అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో రైస్ మిల్లర్లు, ఇతర వాణిజ్య కార్యక్రమాలను మూసి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టిసి బస్ స్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు , వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలు కూడా పన్ను చెల్లించాల్సి ఉంటుందని, పెండింగ్ ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు.గ్రామాలలో అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో తొలగించాలని అన్నారు. రోడ్ల పై చెత్త ఉండకుండా రెగ్యులర్ పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డి ఎల్ పి ఓ లు, ఎంపీ ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సింగర్ గా బండి సంజయ్

కరీంనగర్ మార్చి 26
(వుదయం ప్రతినిధి)

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గాయకుడి అవతారమెత్తారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి శత వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ గీతాలను ఆలపించారు. బండి సంజయ్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో పనిచేశారు. జాతీయవాదం, హిందుత్వ సిద్ధాంతాలను పూర్తిగా పుణికి పుచ్చుకున్న బండి సంజయ్. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను సామాన్య ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఆ గీతాలను ఆలపించారు. బండి సంజయ్ పాడిన ఆర్ఎస్ఎస్ గీతాలకు సంబంధించిన ప్రోమో విడుదలైంది. సోషల్ మీడియాలో బండి సంజయ్ గీతాలాపన ప్రోమో హల్ చల్ చేస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా కరీంనగర్ లో బండి సంజయ్ పాడిన పాటలను అధికారికంగా విడుదల చేయనున్నారు.

'పూట్ల కృష్ణ' అలియాస్ 'యేసయ్య'

## బాగోతం బట్టబయలు

కరీంనగర్ మార్చి 26
(వుదయం ప్రతినిధి)

రాజ్యాంగం కల్పించిన ఎస్సీ రిజర్వేషన్లను అక్రమ మార్గాల్లో చేజిక్కించుకుని, ఒక అర్హత గల దళిత అభ్యర్థికి రావలసిన ప్రభుత్వ ఉద్యోగాన్ని దొంగిలించిన పూట్ల కృష్ణ అలియాస్ యేసయ్య అక్రమాలను కాళోజీ ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ సాక్ష్యాధారాలతో సహా బట్టబయలు చేశారు. తిమ్మాపూర్ మండలం, అలుగునూరు గ్రామంలో జి.పి.ఓ గా పనిచేస్తున్న ఇతని అక్రమ నియామకంపై గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఫిర్యాదు చేయడం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఒక్క వ్యక్తికి మూడు దత్తతలా,ఈ సందర్భంగా బండి శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితుడు పూట్ల కృష్ణ తన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి చట్టాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. నిందితుడు తన తప్పులను దాచడానికి 1977లో ఒకసారి, 1998లో ఒకసారి, మళ్లీ 2006లో ఒకసారి.. ఇలా మూడు వేర్వేరు తేదీలతో దత్తత పత్రాలను సృష్టించారని, ఒక వ్యక్తి మూడుసార్లు దత్తత వెళ్లడం అనేది చట్ట ప్రకారం అసాధ్యమని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు.పెళ్లయ్యాక దత్తత చట్టవిరుద్ధం హిందూ దత్తత చట్టం హామా సెక్షన్ 10 ప్రకారం పెళ్లయిన వ్యక్తిని దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని, నిందితుడు 1997లో వివాహం చేసుకుని, ఆ తర్వాత 1998 మరియు 2006లో దత్తత పత్రాలు సృష్టించడం అతని నేరపూరిత కుట్రకు నిదర్శనమని శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతేకాకుండా, క్రైస్తవ మతాచారాల ప్రకారం వివాహం చేసుకుని, మతాన్ని పాటిస్తూ ఎస్సీ మాదిగ సర్టిఫికేట్ వాడటం రాజ్యాంగ విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.అట్రాసిటీ కేసుల బెదిరింపులు తమ అక్రమాలను ప్రశ్నిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులపై నిందితుడు అక్రమంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నారని, చట్టబద్ధంగా ఎస్సీ హోదా లేని వ్యక్తి ఇలాంటి బెదిరింపులకు దిగడం హాస్యాస్పదమని శ్రీనివాస్ అన్నారు. అక్రమ దత్తత పత్రాలతో ఉద్యోగం పొందిన పూట్ల కృష్ణను తక్షణమే ఉద్యోగం నుండి తొలగించాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసం చేసినందుకు అతనిపై ఐ పి సీ 420, 467, 468 సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.నిందితుడు ఇన్నాళ్లు అక్రమంగా పొందిన జీతాలను ప్రభుత్వం రికవరీ చేయాలి.నిజమైన దళితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే ఈ విషయాన్ని గౌరవనీయ హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామని బండి శ్రీనివాస్ హెచ్చరించారు.

బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి..

## సమిష్టిగా కృషి చేద్దాం

### కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల /మార్చి 26, 2026
(వుదయం ప్రతినిధి)

జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని, ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించేందుకు డి ఎం ఎఫ్ టి నిధుల నుండి ఆటోలు అందించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సి.ఎస్.ఆర్. నిధుల నుండి 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యుత్ బిల్లులు తగ్గించే ఆలోచనలో భాగంగా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు పనులు కొనసాగుతున్నాయని, ముల్కల్ల నుండి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో సిబ్బంది కొరత ఉన్నట్లయితే సమకూర్చుకునేందుకు పాలకవర్గం సమన్వయంతో చర్యలు తీసుకోవచ్చని, ప్లాస్టిక్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. షాపులు తీసుకున్న వారి వద్ద నుండి అద్దె క్రమం తప్పకుండా వసూలు చేయాలని, ఖర్చులు తగ్గించి ఆదాయం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 202627 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 32 కోట్ల 42 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4 కోట్ల 77 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం (గ్రాంట్లు కాకుండా), 26 కోట్ల 28 లక్షల రూపాయల గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 55 లక్షల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు. మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు తరలిరండి

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ మార్చి26 (వుదయం ప్రతినిధి);

కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శ్రీరామ నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరికీ వేదపండితుల ఆశీర్వచనంతో పాటు తలంబ్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు పేరు వినగానే ఠక్కున భద్రాచలం గుర్తుకొస్తుంది. భద్రాద్రి తరువాత ఆ తరహాలో సీతారామచంద్రస్వామి వేడుకలు జరిపేందుకు కరీంనగర్ వేదికగా మారింది. సాధారణ ప్రజలు నిర్వహించే పెళ్లి వేడుకల తరహాలోనే కరీంనగర్ లో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్యభారతి స్వామీజీ ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన శ్రీ మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఒకేసారి 25 వేల మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్లను అమర్చారు. సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామ చంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్ధమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్య మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు.రామయ్యసీతమ్మ పెళ్లి వేడుకల కోసం శ్రీ మహాశక్తి ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేస్తున్నారు. తీరొక్క పూలతో దేవాలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. విద్యుత్ కాంతులతో ధగధగలాడేలా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన పెళ్లి పందిరిని ఏర్పాటు చేసి పూలతో అలంకరిస్తున్నారు. ఎండాకాలం కావడంతో నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు, చిన్నారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు.శ్రీ మహాశక్తి ఆలయంలో సీతమ్మరామయ్య పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన, ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 25 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికీ సరిపడా భోజనాలు, ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. పెళ్లి సమయంలో ఏ విధంగా భోజనాలను సిద్ధం చేస్తారో... అదే తరహాలో మూడు రకాల కూరలు, సాంబార్, పెరుగు, స్వీట్, పులిహోర సహా ప్రత్యేక వంటకాలను వడ్డించేందుకు సిద్ధమయ్యారు. భక్తులకు భోజన సమయంలో క్యూ కట్టే పనిలేకుండా 5 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నారు.

కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, ప్రాజెక్టు

## పనులను త్వరగా పూర్తి చేయాలి

### మాజీ మంత్రి, బాల్కొండ ఏం ఎల్ ఏ ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,మార్చ్ 26:
(వుదయం ప్రతినిధి);

శాసన సభ సమావేశాల్లో భాగంగా గురువారం రోజు జీరో అవర్ లో బాల్కొండ నియోజకవర్గం ఇరిగేషన్ శాఖ కు సంబంధించి ప్యాకేజ్ 21 మరియు చిట్టాపూర్, ఫత్తేపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ సమస్యలను సభలో లేవనెత్తి ప్రభుత్వం దృష్టికఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, 21 A ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి గత KCR ప్రభుత్వం మొదలు పెట్టిన ప్రాజెక్ట్అని అన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా బాల్కొండ నియోజకవర్గంలో 70,000 ఎకరాలు, నిజామాబాద్ రూరల్ (జక్రాన్ పల్లి మండలం)లో 1,10,000 ఎకరాలు,కోరుట్ల నియోజకవర్గంలో 19,000 ఎకరాలు,ఆర్మూర్ నియోజకవర్గంలో 5,000 ఎకరాల కు నీరు అందుతున్నారు.ఈ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం 4,800 కోట్ల రూపాయలు కేటాయించగా, ఇప్పటికే 3,300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 70% పనులు పూర్తి అయ్యాయి.మిగిలిన 30% పనులు పూర్తి చేస్తే 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు అని దీనిద్వారా రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఇందులోనే భాగమైన మెట్ పల్లి సెగ్మెంట్ ప్యాకేజీ 21 A లోనే బాల్కొండ నియోజకవర్గం 70,000 ఎకరాలు, నిజామాబాద్ రూరల్ జక్రాన్ పల్లి మండలం 29,000 ఎకరాలు, కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి, ఇబ్రహీపట్నం ప్రాంతంలో 19,000 ఎకరాలు, ఆర్మూర్, మాక్లూర్ లో 5000 ఎకరాలు మొత్తంగా సుమారు 1,20,000 ఎకరాలు ఉంటుందాని తెలిపారు. కేవలం 150 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో SRSP నుండి 9,274 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టిందని బాల్కొండ నియోజకవర్గంలో లోని బాల్కొండ, చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాలకు 60 కోట్లతో 3400 ఎకరాలకు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఫాతేపూర్, సుర్బిర్యాల్ గ్రామాలకు 90 కోట్లతో 5700 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అన్నారు. KCR ప్రభుత్వ హయాంలోనే 20% పనులు పూర్తయ్యాయని గత రెండున్నర ఏళ్లుగా ఈ ప్రాజెక్టులు పనులు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. సాగునీరు అందించే అవకాశం ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉందని ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నయనానందకరం సీతారామ తిరుకల్యాణం



ధర్మపురి మార్చి26
(వుదయం ప్రతినిధి):

ధర్మపురి పట్టణంలో గురువారం రామజన్మోత్సవ,రామ కల్యాణోత్సవ వేడుకలు వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. ధర్మపురి క్షేత్రంలో గోదావరి తీరాన వెలసిన శ్రీ రామాలయంలో ఉద యం శ్రీరామ జన్మోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవ స్థాన వంశపారంపర్య అర్చకులు తాడూరి బాలకిష్టయ్య శర్మ, బలరామ శర్మ, బాలచంద్రశర్మ, రఘునాథ శర్మ, బాల మోహన్ శర్మ, మోహన్ శర్మ, వామనశర్మ, రామశర్మ, శరచ్చంద్ర శర్మ, ఆశ్రిత్ శర్మ, విలోక్ శర్మ, భరత్ శర్మల ఆధ్వర్యంలో విధివిధాన వేదోక్త సంప్రదాయ పూజలొనరించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వస్తి పుణ్యాహవాచనం, వామదేవ శతానంద రుత్విగ్వరణం, కళ్యాణార్థం వివాహ వేదిక ప్రవేశం, శ్రీరామచంద్ర వరునికై కన్యా న్వేషణ, సీతారామ వంశావళి ప్రవరలు, మధుపర్క ప్రాశనం, సముహూర్త, మంగళ సూత్ర ధారణం,అక్ష తారోపణం, వివా హానంతర లఘు పూజ,నైవేద్యం, మహామంత్ర పుష్పం, దేవతాశీర్వ చనం తదితర ప్రత్యేక కార్యక్రమా లను నిర్వహించారు.సర్వాలంకా ర శోభితులై,పుష్ప మాలాలంకృ తు లైన శ్రీరామచంద్రునికి, పరమ పావని యైన లోకమాత సీతాదేవి కి లోకకల్యా కల్యాణార్థం అభిజిత్ లగ్న శుభ ముహూర్తంలో మధ్యా హ్నం మూల విరాట్టులకు జరిపిం చిన కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు హాజరై కన్నులారా గాంచి తరించారు. రామాలయంలో వేదవిదులు మధు శంకర శర్మ, మధు రామ శర్మ, నీలకంఠ శర్మ, బల్యపెల్లి ప్రసాద్ శర్మ, సంగన భట్ల నర్సయ్య శర్మ, విశ్వనాథ శర్మ, పనతుల వెంకట రమణ శర్మ, కాకెరి గోపాల్ శర్మ, అనిల్ శర్మ, పెండ్యాల బాలకృష్ణ,పాత బాల చందర్, గుండి రామనాథం, సంగన భట్ల నరేందర్, పాలేపు దత్తాత్రి, గొల్లపెల్లి గుండయ్య, అలువాల దత్తాత్రి, సంగన భట్ల లక్ష్మీ కాంతన్న, ఓజ్జల ప్రవీణ్ శాస్త్రి,ఇందారపు లక్ష్మీ కాంత్ శర్మ, శంకర్, కొరిడే శంకర్, తదితరులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. పట్టు వస్త్రాల సమర్పణధర్మపురి దేవస్థానం పక్షాన ముత్యాల తలంబ్రాలు పట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ సంవత్సరముకూడ అందజేయటం జరిగింది. దేవస్థానం ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు , బొజ్జా సంతోష్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, తిరుపతి, దేవయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీలక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంలో..**

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సీతారామ, లక్ష్మీ నరసింహ స్వాముల కల్యాణ వేడుకలు ఒకే వేదికపై ఒకే మహూర్తాన శుక్రవారం నిర్వహించనున్నారు.దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచార్యులు, అర్చకులు నంబి అరుణ్ కుమార్, చక్రపాణి కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

**సాయి జన్మ దిన వేడుకలు..**

ధర్మపురి క్షేత్రస్థ గోదావరీ నదీ తీరస్థ శ్రీసాయి బాలాజీ మందిరంలో సాయిబాబా జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక నిర్మాత ఒజ్జల ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో, ట్రస్టు అధ్యక్షుడు గోలి రాంప్రసాద్ నిర్వహణలో, అర్చకులు, స్థానిక వేద పండితులు ఆకర్ష్ శర్మ, అక్షయ్ శర్మలు, ప్రత్యేక పూజలు, జన్మదిన అర్చనలు నిర్వహించా రు. మహా క్షీరాభిషేక కార్యక్రమం లో అశేష భక్తజనులు స్వహస్తాల తో, సాయి నాథున్ని క్షీరాభిషిక్తుడిని చేసి తరించారు.ఈ సందర్భంగా నివేదనలు సమర్పించారు.

వరద నిర్వహణపై

## అవగాహన

కరీంనగర్ మార్చి 26
(వుదయం ప్రతినిధి);

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఎన్సీసీ 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత ఇతర ఎన్సీసీ అధికారులతో కలిసి, స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో యువ ఆపదమిత్ర పథకం భాగంగా నిర్వహించిన వరద నిర్వహణ అవగాహన సదస్సులో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని, దీనికి సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదని పేర్కొన్నారు. ఎన్సీసీ కేడెట్లకు ఈ అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు సమాజానికి సేవ చేయగల సత్తా పెంపొందుతుందని తెలిపారు.లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కే. జయంత మాట్లాడుతూ విద్యార్థుల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంపొందించడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి, వాటిని సమయానికి అమలు చేయడం అవసరమని అన్నారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులలో బాధ్యతా భావం మరియు సేవాస్ఫూర్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.యువ ఆపదమిత్ర పథకం ద్వారా కేడెట్లకు వివిధ విపత్తులపై విస్తృత అవగాహన కల్పించబడుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాము నేర్చుకున్న విషయాలను ఇతరులకు కూడా తెలియజేసి సమాజంలో చైతన్యం తీసుకురావాలని కోరారు.అలాగే, విపత్తుల నిర్వహణ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అందులోని మార్గదర్శకాలను సక్రమంగా అమలు చేస్తే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా, వాటిని నివారించగలమని వివరించారు. ఈ సందర్భంగా వాటర్ రెస్క్యూ టెక్నిక్స్ మరియు పడవల నిర్వహణ పై జిల్లా అగ్నిమాపక అధికారి ఎం. శ్రీనివాస్ రెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ కరీంనగర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్ సిరిసిల్ల మార్గదర్శకత్వంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ వి.కృష్ణ పాల్గొన్నారు.



## ర్యాలీని విజయవంతం చేయండి

నిజామాబాద్,మార్చ్ 26:
(వుదయం ప్రతినిధి);

ఏప్రిల్ 2 వ తేదీన జరిగే హనుమాన్ ధరణి ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నగర ప్రజలను కోరారు గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని ఈ శోభ యాత్రకు ప్రతి ఒక్కరు సహకరించి సహకరించాలని కోరారు .అటు అధికారులతో పాటు విశ్వహిందూ పరిషత్ సభ్యులు అందరూ కలిసి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. గత సంవత్సరం లక్ష పై చిలుక భక్తులు ఈ ర్యాలీని చూసి ఆనందించారని ఈ సంవత్సరం కూడా భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి పోలీసు వ్యవస్థ సహకరించాలని కోరారు . పోలీస్ వ్యవస్థ తో పాటు మున్సిపల్ అధికారులు మీద ఉన్నతాధికారులు ప్రతి ఒక్కరు సహకరించి ఈ ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. నగర ప్రజలు ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ హిందూ విభాగం కార్యదర్శి కృష్ణాజీ దినేష్ ఠాగూర్ విహెచ్పి జిల్లా అధ్యక్షులు హిందు వాహిని జిల్లా అధ్యక్షులు దాసరి సాయి ప్రసాద్ దాత్రిక రమేష్ ,శేఖర్ ,నికేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాదు:(వుదయం ప్రతినిధి);

రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం పై రైతు శిక్షణ, ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 21,000 విత్తన కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఒక్కో కిట్ విలువ సుమారు ₹500 ఉంటుందని తెలిపారు. రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై దృష్టిసారించాలని సూచించారు. భూమి లేని వారు తేనెటీగల పెంపకం వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నాబార్డ్, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా 35% నుండి 45% వరకు సబ్సిడీ లభిస్తుందని, ఇందుకోసం రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ లుగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఎఫ్.పి.ఓలకు అవసరమైన భూమిని కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియాను వినియోగించాలని, ఆవు పేడ, మూత్రంతో చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, శాస్త్రవేత్త మల్లేష్, ఉద్యానవన అధికారులు అలేఖ్య, క్రాంతి కుమార్, ఏవో అష్రఫ్, రైతు సంఘం నాయకులు గోవర్ధన్ రెడ్డి, రైతులు, గ్రామస్తులు, ఇతర ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఆదిలాబాదు:(వుదయం ప్రతినిధి);

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరగనున్న పదవతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టాస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుండి 27 వరకు పదవ తరగతి, ఏప్రిల్ 28 నుండి మే 5 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, పరీక్షా సమయాలు ఉదయం 9:00 నుండి 12:00 వరకు, మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు ఉంటాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 4 పదవతరగతి, 3 ఇంటర్మీడియట్‌కు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు అశోక్, సుజాత్ ఖాన్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు శైలజా, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్ ను పరిశీలించిన కౌన్సిలర్

పెద్దపల్లి మార్చి 26 (వుదయం ప్రతినిధి)

ప్రైమరీ స్కూల్ అంగన్వాడి సెంటర్ ను 18 వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ గారు పరిశీలించి ప్రైమరీ స్కూల్లో పిల్లలు ఆడుకోవడానికి స్థలాన్ని పరిశీలించి దానికి కావలసిన నిర్మాణం చేస్తానని ప్రధాన ఉపాధ్యాయులకు తెలపడం జరిగింది అలాగే అంగన్వాడి స్కూల్ నందు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్న పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించడం జరిగింది మరియు అన్నప్రాసన చేయించడం జరిగింది. రాబోయే రోజుల్లో ప్రైమరీ స్కూల్ మరియు అంగన్వాడీ విద్యార్థులకు ఏ విధమైన అవసరాలు ఉన్న నేనే ముందుండి చేస్తానని వారికి మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టీచర్స్ అంగన్వాడీ టీచర్ కాంట్రాక్టర్స్ పాల్గొన్నారు

# నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- ప్రజా ఆరోగ్య సేవలపై కలెక్టర్ దృష్టి
- ప్రత్యేక వైద్య శిబిరాల తనిఖీ
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి , మార్చి 26 (వుదయం ):** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, ఆసుపత్రిలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించి, రోగులకు ఇబ్బందులు లేకుండా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ల సంఖ్య పెంచాలని, ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం ఓపీ విభాగాలు, సర్జికల్, స్త్రీ, పురుషుల మెడికల్ ఓపీలు, ఫార్మసీ డిస్పెన్సింగ్ యూనిట్, ఫార్మసీ స్టోర్స్, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, క్రిటికల్ కేర్ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణలో క్రమబద్ధత పాటించాలని సిబ్బందికి సూచించారు. తదుపరి స్థానిక రైతు బజార్ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, వందరోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా అని తెలుసుకుని, రక్తహీనత, కంటి, చెవి, దంత సమస్యలు, పోషకాహార లోపాలను గుర్తించి అవసరమైన చికిత్సకు రిఫర్ చేస్తున్నట్లు వైద్యులు వివరించారు. అనంతరం



మార్క్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, హెల్త్ రికార్డుల నిర్వహణ, మెడికల్ ఆఫీసర్ గది, ఔషధ నిల్వ గది, ప్రయోగశాల వంటి విభాగాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.



### ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏప్రిల్ మాసంలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై వివరించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అర్హత ఉన్న ప్రతి పౌరుని పేరు తప్పకుండా నమోదు కావడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సిద్ధం కావడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు.



ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను ఈ నెల 30లోగా నియమించి, వారి జాబితాను నియోజకవర్గం వారీగా సమర్పించాలని సూచించారు. బీఎల్ఏల నియామకం పూర్తయిన అనంతరం బూత్ లెవెల్ ఆఫీసర్లు , బీఎల్ఏలకు సంయుక్త సమావేశం నిర్వహించి, ఎస్.ఐ.ఆర్ నిబంధనలు, విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సాఫీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగపు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాండూరులో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

- 600 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ సీజ్
- కర్ణాటక తయారీ ముఠా గుట్టురట్టు
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా



**వికారాబాద్: వుదయం ప్రతినిధి** వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ SK. అన్వార్ పాషా, సిబ్బంది వినూత్న రీతిలో దాడులు నిర్వహించి, భారీ ఎత్తున విక్రయిస్తున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠాను పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించిన పోలీసులు, సుమారు 600 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు ఉపయోగించిన KA 39 9028 నంబర్ గల వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసు వివరాలను వెల్లడిస్తూ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. "ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ, లాభార్జనే ధ్యేయంగా కల్తీ పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తాండూరులోని పాత కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన రేపాల శ్రీధర్ (47) అనే వ్యక్తి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసి అతని వద్ద నుండి 40 కేజీల కల్తీ పేస్ట్‌ను స్వాధీనం చేసుకుందని ఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా, ఈ కల్తీ పదార్థాన్ని కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన యర్రమల్లి గిరిధర్ (40) అనే వ్యక్తి తయారు చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని,వెంటనే టాస్క్ ఫోర్స్ బృందాలు బీదర్‌లోని అతని హోల్‌సేల్ షాపుపై దాడి చేసి, అక్కడ నిల్వ ఉంచిన మరో 560 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను సీజ్ చేశాయి," అని ఎస్పీ తెలిపారు. నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని,తాండూర్ పోలీస్ స్టేషన్ లో కేసు ను నమోదు చేసినట్లు ఎస్పీతెలిపారు. ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



## స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం

**వనపర్తి మార్చ్2 (వుదయం ప్రతినిధి)** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయంగా ముందస్తు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నవారికి, బయట అప్పులు చేయకుండా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ గోపాలపేట మండల పరిధిలో బుద్ధారం గ్రామాన్ని సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో గతంలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఇప్పటికే మంజూరు చేసిన ఈ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని తహసిల్దార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీని ఆదేశించారు. లబ్ధిదారులకు త్వరలోనే పట్టాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో గతంలో కొందరు అకతవకలకు పాల్పడ్డారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం కోసం ఎవరితోనూ అప్పులు చేయవద్దని సూచించారు. ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక అవసరం ఉంటే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ పీడీ విఠోబా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ్ కుమార్, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, వుదయం ప్రతినిధి :** జిల్లా లో లక్ష్యాలకు అనుగుణంగా సి సి రోడ్లు, అంగన్వాడీ బిల్డింగ్స్ , ఎస్ ఎస్ జి భవన నిర్మాణ పనులు, స్కూల్ కాంపౌండ్ వాల్ పనులపై దృష్టి సారించి 100% పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు నుండి అన్ని మండలాల ఎం పి డి ఓ , ఎం పీ ఓ లు , ఏ ఇ, డి ఇ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ,జిల్లా లో సి సి రోడ్లు, ఎస్ ఎస్ జి బిల్డింగ్స్ , స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, అంగన్వాడీ భవనాలు గ్రౌండింగ్ అయిన వాటిని 100% పూర్తి చేసి ఎం బి రికార్డ్ పూర్తి చేయాలనీ, కాంపౌండ్ వాల్ పెయింటింగ్, ఎస్ ఎచ్ జి బిల్డింగ్స్, అంగన్వాడీ బిల్డింగ్స్ రూఫ్, స్లాబ్ లెవల్లో ఉన్నవాటిని వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఇంతకుముందే మంజూరైన పనులను వెంటనే పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలన్నారు. ఇప్పటికే మంజూరైన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ముందే మంజురైన పనులు పూర్తి చేయాలనీ, ఎక్కడెక్కడ గ్రౌండ్ కాలేని చోట తప్పని సరిగా పనులు గ్రౌన్డింగ్ అయ్యేలా చూడాలన్నారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యం మేరకు అంగన్ వాడి, గ్రామా పంచాయతి బిల్డింగ్ , ఎస్ ఎచ్ బిల్డింగ్ పనులపై దృష్టి సారించి పూర్తి చేసి ఎం బి రికార్డ్ సబ్మిట్ చేయాలన్నారు. అదే విధంగా గ్రామాలలో ఇంటి పన్ను పై దృష్టి సారించి వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలనీ ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా మంజురైనా పనులు ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హార్ష చౌదరి,జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్,డి ఆర్ డి ఓ శ్రీనివాస్,పంచాయతి రాజ్ ఇ ఇ ఉమేష్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, సంబంధిత శాqఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థుల పోరు దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

**గద్వాల మార్చి 26 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు మరియు నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకై ఈ నెల 30న నిర్వహించనున్న పోరు దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్‌లో గురువారం ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కరుణ సూరి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మరియు జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం, ఉద్యోగాల భర్తీపై స్పష్టత లేకపోవడం, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు

అలాగే విద్యా రంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయింపు, విద్యాభరోసా కార్డు అమలు వంటి హామీలు నిలబెట్టలేదని విమర్శించారు గురుకులాల లో మౌలిక వసతుల లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు మార్చి 30న గద్వాల పట్టణం లోని పాత బస్టాండ్ వద్ద వైఎస్ఆర్ చౌక్‌లో నిర్వహించనున్న పోరు దీక్షను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బోయ మద్దిలేటి, కురువ స్వామి, శేక్షావలి, భాస్కర్ గౌడ్, రవిచందర్ బి నాయుడు, మధు, నరసింహుడు, మాధవరావు వెంకటేశ్వర్ రెడ్డి, కర్రెప్ప, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి ఫలితాలు





- గురుకులాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి
- ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి
- ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**అలంపూర్ మార్చి 26 (వు దయం ప్రతినిధి)** పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా రాసి మంచి ఫలితాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఇటిక్యాల మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి గణితం పరీక్షకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటిదాకా అసలే చదవని పాఠ్యాంశాన్ని ప్రస్తుతం చదివితే లాభం లేదని, ఇప్పటికే చదివిన పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలో ప్రశ్నాపత్రం చదివాక ముందుగా వారికి బాగా వచ్చిన ప్రశ్నలను ఎంచుకొని సమాధానం రాయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా సాధన చేయాలని, వంద శాతం ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం గురుకుల విద్యాలయంలోని వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల వసతి భవనంలో కలెక్టర్ పర్యటించారు. భవనంలోని గదులు అపరిశుభ్రంగా ఉండడంతో అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటిక్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడి మీసేవ డాష్ బోర్డులో కుల, ఆదాయ, భూభారతి, తదితర దరఖాస్తులను పరిశీలించి నిర్దిష్ట సమయంలోగా వాటిని పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయం లోని రికార్డు గది, ఇతర విభాగాలను పరిశీలించారు. పొలం సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇబ్బంది కలగకుండా నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. సమీపంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి పలు విభాగాల పనితీరును గమనించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలుచోట్ల అనవసరమైన వస్తువులు, చెత్తను గమనించిన కలెక్టర్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, గర్భిణీ స్త్రీల సంరక్షణ, టీకాలు, ఔషధాల నిల్వలు, వివిధ రికార్డుల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హై రిస్క్ కేసులను గుర్తించి వెంటనే మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. హెమోగ్లోబిన్ స్థాయిలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, అవసరమైన మందులు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు సమయానికి అందించాలని ఆదేశించారు. ఔషధాల నిల్వలను ఫార్మసిస్ట్ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. చివరగా ఇటిక్యాలలో జరుగుతున్న పంటల సర్వే పనుల పురోగతిపై సంబంధిత వ్యవసాయ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్వే విధానం, డేటా నమోదు, సంబంధిత యాప్ వినియోగంపై అధికారుల ఫోన్లో ప్రత్యక్షంగా పరిశీలించి సూచనలు జారీ చేశారు. పంటల వివరాలు, భూమి పరిస్థితి (ఫాలో ల్యాండ్, వేస్ట్ ల్యాండ్, వేకెంట్ ల్యాండ్) వంటి అంశాలను ఖచ్చితంగా పరిశీలించి యాప్ లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ యాప్ ద్వారా ఈ సర్వే నిర్వహించబడు తున్నందున పంటల విస్తీర్ణం ఖచ్చితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. డేటా నమోదు పూర్తిగా ఖచ్చితంగా ఉండాలని, ఏవైనా తప్పులు ఉంటే సూపర్వైజర్ స్థాయిలో సరిదిద్దే విధానం ఉన్నప్పటికీ మొదటి నుంచే సరైన సమాచారం నమోదు చేయాలని సూచించారు.

# ఇబ్బందులు లేకుండా సలేశ్వరం జాతర ఏర్పాట్లు

- అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ మార్చి 26 (వుదయం ప్రతినిధి)** జిల్లా లోని లింగాల మండల పరిధిలోని నల్లమల అడవి లో వెలసిన లింగమయ్య స్వామి ఆలయంలో జరగనున్న సలేశ్వరం జాతర కు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించి, జాతర ఏర్పాట్లు మరియు ట్రెక్కింగ్ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవిలోని క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం సలేశ్వరం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మరింత రద్దీ ఉండే అవకాశముందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం తాగునీటి సరఫరా, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అడవి మార్గాల్లో దర్శనానికి వచ్చే భక్తుల కోసం స్పష్టమైన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచనలు ఉంచడం, అవసరమైన చోట్ల సిబ్బందిని నియమించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా శుభ్రత నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెత్తను నియంత్రించే చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు వైద్య బృందాలు, అత్యవసర సేవల సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాల నివారణ కోసం ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో స్వామి దర్శనం కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. రాబోయే వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సలేశ్వరం జాతర నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గర్భిణీ మహిళలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న భక్తులు జాతరకు రాకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నల్లమల అడవిలోని కఠినమైన ట్రెక్కింగ్ మార్గాలు, ఎత్తైన ప్రదేశాలు, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు వంటి పరిస్థితులు ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ఈ సూచనలు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందుబాటులో ఉన్నప్పటికీ, ఇలాంటి వర్గాల భక్తులు జాగ్రత్తగా ఉండడం మంచిదని అన్నారు. ఇతర భక్తులు కూడా ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాతరకు హాజరుకావాలని సూచించారు. భక్తులందరూ సురక్షితంగా ఉండటం ప్రధాన లక్ష్యమని, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ స్వామి దర్శనం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు .

# జిల్లాలోని రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు కంప్యూటర్లు ప్రింటర్లు సరఫరా

**నారాయణపేట మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లాలోని రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు కంప్యూటర్లు, ప్రింటర్లు,స్కానర్ల సరఫరాకు సంబంధించిన రెండు పనుల వివరాలను జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని మద్దూర్ మోడల్ హాస్పిటల్, సిహెచ్ సి కి కంప్యూటర్లు, ప్రింటర్లు–కమ్–స్కానర్ల (15) అవసరం ఉన్నట్లు ఆయన తెలిపారు కాగా మొత్తం అంచనా వ్యయం రూ. 11,79,450,ఎక్జిక్యూటివ్ ఏజెన్సీ సూపరింటెండెంట్ జిల్లా హెడ్ క్వార్టర్ హాస్పిటల్ నారాయణపేట అధికారి ఈ సందర్భంగా కోరారు.నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని కోస్గి మోడల్ హాస్పిటల్, సిహెచ్ సి కి కంప్యూటర్లు,ప్రింటర్లు–కమ్–స్కానర్ల (15) సరఫరా కావాలని ఆయన కోరారు.

వీటి మొత్తం అంచనా వ్యయం రూ. 11,79,450.ఎక్జిక్యూటివ్ ఏజెన్సీ సూపరింటెండెంట్ డిస్ట్. హెడ్ క్వార్టర్ హాస్పిటల్, నారాయణపేట అధికారి కోరారు.మొత్తం కలిపి ఖర్చు రూ. 23,58,900 ఉన్నట్లు ఆయన తెలిపారు.

# సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ చేయాలి

- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- ప్రజా రవాణా సమస్యల పరిష్కారానికి కీలక డిమాండ్



**సంగారెడ్డి, వుదయం** రాష్ట్ర అసెంబ్లీలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన కీలక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లాలో రవాణా సౌకర్యాల లోపం ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని స్పష్టం చేశారు. గతంలో మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టును అక్కడితో ఆపకుండా సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో రైలు సేవలు అత్యవసరంగా మారాయని ఆయన వివరించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఉండటం వల్ల నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ వంటి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడికి వలసవచ్చి నివసిస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది ప్రతిరోజూ ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్ కు ప్రయాణిస్తున్నారని చెప్పారు. అయితే సరైన పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు గంటల తరబడి ప్రయాణిస్తూ శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో రైలు సేవలు సంగారెడ్డి వరకు విస్తరించబడితే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, ట్రాఫిక్ సమస్యలు కూడా కొంతవరకు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేకాకుండా పరిశ్రమలు, ఐటీ రంగం అభివృద్ధికి కూడా ఇది తోడ్పడుతుందని చెప్పారు. మెట్రో కనెక్టివిటీతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక మరో ముఖ్య అంశంగా మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనులపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ 2026 నాటికి పూర్తవ్వాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం పనులు చాలా మందగమనంలో సాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల ఆలస్యం కారణంగా ప్రతిరోజూ ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారని తెలిపారు. దీనివల్ల వారి రోజువారీ జీవితం దెబ్బతింటోందని అన్నారు. కాబట్టి ఈ పనులను తక్షణమే వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొత్తంగా చూస్తే, సంగారెడ్డి జిల్లాలో పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ దృష్ట్యా ఆధునిక రవాణా సదుపాయాల విస్తరణ అత్యవసరమని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. మెట్రో రైలు విస్తరణ, రహదారి పనుల పూర్తి వంటి చర్యలు చేపడితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఈ అంశాలను సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## మానవ అక్రమ రవాణ కేసులో జగ్గారెడ్డి, కుసుమ కుమార్ నిర్దోషులు

**సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి , మార్చి 26:వుదయం.** మానవ అక్రమ రవాణ కేసులో ముఖ్య నాయకులు జగ్గారెడ్డి మరియు కుసుమ కుమార్ పై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేస్తూ వారిని నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నమోదు చేసిన ఈ కేసులో, A1గా ఉన్న తూర్పు జయప్రకాష్ రెడ్డి మరియు A3గా ఉన్న కుసుమ కుమార్‌పై ఆరోపణలు న్యాయస్థానంలో రుజువు కాలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో భారతీయ శిక్షాస్మృతిలోని (IPC) సెక్షన్లు 419, 420, 467, 468, 471, 409, 370తో పాటు భారత పాస్‌పోర్ట్ చట్టం సెక్షన్ 12 మరియు ఇమ్మిగ్రేషన్ చట్టం సెక్షన్ 24 కింద నమోదైన అభియోగాలన్నింటి నుండి కోర్టు వారిని విముక్తి కల్పించింది. జగ్గారెడ్డి, కుసుమ కుమార్ తరపున న్యాయవాది జి. సంతోష్ రెడ్డి వాదనలు వినిపించగా, కోర్టు ప్రత్యేక ఉత్తర్వు ద్వారా గురువారం తీర్పు వెలువరించింది.

## అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాలు



**గద్వాల మార్చి 26 (వుదయం ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం జోగుళాంబ గద్వాల్ జిల్లాలో విస్తృతంగా కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు, యువతకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, అధిక వేగం నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై పోలీసులు వివరణాత్మకంగా తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు హెల్మెట్, సీట్ బెల్ట్‌లు నిబంధనలు మాత్రమే కాకుండా ప్రాణరక్షకాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమం ఒక సాధారణ ప్రచారం కాకుండా ప్రజల్లో మార్పు తీసుకురావాల్సిన ఉద్యమమని పోలీసులు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపై వివాహరచన పోటీలు

### ఇంచార్జి ఎస్ఐ గాయత్రి



**నారాయణపేట టౌన్ మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట రూరల్ పోలీ స్ స్టేషన్ పరిధిలోని జాజాపూర్ పాఠశాలలో అరయ్ అలైవ్ మూడో విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థు లకు చిన్నప్పటినుంచే రోడ్డు భద్రత నియమాలపై అవగా హన కల్పించడం ఎంతో అవసరమని ఎస్ఐ గాయత్రి తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించ డం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌర వించడం, హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి ముఖ్యమైన రోడ్డు భద్ర త నియమాలను వివరించా రు. చిన్న వయసులోనే ఈ నియమాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గు తాయని వారు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీలో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తమ మాటల్లో వివరించారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను అభినం దించి అవార్డులు ప్రధానం చేశారు. ఇటువంటి అవగా హన కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ భద్రతకు దోహద పడతాయని తెలిపారు. అరయ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించి, సురక్షిత ప్రయాణాన్ని అలవర్చు కోవాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్



**వెల్దండ మార్చ్ 26 (వు దయం ప్రతినిధి)** గ్రామంలోని 4వ వార్డులో ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేసిన సీసీ రోడ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకట గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఎర్ర శ్రీనివాస్, కూన సావిత్రమ్మ, పంచాయితీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు జంగిలి సునీత ఆనంద్,పాలాది మల్లీశ్వరి రంగనాథం,ముదికొండ కవిత రమేష్, పసునోజు వాణి పురుషోత్తం, గుద్దటి కిష్టల్, గోసుల కొండయ్య,మసిగుండ్ల వెంకటేష్,మారేపల్లి మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, శిరుశనగండ్ల శేఖర్ ,గోపిరెడ్డి రాఘవ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మట్ట భరత్,కాంగ్రెస్ యువ నాయకులు జంగిలి ఆనంద్ రాజ్, రేవల్లి రాజు , ఏకుల వెంకటేష్, జంగిలికొండలు, కూన ప్రశాంత్ , మట్ట నాగార్జున,గోరటి భరత్, డేవిడ్, కూన నాని, బన్నీ, మహేందర్, చిన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా స్వయంపాలన దినోత్సవం

**నారాయణపేట టౌన్ మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట పట్టణంలోని శివాజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.కలెక్టర్ గా అఖిల్,డి ఈ ఓ గా అర్చన , ఎం ఈ ఓ గా విగ్నేష్ ,ఎచ్ ఎం గా శిల్ప వ్యవహ రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా 11 వార్ట్ కౌన్సిలర్ సంక్లపురం డాక్టర్ భాగ్యవతి మల్లేష్ పాల్గొ న్నారు. విద్యార్థులను ఉద్దే శించి పాఠశాల ఎచ్ ఎం బలారం నాయక్ మాట్లాడుతూ భవిషత్తులో అందరు ఉన్నత స్థాయిలో ఉండాలి అని అందరిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ సింగ్, ఐశ్వర్య, అర్చన, సురేందర్, లక్షి భాయ్,అనిత,కవిత పాల్గొనీ విద్యార్థుల నైపుణ్యాన్ని గమనించి బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డ్స్ బహుకరించారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

### అసెంబ్లీ కార్యదర్శి ఆర్ తిరుపతికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే విజయుడు



**అలంపూర్ మార్చి 26 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న తన పట్ల అధికారులు, మైనార్టీ అధికారులు అధికారిక కార్యక్రమాలల్లో ప్రోటోకాల్ పాటించటం లేదని అలంపూర్ శాసనసభ్యులు విజయుడు అన్నారు. ఈ మేరకు ఆయన అసెంబ్లీ కార్యదర్శి ఆర్ తిరుపతి కి ఫిర్యాదు చేసారు. ప్రభుత్వం తరపున చేసిన రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందులకు ప్రోటోకాల్ పాటించక పోగా సమాచారం కూడా ఇవ్వకుండా మైనార్టీ అధికారులు నిర్లక్ష్యం చేశారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అనంతరం అసెంబ్లీ కార్యదర్శి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు.

## గింజలపై రామనామం

### 11 ఏళ్లుగా గద్వాల మహిళ సేవ

**గద్వాల మార్చి 26 (వుదయం ప్రతినిధి)** గద్వాల పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి అనే గృహిణి బియ్యపు గింజలపై "శ్రీరామ" నామం రాస్తూ భక్తిని చాటుతున్నారు. గత 11 సంవత్సరాలుగా ప్రతిరోజూ ఒక గంట సమయం కేటాయించి ఈ సేవ కొనసాగిస్తున్నారు ఈ గింజలను ప్రతి సంవత్సరం జరిగే శ్రీరాముల వారి కళ్యాణాల్లో తలంబ్రాలుగా సమర్పిస్తున్నారు. ఇప్పటికే బాద్రాచలం శ్రీరాముల వారి కళ్యాణానికి లక్షా అరవై వేల గింజలు, అయోధ్య ప్రతిష్టాపన సందర్భంగా 5,116 గింజలు, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి 5,116 గింజలను అందించారు ఈ సంవత్సరం గద్వాల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవి ఆలయానికి 5,116, నదీ అగ్రహారం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయానికి 4,000, వీరాపురం ఆంజనేయ స్వామి ఆలయానికి 1,116 గింజలను సమర్పిం చారు ఈ సేవను కొనసాగిస్తూ కుటుంబానికి శ్రీరాముని కృప కలగాలని కోరుకుంటు న్నట్లు ఆమె తెలిపారు.





## ఇంధన కొరత లేదు – వదంతులను నమ్మొద్దు

### అడిషనల్ కలెక్టర్ మాధురి



**సంగారెడ్డిజిల్లా ప్రతి నిది , మార్చి 26:వుదయం** జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని అడిషనల్ కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా, వదంతులను నమ్మవద్దని ఆమె కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ,జిల్లాలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పెట్రోల్ బంక్‌లు మరియు గ్యాస్ ఏజెన్సీలకు సరఫరాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల పెట్రోల్ బంక్‌ల వద్ద కనిపిస్తున్న క్యూలను చూసి కొరత ఉందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ప్రజలు అలాంటి వదంతులను నమ్మకూడదని సూచించారు. అవసరం లేకుండా ముందస్తుగా నిల్వ చేసుకోవడం వల్లే డిమాండ్ ఒక్కసారిగా పెరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో సాధారణంగా రోజుకు సుమారు 10 వేల ఎల్‌పీజీ సిలిండర్ల బుకింగ్స్ ఉండగా, వదంతుల ప్రభావంతో అది 16 వేల వరకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, రెగ్యులర్ కోట యథావిధిగా అందుతోందని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్‌ను కంటైనర్లు, డబ్బాలలో తీసుకెళ్లడం చట్టవ్యతిరేకమే కాకుండా ప్రమాదకరమని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు, డీలర్ల కార్యకలాపాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎం సివిల్ సప్లై అంబదాస్, ఏఎస్‌వో రాజేశ్వర్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించే కౌన్సిలర్‌కు ఘన సన్మానం



**నారాయణపేట టౌన్ మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట పట్టణంలోని మూడో వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన కాకర్ల నారాయ ణమ్మను గురువారం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ,మాజీ కౌన్సిలర్ జ్యోతి రాజు శాలువా పూల మాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడు తూ ప్రజా సమస్యలు పరిష్కరించే కాకర్ల అమ్మకు సన్మానించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఆమె అన్నారు. 2015 లో తోటి కౌన్సిలర్ గా గెలుపొందడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. తదనంతరం 2023లో వ్యవసాయ మార్కెట్ చైర్మన్గా పనిచేస్తు న్న సమయంలో కాకర్ల నారాయణమ్మ వ్యవసాయ డైరెక్టర్ గా పని చేశారని ఆమె గుర్తు చేశారు. అనంతరం 2026 లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మూడో వార్డు నుండి కాకర్ల నారాయణమ్మ పోటీ చేసి ఘన విజయం సాధించారని ఆమె అన్నారు. దీంతో కాకర్ల నారాయణమ్మ రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవ చేయాలని ఆమె మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా కాకర్ల నారాయణమ్మ మాట్లాడు తూ పదవులు ఉన్నా లేకున్నా తాను ఎప్పుడు ప్రజల సమస్యలను తెలు సుకుని వాటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళతానని ఆమె అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే వాటి ని శక్తివంచన లేకుండా పరి ష్కరించేందుకు కృషి చేస్తాన ని అన్నారు. అంతేకాకుండా వార్డు కౌన్సిలర్ గా గెలుపొం దిన తర్వాత వార్డులో గుంత లమైన రోడ్డును మట్టి వేసి రోడ్డును బాగు చేయించాను అని వార్డు ప్రజలు నా దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను పరిష్కరించాలని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ముసటి రాజు ,వెంకటేష్, శేఖర్ ,రాజు, ఆనంద్ , తదితరులు పాల్గొన్నారు.

## గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

### బీసీ సబ్ ప్లాన్ అమలుపై డిమాండ్



**(సంగారెడ్డి వుదయం )** హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. ఈ నిరసనలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు తో పాటు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని, బీసీ వర్గాలకు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ వాగ్దానాలను విస్మరించిందని వారు విమర్శించారు. బీసీలను మోసం చేసిన ఈ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు.

## వ్యాపార నిర్ణయంలో ఏఐ, ఎంఎల్ వినియోగంపై కార్యశాల

### గీతంలో మే 25 నుంచి 29 వరకు

**పటాన్చెరు ( వుదయం):** గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో 'వ్యాపార నిర్ణయం తీసుకోవడం కోసం కృత్రిమ మేధస్సు & యంత్ర అభ్యాసం'పై మే నెల 25 నుంచి 29వ తేదీ వరకు, ప్రతిరోజూ సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఐదు రోజుల ఆన్‌లైన్ ఆచారణాత్మక కార్యశాల (యాజమాన్య వికాస కార్యక్రమం – ఎండీపీ)ను నిర్వహిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆధునిక వ్యాపార నిర్ణయం తీసుకోవడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సదస్యులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమ లక్ష్మని తెలిపారు. ఏఐ–ఆధారిత విశ్లేషణలు వినియోగదారులను ఆకట్టుకోవడం, డిమాండ్ అంచనా, నష్ట అంచనా, ఆయా సంస్థలకు అనుగుణంగా మార్కెటింగ్ వంటి రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున, డేటా–ఆధారిత నిర్ణయాల కోసం ఈ సాంకేతికతలను వినియోగించడానికి ఆచరణాత్మక అంతర్దృష్టులతో ఈ శిక్షణలో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తామని వివరించారు. ప్రధానంగా నిర్వహణ, వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్లు, ఇంజనీరింగ్ విభాగాల నుంచి అధ్యాపకుల కోసం రూపొందించినట్టు తెలియజేశారు. ఎంఎల్ ను పూర్తిగా సాంకేతిక అంశంగా పరిగణించడం కంటే వ్యాపార–ఆధారిత వినియోగ కేసులు, ఆచరణాత్మక ప్రదర్శనలు, నమూనా ఉత్పత్తి వివరణపై కార్యశాల దృష్టి పెడుతుందన్నారు. ఇందులో పాల్గొనేవారికి ఏఐ, ఎంఎల్ భావనలను అందుబాటులో ఉంచడానికి ఆచరణాత్మక డేటాసెట్లు, విజువలైజేషన్ ఆధారిత వివరణలు, ఉపయోగించడానికి సులభమైన విశ్లేషణ అంతర్ముఖంగా ఉపయోగిస్తామని తెలిపారు. బిజినెస్ అనలిటిక్స్, డేటాసైన్స్, ఏఐ–ఎంఎల్ అప్లికేషన్లలో విస్తృత అనుభవం ఉన్న విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్ ఎం.కామాక్షయ్య ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షించిన, పర్యవేక్షించని అభ్యాసం, సిఫారసుదారు వ్యవస్థలు, సమిష్టి నమూనాలు వంటి కీలక అంశాలను వివరిస్తుందని తెలిపారు. ప్రతి సాంకేతికతను వినియోగదారుల అంచనా, మార్కెట్ విభజన, ఉత్పత్తి సిఫార్సు, మోసం గుర్తింపుతో సహా వాస్తవ–ప్రపంచ నిర్వాహక ప్రశ్నలను అనుసంధానిస్తుందని వివరించారు.ఈ కార్యశాల పూర్తయ్యేసరికి, ఇందులో పాల్గొనేవారు విషయ పరిజ్ఞానంపై అవగాహనతో పాటు ఏఐ–ఎంఎల్ పద్ధతులను ఆచరణాత్మకంగా తెలుసుకుంటారని తెలిపారు. ఈ పద్ధతులను వ్యాపార నిర్ణయ సమస్యలకు వర్తింపజేయడానికి, ఏఐ–ఆధారిత అధ్యయనాలు (కేస్ స్టడీస్), విద్యార్థి ప్రాజెక్టులను రూపొందించడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు, తమ పేర్ల నమోదు, రుసుము, ఇతరత్రా వివరాల కోసం jpaul@gitam.edu కు ఈ–మెయిల్ చేయాలని లేదా డాక్టర్ జోసెఫ్ పాల్ ను సంప్రదించాలని సూచించారు.



## అక్రమ ఇసుక డంపులు సీజ్

**గద్వాల మార్చి 26 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని బల్గెర గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. అధికారుల అనుమతులు లేకుండా ఒకే చోట దాదాపు ఐదు టిప్పర్ల ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహాయంతో అక్కడికి చేరుకుని విచారణ జరిపి ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, రవాణా లేదా నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో గట్టు ఎస్ఐ, శేఖర్ గౌడ్, ఆర్ఐ పాల్గొన్నారు.



## ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 6,17,220

**ఊర్కొండ న్యూస్ 26వుదయం ప్రతినిధి** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట శ్రీ పబ్బాతి ఆంజనేయ స్వామి ఆలయం హుండీ లెక్కింపు గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వీనాదరి, ఈవో సత్య చంద్రారెడ్డి పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 81 రోజులకు గాను స్వామివారి హుండీ ఆదాయం 6, లక్షల 17, వేల 220 రూపాయలు వచ్చినది. ఇట్టి ఆదాయంను బ్యాంక్ నందు జమపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, అధికారులు భక్తులు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి ఎమ్మెల్యే కసిరెడ్డికి ధన్యవాదాలు



**వెల్దండ మార్చి 26 (వు దయం ప్రతినిధి)** పాడి రైతు సమస్యలను అసెంబ్లీలో గల మెత్తిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి నియోజకవర్గం లోని రైతులు ధన్యవాదాలు తెలిపారు గత కొంతకాలంగా విజయ డెరీ ద్వారా పాలు అమ్మే పాడి రైతులకు బిల్లు రాక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్యను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కరించే దిశగా మాట్లాడినందుకు పాడి రైతులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు ఇకనైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో పాల బిల్లు అందజేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ వైద్య శిబిరం



**నారాయణపేట మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో గురువారం నారాయణపేట జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ జయ చంద్ర మోహన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల జి.ఆర్. రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై హజ్ యాత్రికుల వాక్సినేషన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 15 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ అందజేశారు.ఇందులో 7 మంది మహిళలు ఉన్నారు. హజ్ యాత్రికులకు మెడికల్ స్క్రీనింగ్ టెస్ట్ వాక్సినేషన్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి దర్గాహ్ హజ్రత్ తకి బాబా, సజ్జాదా నషీన్ జనాబ్ సయ్యద్ షా, గియాసుద్దీన్ ఖాద్రీ, కోలంపల్లి సజ్జాదా వారసుడు జనాబ్ అల్‌హాజ్ సయ్యద్ షా అహ్మద్ హుస్సైనీ అష్రఫీ, , నారాయణపేట హజ్ సొసైటీ అధ్యక్షుడు అల్‌హాజ్ అమీరుద్దీన్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి జనాబ్ అల్‌హాజ్ ఉస్మాన్ ఉబైదుల్లా సిద్దీకి అల్లాహ్ అతిథులైన హజ్ యాత్రికులకు స్వాగతం పలికారు. నారాయణపేట జిల్లా ఏర్పడిన తరువాత వరుసగా మూడు సంవత్సరాలుగా జిల్లాకు చెందిన హజ్ యాత్రికులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. అలాగే ప్రపంచ శాంతి, దేశం సమాజం శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హజ్ సొసైటీ అధ్యక్షుడు అల్‌హాజ్ అమీరుద్దీన్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి అల్‌హాజ్ ఉస్మాన్ ఉబైదుల్లా ముజాహిద్ సిద్దీకి తో పాటు హజ్ సొసైటీ సభ్యులు అల్‌హాజ్ మహ్మద్ అబ్దుల్ సలీమ్ అడ్వకేట్, అబ్దుల్ అజీమ్ మర్కీ, అబ్దుల్ ఖాదర్, అల్‌హాజ్ మహ్మద్ తకి చాంద్, మున్సిపల్ సభ్యుడు, అల్‌హాజ్ ఇజాజ్ హుస్సేన్ (రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్), ఖాజీ మహ్మద్ తకి ఖరాడీ, మహ్మద్ అజ్రుద్దీన్, మౌలానా ఫారూక్ మఖాషమ్, మహ్మద్ తకి చాంద్ పీర్ (మున్సిపల్ సభ్యుడు), హాఫిజ్ మహ్మద్ తకి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు చెల్లించండి

- టీజీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి



**సంగారెడ్డి, మార్చి 26:వుదయం.** సంగారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని గృహ మరియు వాణిజ్య భవనాల యజమానులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని టీజీఐఐసి చైర్పర్సన్ శ్రీమతి నిర్మలా జయప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మునిసిపల్ కమిషనర్‌తో నిర్వహించిన సమావేశంలో పట్టణాభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్చి 31లోపు ప్రజలందరూ తమ పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో పెనాల్టీ రూపంలో అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. పట్టణ అభివృద్ధి కోసం పన్నుల చెల్లింపు కీలకమని ఆమె స్పష్టం చేశారు. తదుపరి, ఇంటి పన్నుకు సంబంధించిన రుసుమును కమిషనర్‌కు అందజేశారు.

## రాజా ప్యాలెస్ అద్భుతం

### అవధూత గిరి మహారాజ్



**(జహీరాబాద్ మార్చి 26 వుదయం )** సంగారెడ్డి జిల్లాలో ఎక్కడా లేని విధంగా పురాతన వస్తువులు, సాంప్రదాయ కళా నైపుణ్యం, ప్రకృతి అందాలతో మేళవించి జహీరాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన రాజా ప్యాలెస్ మహా అద్భుతంగా ఉందని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, కాంట్రాక్టర్ రాజు పాటిల్ నిర్మించిన రాజా ప్యాలెస్‌ను గురువారం ఆయన సందర్శించారు. పూర్వకాల సంప్రదాయాన్ని నేటి తరానికి తెలియజేసేలా ఈ నిర్మాణం ఉండడం అభినందనీయమని అవధూత గిరి మహారాజ్ ప్రశంసించారు.

## బీకేఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**నారాయణపేట మార్చి 25 (వుదయం ప్రతినిధి)** విద్యుత్ షాక్ తో మరణించిన బాధిత కుటుంబానికి భారతీయ కిసాన్ సాంగ్ ఆధ్వర్యంలో 5 లక్షల రూపాయల చెక్కులు అందజేశారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం అప్పంపల్లి గ్రామం లో నివసిస్తున్న అనంతమ్మ గత రెండు సంవత్సరాల క్రింద భారీ వర్షం కారణంగా ఇంట్లో బట్టలు ఇస్త్రీ చేస్తున్న సమయంలో ఇల్లంతా షాక్ రావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం అందించారు. ప్రభుత్వపరంగా విద్యుత్ శాఖ ద్వారా వారి భర్త బాల్ రెడ్డికి 5 లక్షల రూపాయల జిల్లా విద్యుత్ అధికారి నవీన్ కుమార్ చేతుల ద్వారా ఏఈ ప్రదీప్ కుమార్ మొగులప్ప ,భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యులు వెంకోబా ,జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి సమక్షంలో ఐదు లక్షల బ్యాంకు చెక్కు వారికి అందజేశారు.అందుకుగాను బాల్ రెడ్డికి నాలుగున్నర లక్షలు బ్యాంకు డిపాజిట్ చేస్తూ 50వేల చెక్కును విద్యుత్ షాక్ తో భార్య చని పోయిన రెండు సంవత్సరాల అనంతరం నష్టపరియం వచ్చిన సందర్భంగా సహకరించిన పెద్దలందరికీ భారతీయ కిసాన్ సాంగ్ నాయకులకు ఆకుల వెంకటప్ప ,శాసముల బాలప్ప ,మహిపాల్ రెడ్డి ,తంగు విశ్వనాథ్ ,కురువ భూషణప్ప అవసలోని పల్లి, జట్రం రాజు, పీకే ఆంజనేయులు, నరసింహా రెడ్డి ఇమామ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొనారు.వ్యవసాయ రైతులకు విద్యుత్ షాక్ వల్ల రైతు కుటుంబాలకు నష్టం జరిగిన సందర్భంగా రైతు కమిటీ నాయకులు సంఘటితంగా పోరాడి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి చెక్కు ఇప్పించడం వల్ల అధికారులకు రైతు నాయకులకు బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా దినోత్సవ వేడుకలకు ప్రముఖులకు ఆహ్వానం





**సంగారెడ్డి, మార్చి 26, వుదయం** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న వేడుకలకు ప్రముఖులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకు , టీపీసీసీ కార్యదర్శి జగ్గారెడ్డి కి , టీజీఏసీ చైర్మన్ నిర్మల రెడ్డి కి జిల్లా మహిళా సమాజం ప్రతినిధులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాజం అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ, ప్రధాన కార్యదర్శి గొర్రెగట్టు శారదా, యూత్ ప్రధాన కార్యదర్శి నవీన్ రామోజి పాల్గొని ఆహ్వాన పత్రాలను అందజేశారు. మహిళల సాధికారత, సామాజిక అభివృద్ధిలో వారి పాత్రను చర్చించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

## గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



**ఊర్కొండ న్యూస్ 26వుదయం ప్రతినిధి** నాగర్ కర్నూల్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ముచ్చర్లపల్లి గ్రామంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీని ఈ రోజు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీకి చైర్మన్‌గా గ్రామ సర్పంచ్ శ్రీమతి వినిత ధర్మేందర్ రెడ్డి నీ నియమించారు. గ్రామ పరిధిలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, పాఠశాల మానేసిన పిల్లలు, అనాథ బాలలు మరియు బాలలపై హింస వంటి సమస్యలను గుర్తించి వాటి నివారణకు ఈ కమిటీ పనిచేస్తుంది. బాలల హక్కుల పరిరక్షణ మరియు వారి భవిష్యత్తు కోసం గ్రామ స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలో ఉప సర్పంచ్, యువజన సంఘం నాయకులు, గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్, మహిళా సంఘం అధ్యక్షురాలు, సహాయం సేవ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. గ్రామంలో బాలల రక్షణ అందరి బాధ్యత అని చైర్మన్ తెలిపారు.

## స్విమ్మింగ్ పూల్ వద్ద స్టాల్ ఏర్పాటుకు అనుమతి

### ఆసక్తి గల వారికి ఆహ్వానం

**సంగారెడ్డి, మార్చి 26:వుదయం.** జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో రాజీవ్ పార్క్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో కెఫెటీరియా మరియు స్పోర్ట్స్ మెటీరియల్ విక్రయానికి స్టాల్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి గల వారికి అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ స్టాల్‌ను మూడు నెలల కాలానికి అనుమతించనున్నట్లు వెల్లడించారు. స్విమ్మింగ్ పూల్‌లోని గది అద్దెను నెలకు రూ.25,000గా నిర్ణయించినట్లు అధికారులు పేర్కొన్నారు. స్టాల్ ఏర్పాటు చేసుకునే అభ్యర్థులు మార్చి 31, 2026లోపు జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం, సంగారెడ్డిలో తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఒక కంటే ఎక్కువ దరఖాస్తులు అందిన పక్షంలో స్టాల్ కేటాయింపును వేలం పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాపారులు ముందుకు రావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాల కోసం 7981798957 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా యువజన మరియు క్రీడా అధికారి (FAC) అఖిలేశ్ రెడ్డి తెలిపారు

## శక్తిపీఠంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**నారాయణపేట మార్చి 25 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం ఆధ్వర్యంలో గురువారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం శ్రీ సీతారాముల దివ్య కళ్యాణంతో ప్రారంభమై, భక్తులకు కనుల పండుగగా నిలిచింది. భక్తులు అపార భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద్ పురోహిత్ ఆధ్యాత్మిక ప్రవచనం అందిస్తూ, శ్రీ సీతారాముల దైవిక కథలు, వాటి లోని ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు వివరిస్తూ అందరికి ఆశీర్వాదలను అందజేసారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులు రాయచూరు శేషగిరిదాస్ చే సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు ఈ సంగీత కార్యక్రమం భక్తులను భక్తిరసంలో ముంచెత్తింది.తెలుగు సినీ, సీరియల్ నటి రాశి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



## యూట్యూబ్ తరహాలో ఇన్‌స్టాలోనూ ప్లేబ్యాక్ స్పీడ్ కంట్రోల్

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌కున్న ఆదరణ గురించి వేరే చెప్పక్కర్లేదు. కొన్నిసార్లు నిడివి ఎక్కువ ఉన్న రీల్స్ ఫీడ్‌లో దర్శనమిస్తుంటాయి. వాటిని కావాల్సిన వేగంతో చూడ లేక యూజర్లు ఇబ్బంది పడుతుంటారు. యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి యాప్‌లు వాడి ఇన్‌స్టాగ్రామ్ వచ్చేసరికి తరచూ ఈ సమస్య ఎదురవుతుంటుంది. ఇందుకు చెక్ పెట్టెందుకు ఇన్‌స్టా సిద్ధమైంది. ప్లేబ్యాక్ స్పీడ్‌కంట్రోల్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. అంటే ఇకపై రీల్స్‌ను మనకు కావాల్సిన వేగంతో చూడొచ్చన్నమాట.




# భారత్ 60 మి. బ్యారెళ్ల రష్యా చమురు కొనుగోలు




పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడిన నేపథ్యంలో ఇంధన భద్రత కోసం భారత్ అడుగులు వేస్తోంది. ఏప్రిల్ నెలకు దాదాపు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును భారత్ కొనుగోలు చేసిందని బ్లూమ్‌బర్గ్ నివేదికలో పేర్కొంది. సరఫరా కొరత, డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ చమురును బ్రెంట్ చమురు ధర కంటే ప్రతి బ్యారెల్‌కు 5–15 డాలర్ల అదనపు ప్రీమియంతో కొనుగోలు చేశారు. ప్రస్తుత నెల కొనుగోళ్లతో ఇవి సమానంగా ఉన్నప్పటికీ.. ఫిబ్రవరిలో కొనుగోలు చేసిన దానికంటే రెండింతలు ఎక్కువని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ పేర్కొంది. మార్చి 5 కంటే ముందే నౌకల్లో లోడ్ చేసిన రష్యా చమురును తీసుకోవడానికి అమెరికా మినహాయింపు ఇవ్వడం ఈ కొనుగోళ్లకు కలిసొచ్చింది. తర్వాత ఈ మినహాయింపును మార్చి 12లోపు సముద్రంలో ఉన్న నౌకలకు కూడా విస్తరించారు. మళ్లీ రష్యా మార్కెట్ వైపు రిఫైనరీలు: అమెరికా ఒత్తిడి కారణంగా డిసెంబరు నుంచి రష్యా చమురుకు దూరంగా ఉన్న మంగళూరు రిఫైనరీ, హిందుస్థాన్ మిత్తల్ ఎనర్జీ వంటి భారతీయ రిఫైనరీలు మళ్లీ కొనుగోళ్లను ప్రారంభించాయి. ఇటీవలి నెలల్లో సౌదీ అరేబియా, ఇరాక్ నుంచి సరఫరాపై భారత్ దృష్టి పెట్టినప్పటికీ, యుద్ధం కారణంగా ఆ కార్గోలు పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోవడంతో రిఫైనరీలు మళ్లీ రష్యా వైపు మొగ్గుచూపాయి.

భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో ఇతర దేశాల నుంచి చమురు దిగుమతుల కోసం భారత్ చూస్తోంది. కెప్లర్ గణాంకాల ప్రకారం.. ఏప్రిల్‌లో వెనెజువెలా నుంచి సుమారు 8 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి కానుంది. 2020 అక్టోబరు తర్వాత ఇదే అత్యధికం.

# పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు.. కేంద్రం

దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 60 రోజులకు సరిపడా స్టాక్ ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీకి కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని కొట్టి పారేసింది. తప్పుదోవ పట్టించేలా ప్రచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. దేశవ్యాప్తంగా ఉన్నట్లుండి పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులుతీరుతున్న నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచంలోనే భారత్ నాలుగో అతిపెద్ద రిఫైనర్ అని, ఐదో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారుగా ఉందని కేంద్రం పేర్కొంది. దేశీయంగా తగినంత సరఫరా కలిగి ఉండడమే కాకుండా..



150కి పైగా దేశాలకు శుద్ధి చేసిన ఇంధనాలను సరఫరా చేస్తోందని ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలో ప్రతి రిఫైనరీ నూరు శాతం ఉత్పత్తాదక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది. దేశంలో తదుపరి 60 రోజులకు సరిపడా క్రూడాయిల్ చమురు కంపెనీల వద్ద ఉందని కేంద్రం తెలిపింది. వ్యూహాత్మక నిల్వలతో కలిపి 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమై 27వ రోజులు మాత్రమే అయ్యిందని గుర్తుచేసింది. భౌగోళిక పరిణామాలతో సంబంధం లేకుండా రాబోయే రెండు నెలల పాటు స్థిరంగా చమురు సరఫరా చేయడానికి సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టంచేసింది. అలాగే, దేశీయంగా ఎల్‌పీజీ నిల్వలు కూడా సరిపడా ఉన్నాయని కేంద్రం పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తి పెంచామని, తద్వారా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం కూడా తగ్గిందని తెలిపింది. ఎల్‌పీజీకి కొరత రాకుండా ఉండేందుకు పలు దేశాల నుంచి కార్గోలను తెప్పిస్తున్నామని వెల్లడించింది. ఇంధనం విషయంలో సామాజికమాధ్యమాల్లో తప్పుడు, కల్పిత ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది.

# ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు.. ఖండించిన రిలయన్స్




ఇరాన్ చమురుపై ఆంక్షలు తొలగిన ఆ దేశం నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ చమురు కొనుగోలు చేసిందన్న వార్తలను ఆ సంస్థ ఖండించింది. సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై ఆ సంస్థ స్పందించింది. "ఇరాన్ ముడి చమురును కొనుగోలు చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఖండిస్తున్నాం. అవి పూర్తి నిరాధారమైనవి. తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయి. సంబంధిత మీడియా సంస్థలు ప్రచురణకు ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అంటూ రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియా సంక్షోభం ఫలితంగా అంతర్జాతీయంగా ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటిన నేపథ్యంలో ఇరాన్ చమురు కొనుగోలు చేసుకోవచ్చని అమెరికా ప్రకటించింది. ఆంక్షలు ఎత్తివేసిన నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 5 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురును నేషనల్ ఇరానియన్ ఆయిల్ కో (ఎన్ఐఓసీ) నుంచి కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ధర కూడా బ్యారెల్ బ్రెంట్ ముడిచమురుపై 7 డాలర్లు అదనంగా చెల్లించిందంటూ సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఆ వార్తలు అవాస్తవమంటూ రిలయన్స్ ఖండించింది.

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నయారా ఎనర్జీ




ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్–బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో–బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOC), బీపీసీఎల్ (BPCL), హెచ్‌పీసీఎల్ (HPCL) మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.






## 2026–27 హోం సీజన్ షెడ్యూల్.. తొమ్మిది వన్డేలు ఆడనున్న రో–కో

భారత క్రికెట్‌కు సంబంధించి 2026–27 హోం సీజన్ షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత పర్యటనకు వస్తాయి. మొత్తం 22 అంతర్జాతీయ మ్యాచులకు 17 నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2026 సెప్టెంబర్ 27న వెస్టిండీస్ పర్యటనతో మొదలయ్యే హోం సీజన్.. 2027 మార్చి 3తో ముగుస్తుంది. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ కోసం భారత్‌లో ఆసీస్ పర్యటించనుంది. హైదరాబాద్ వేదికగా ఒక వన్డే, ఒక టీ20 మ్యాచ్ జరగనున్నాయి. ఈ సీజన్‌లో స్వదేశంలో భారత్ 9 వన్డేలను ఆడనుంది. వచ్చే ఏడాది ప్రపంచ కప్ లక్ష్యంగా వన్డేల్లోనే కొనసాగుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను తొమ్మిది మ్యాచుల్లో చూసే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం.. టీ20లు రాత్రి 7 గంటలకు, వన్డేలు మధ్యాహ్నం 2 గంటలకు, టెస్టులు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి.

# సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త



సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ కొంతకాలంగా వెన్ను గాయంతో ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. అతడు ప్రస్తుత ఐపీఎల్ 2026లో ఆడే విషయమై అనిశ్చితి నెలకొంది. అయితే కమిన్స్.. అభిమానులకు ఓ శుభవార్త తెలిపాడు. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టులోకి వస్తానని చెప్పాడు. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో అతడు పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. 'నేను వెన్ను గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నా. కానీ ప్రస్తుతం బాగుంది. ఇప్పుడు నెట్స్‌లో బౌలింగ్ చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ప్రారంభ మ్యాచుల్లో ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశముంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నమెంట్ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి మ్యాచ్ ఎం.చిన్నస్వామి స్టేడియంలో మార్చి 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్యన జరగనుంది.

# ఓపెనర్ అతడు కాదు.. నేనే: రుతురాజ్ గైక్వాడ్




ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆయుష్ మాత్రే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఓపెనింగ్ చేయడం లేదని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. సంజుశాంసన్‌తో కలిసి తానే ఓపెనింగ్ చేస్తానని వివరించాడు. ఈ విషయాన్ని అతడు ఐపీఎల్ కెప్టెన్స్ డే ఈవెంట్ అనంతరం వెల్లడించాడు. ఈ విషయమై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా స్పందించాడు. 'రుతురాజ్ గైక్వాడ్, సంజుశాంసన్‌కు మంచి నేపథ్యం ఉంది. వారిద్దరూ ఓపెనింగ్ జోడీగా చక్కగా పరుగులు రాబట్టాలని నేను కోరుకుంటున్నాను. వారిద్దరిలో వేర్వేరు బలాలున్నాయి. ఒకరు భారీ షాట్లు ఆడితే, మరొకరు బంతిని సున్నితంగా బాదుతారు. వారిద్దరూ మంచి ఓపెనర్లు' అని అశ్విన్ అన్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్‌కింగ్స్ తన మొదటి మ్యాచ్‌ను గువాహటి వేదికగా మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తో ఐపీఎల్ నూతన సీజన్ ప్రారంభం కానుంది.

# అప్పుడు ప్రీతి జింటా ఫోన్ చేసి సారీ చెప్పింది: జితేశ్ శర్మ



పంజాబ్ కింగ్స్‌తో ఉన్నప్పుడు ఆ ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటాను సోదరిగా భావించేవాడనని క్రికెటర్ జితేశ్ శర్మ తెలిపాడు. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు మారిపోయిన తర్వాత.. ప్రీతి జింతా నుంచి ఫోన్ వచ్చిందని తెలిపాడు. తనకు సారీ చెప్పినట్లు తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో జితేశ్ గుర్తు చేసుకున్నాడు. తాను హిమాచల్ ప్రదేశ్ నుంచి వచ్చానని.. ప్రీతి జింతా కూడా అక్కడి వారేనని తెలిపాడు. నేను ప్రీతి జింటాను గౌరవిస్తా. నాకు ఫోన్లు, మెసేజ్‌లు చేస్తూ ఉంటారు. ఆమెను పెద్దక్కలా భావిస్తా. ఐపీఎల్ లోకి వచ్చాక హిమాచల్ ప్రదేశ్‌వాడినని ఆమెకు తెలిసింది. అప్పట్నుంచి మా అనుబంధం పెరిగింది. ఎందుకంటే ఆమెది కూడా హిమాచల్. గంటల తరబడి మాట్లాడేవాడిని. చాలా మంచి వ్యక్తి. పంజాబ్ కింగ్స్ జట్టుతో చేరడం నా జీవితాన్ని మార్చివేసింది. అప్పుడు నాకోసం కేవలం ఒకే ఒక్క బిడ్ మాత్రమే వచ్చింది. పంజాబ్ కింగ్స్ తీసుకుంది. ఎప్పటికీ పంజాబ్ కింగ్స్‌కు రుణపడి ఉంటా. నేను ఇవాళ ఇలా ఉన్నానంటే ఆ జట్టే కారణం. రెండు మ్యాచుల తర్వాత తుది జట్టులో అవకాశం వచ్చింది. 2025 సీజన్‌కు ముందు నా కోసం జరిగిన వేలంలోనూ రూ.7 కోట్లకు పంజాబ్ కింగ్స్ రైట్–టు–మ్యాచ్ కార్డు వాడింది. అయితే, ఆర్సీబీ రూ.11 కోట్లకు బిడ్ చేయడంతో పంజాబ్‌కు కుదరలేదు. ఆ తర్వాత ప్రీతి జింటా నాకు ఫోన్ చేశారు. 'సారీ.. నిన్ను తీసుకోలేకపోయా' అని చెప్పారు. నేను కూడా పంజాబ్‌తో ఉండాలనుకున్నా. కానీ, కుదరలేదు. ఆర్సీబీ నన్ను రూ. 11 కోట్లకు తీసుకోవడంతో ఆమె కూడా సంతోషించారు'' అని జితేశ్ వెల్లడించాడు.

# ఐపీఎల్ 2026.. పూర్తి షెడ్యూల్ వచ్చేసింది

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ vs దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది. క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్లతో జరిగిన సమావేశంలో అందుకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపించారని సమాచారం. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.



## తొలి ఐపీఎల్ ట్రోఫీ గెలవాల్సిందే: ఎల్ఎస్‌జీ యజమాని సంజీవ్ గొయెంకా



ఐపీఎల్ (IPL) 2026 సీజన్ శనివారం నుంచే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (Lucknow Supergiants) యజమాని సంజీవ్ గొయెంకా కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ప్లేఆఫ్స్‌నకు చేరుకుంటేనే సరిపోదని, తన తొలి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకోవాలన్నారు. మా నిజమైన గుర్తింపు ఇంకా రూపుదిద్దుకుంటోందని నేను భావిస్తున్నా. ఏ క్రీడా జట్టుకైనా ట్రోఫీ గెలిస్తేనే గౌరవం. మేము ఇప్పటి వరకు రెండుసార్లు ప్లేఆఫ్స్‌నకు చేరుకున్నాం. కచ్చితంగా ఇది సరిపోదు. కొన్నిసార్లు గెలుస్తాం. మరి కొన్నిసార్లు ఓడిపోతాం. కానీ మేం మా మొదటి ట్రోఫీని గెలవాలి' అని సంజీవ్ గొయెంకా అన్నారు. అలాగే.. గత సీజన్‌లోని అంశాలను ప్రస్తావిస్తూ, తమ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సమస్యను తాము పరిష్కరించామనే అనుకుంటున్నామన్నారు. గత సీజన్‌లో ఎల్ఎస్‌జీ ప్రధాన బౌలర్లలో చాలా మంది గాయపడినప్పటికీ, మేము ఆడిన మొదటి ఆరు మ్యాచుల్లో నాలుగింట్లో గెలవడం సానుకూలాంశం. మేము సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం. ఐడెన్ మార్‌క్రమ్, మిచెల్ మార్ష్‌లను ఓపెనింగ్‌కు పంపించాం. అది వారిద్దరికీ అత్యుత్తమ ఐపీఎల్ సీజన్‌గా నిలిచింది. దిగ్వేశ్ రాఠీ కొత్త ఆటగాడిగా జట్టులోకి వచ్చి చక్కగా రాణించాడు. అయితే, మాకు బలమైన బౌలింగ్ విభాగం లేదని మేం గ్రహించాం. అందుకే ఈసారి ఆ లోటును పూరించాం' అని పేర్కొన్నారు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీలు భారీ ధరకు అమ్ముడైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇదంతా జైషా దార్శనికత వల్లే సాధ్యమైందని సంజీవ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే దీనిలో తన పేరును ప్రస్తావించకపోవడంతో, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ స్పందించారు. 'ఈ మోడల్‌ను ఎవరు రూపొందించారో ఆయనకు గుర్తు లేదేమో' అని పేర్కొన్నారు.

# వుదయం సినిమా
MOVIE TIME!

## బాలకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు



ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీ 2026 లో శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి "లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు" (జీవన సాఫల్య పురస్కారం) లభించడం, ఆ పురస్కారాన్ని ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీమతి గుప్తా రేఖ గారి చేతుల మీదుగా వారు అందుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో శ్రీ నందమూరి బాలకృష్ణ గారి ప్రస్థానంలో ఇది మరొక మైలురాయి మాత్రమే కాదు, తెలుగు సినీ పరిశ్రమకే ఇది గర్వకారణం. ఈ సందర్భంగా, శ్రీ నందమూరి బాలకృష్ణ గార్కి మా హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. భవిష్యత్తులో శ్రీ నందమూరి బాలకృష్ణ గారు మరిన్ని అవార్డులు అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

ఇట్లు
భవదీయులు

(టి. ప్రసన్న కుమార్) గౌరవ కార్యదర్శి
(వై.వి.ఎస్. చౌదరి) గౌరవ కార్యదర్శి

## మధ్యతరగతి కుటుంబ కథే
# కార్మేని సెల్వం



పాత్వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగ రాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచగా.. గురువారం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుత ట్రెండ్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఫ్యామిలీ ఎమోషన్స్‌తో విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సముద్రఖనితో వర్క్ చేసిన తెలుగు డైరెక్టర్స్ 'విమానం' ఫేమ్ శివ ప్రసాద్, 'రామం రాఘవం' ఫేమ్ ధనరాజ్, 'సేవ్ ద టైగర్స్' ఫేమ్ తేజ కాకుమాను అతిథులుగా హాజరయ్యారు.

## బాలయ్యకు జీవిత సాఫల్య పురస్కారం



అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో భాగంగా తెలుగు సినీ దిగ్గజం, లెజెండరీ నటుడు నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఐదు దశాబ్దాల అసాధారణ సినీ వారసత్వాన్ని, చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తుగా ప్రతిష్టాత్మకమైన భరత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో తెలుగు సినిమా దిగ్గజం నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 50 ఏళ్ల ప్రస్థానంలో భారతీయ సినిమాకు ఆయన చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా, నటన కళ పట్ల ఆయనకున్న చెరగని ప్రభావం, బహుముఖ ప్రజ్ఞ, అసమానమైన అంకితభావానికి నివాళిగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మార్చి 25న న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిత్ర, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఢిల్లీ గౌరవ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అనిల్ రావిపూడితో బాలకృష్ణ చేసిన 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో తెలుగులో ఉత్తమ చలనచిత్రంగా అవార్డుని సాధించిన సంగతి తెలిసిందే. ఇక ఈ చలనచిత్రోత్సవ కార్యక్రమంలో ఈ మూవీని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనలో నటసింహం నందమూరి బాలకృష్ణ, చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పాల్గొన్నారు. ఈ ప్రదర్శన అనంతరం..

నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ .. 'ప్రప్రథమంగా మా అమ్మనాన్నలకు ప్రణామాలు. వారి ఆశీర్వాదం లేకపోతే నేను ఇక్కడి వరకు వచ్చేవాడిని కాదు. వారి ఆశీర్వాదం వల్లే నేను చిత్ర సీమలో యాభై ఏళ్లుగా రాణిస్తూనే ఉన్నాను. ఇతర ఏ భాషలోనూ, ఏ ఇండస్ట్రీలోనూ ఇలా యాభై ఏళ్ల పాటు హీరోగా రాణిస్తున్న వ్యక్తి లేరని నేను గర్వంగా చెప్పగలను. మహిళల గురించి, మహిళల సాధికారత గురించి మా నాన్న గారు



ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవారు. తండ్రి ఆస్తిలో మహిళలకు వాటాని కల్పించే చట్టాన్ని ఆయన మొదటగా తీసుకు వచ్చారు. తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీని స్థాపించారు. మా నాన్న గారు సినిమాల్లో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా మహిళా సాధికారత గురించి పాటు పడ్డారు. ఆయన వారసత్వాన్ని, ఆయన ఆశయాల్ని మేం కొనసాగిస్తాం. ఆయన ఎప్పుడూ మా గుండెల్లో సజీవంగా ఉంటారు. అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి)లో పాల్గొనడం, పురస్కారాన్ని స్వీకరించడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో మా 'భగవంత్ కేసరి' సినిమాని ప్రదర్శించడం గర్వంగా ఉంది. మాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు' అని అన్నారు.






## రేసుగుర్రం
### ఏప్రిల్ 8న గ్రాండ్‌గా రీ-రిలీజ్!

టాలీవుడ్‌లో భారీ విజయాన్ని సాధించిన రేసుగుర్రం సినిమా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్ విడుదల అయ్యింది. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించిన ఈ సినిమా యాక్షన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ కలయికతో అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ చిత్రానికి భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ ట్రైలర్‌తో మళ్లీ ఆ పాత మాస్ ఫీల్‌ను ప్రేక్షకులు అనుభవించబోతున్నారు. దర్శకుడు సురేందర్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో శృతి హాసన్ హీరోయిన్‌గా నటించగా, బ్రహ్మానందం తన కామెడీతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రౌన్ మూవీస్ ద్వారా ఏప్రిల్ 8, 2026న గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమా, బన్నీ ఫ్యాన్స్‌కు బర్త్‌డే సెలబ్రేషన్స్‌ను మరింత గ్రాండ్‌గా మార్చనుంది. అల్లు అర్జున్ ఎనర్జీ, బ్రహ్మానందం కామెడీ టైమింగ్, థమన్ అందించిన సంగీతం అన్ని కలిసి ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. ముఖ్యంగా బ్రహ్మానందం పాత్రకు అప్పట్లో వచ్చిన రెస్పాన్స్ ఇప్పటికీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉంది.

## సుయోధన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్



ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం "సుయోధన". వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. పలు హిట్ చిత్రాలను రిలీజ్ చేసిన శ్రీ లక్ష్మి పిక్చర్స్ సంస్థ "సుయోధన" సినిమాను విడుదల చేస్తోంది. ఈ రోజు ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు.

ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి మాట్లాడుతూ నేను ఈ సినిమాలోకి రావడానికి కారణం ఎడిటర్ ఛోటా కె ప్రసాద్. ఆయన ఈ సినిమాకు ఎడిటింగ్ తో పాటు అనేక విషయాల్లో సపోర్ట్ చేస్తూ అండగా నిలిచారు. ఈ మూవీ కోసం మంచి సెట్ వర్క్ చేశాం. అది మూవీ లో చాలా బిగ్ స్పాన్ లో కనిపిస్తుంది. సాయి కుమార్ గారికి, ప్రియదర్శికి తమ కెరీర్ లో ఒక స్పెషల్ మూవీగా "సుయోధన" నిలుస్తుంది. అన్నారు.

## పాపం ప్రతాప్
### మాములు హిట్ అవదు

టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలో, ఎస్.పి. దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన వైవిధ్యభరిత చిత్రం 'పాపం ప్రతాప్'. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. వరుస బ్లాక్ బస్టర్స్‌తో ఆడియన్స్‌ను అలరిస్తున్న ఈటీవి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నుంచి రాబోతున్న ఈ సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజైన టీజర్‌కు మంచి అప్లాజ్ వస్తోంది. ఇప్పటివరకు ప్రేమలో గెలిచాం.. పెళ్లి తర్వాత ఆ ప్రేమ ఎలా ఉంటుందో చూద్దాం అనుకుంటున్న ఓ జంట చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందింది. 'రేపటి నుంచి మీ ఇద్దరి మధ్య ఏ గొడవైనా జరిగినా.. ఆ గొడవ వల్ల నా పరువు పోయినా.. గుర్తుపెట్టుకో నీ బతుకు నా చేతిలో చేతబడి బొమ్మేరోయ్' అంటూ హీరో తండ్రి డైలాగ్‌తో ఆసక్తికరంగా టీజర్ ఉంది. థియేటర్లలో ఫన్ రైడ్ చేయించే ఈ నవ్వుల బ్లాక్ బస్టర్‌ను ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చిత్ర యూనిట్ పాల్గొని సినిమా విశేషాలను పంచుకుంది.



## ఇరుముడి 50 శాతం పూర్తి



మాస్ మహారాజా రవి తేజ ప్రస్తుతం తన 'ఇరుముడి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రతిష్టాత్మక పాన్‌ఇండియన్ పవర్‌హౌస్ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ ఎత్తున నిర్మిస్తోంది. మేకర్స్ ఇప్పటికే రవి తేజ, ప్రియా భవానీ శంకర్‌ల ఫస్ట్ లుక్‌ను పోస్టర్‌ను విడుదల చేసి అందరిలోనూ క్యూరియాసిటీని పెంచేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోండగా ఇప్పటికే 50% షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం చిత్ర బృందం హైదరాబాద్‌లో హైఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలను షూట్ చేస్తోంది. అనల్ అరసు, రియల్ సతీష్ స్టంట్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో చూడనటువంటి అత్యంత అద్భుతమైన ఫైట్‌లను ప్రేక్షకులు చూడబోతున్నారని టీం చెబుతోంది.

యాక్షన్ ప్రధాన ఆకర్షణగా ఉన్నప్పటికీ 'ఇరుముడి'లో అద్భుతమైన కథ, కాన్సెప్ట్ ఉంటుంది. అయ్యప్ప స్వామి, అయ్యప్ప మాల నేపథ్యంలో సాగే ఈ కథలో ఓ అందమైన కుటుంబం, ఫ్యామిలీ ఎమోషన్స్ అద్భుతంగా ఉండబోతోన్నాయని మేకర్స్ వదిలిన పోస్టర్స్, కంటెంట్ చెబుతోంది. దర్శకుడు శివ నిర్వాణ ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్‌కు అవసరమైన అన్ని అంశాలను, బలమైన భావోద్వేగ ప్రధానాంశంతో సమతుల్యం చేస్తూ ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను రూపొందించారు.

రవి తేజ తాను ఇంతకు ముందు పోషించిన పాత్రలన్నింటిలోనూ భిన్నమైన పాత్రను 'ఇరుముడి'లో పోషిస్తున్నారు. ఈ చిత్రంలో తన కుమార్తెగా నటించిన బేబీ నక్షత్రతో రవి తేజకు ఉన్న బంధాన్ని చూపిస్తూ, చిత్ర బృందం ఒక అందమైన, ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రవి తేజ వింటేజ్, విలేజ్, మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. సాధారణ చెక్ షర్ట్, లుంగీ ధరించి తన కుమార్తెతో కలిసి నడుస్తూ ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌ను చూస్తుంటే తండ్రీకూతుళ్ల మధ్య మంచి ఎమోషనల్ సీన్లను సినిమాలో చూపించేలా ఉన్నారనిపిస్తోంది.

సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక వంటి అద్భుతమైన ఆర్టిస్టులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలైన నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా నిలవనుంది. ఈ మూవీకి విష్ణు శర్మ సినిమాటోగ్రఫర్‌గా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కో ఆర్డినేటర్‌గా వర్క్ చేస్తున్నారు.

## నాగబంధం
### జూలై 3న గ్రాండ్ రిలీజ్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మైథలాజికల్ ఎపిక్ చిత్రం 'నాగబంధం'. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూలై 3న విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. వర్షాకాలం ప్రారంభంలోనే విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించుకుంది.

ఈ మేరకు విడుదల తేదీ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రెండు రకాల గెటప్స్‌లో హీరో కనిపిస్తున్నారు. పై భాగంలో శివుడిగా హీరోగా పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇక కింది భాగంలో మోడ్రన్ లుక్‌లో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ ఆడియెన్స్‌లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తోంది. శివుడిగా విరాట్ లుక్‌కి ఇప్పటికే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ పోస్టర్ అయితే నెక్స్ట్ లెవెల్లో ఉంది.

ఈ చిత్రం ఇప్పటికే ఆడియెన్స్‌లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం 'నమో రే' ఇప్పటికీ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతూనే ఉంది. ఇక రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడంతో టీం ప్రమోషన్స్ మీద ఫోకస్ పెట్టనుంది. ఇకపై వరుస అప్డేట్లతో ప్రేక్షకుల్లో మరింత బజ్‌ను పెంచేలా టీం ప్లాన్ చేస్తోంది.



హిందీ సినిమాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించిన కియారా అద్వానీ అక్కడ మంచి గుర్తింపు సంపాదించుకున్న తర్వాత టాలీవుడ్ వైపు అడుగులు వేసింది. ఈమె సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన 'భరత్ అనే నేను' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది.

ఈ మూవీ మంచి విజయం సాధించింది. ఆ తర్వాత తక్కువ కాలంలోనే రామ్ చరణ్ తో కలిసి నటించిన 'వినయ విధేయ రామ' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా భారీ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత ఈమె తెలుగులో చాలా కాలం పాటు సినిమాలు చేయలేదు. అలా చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత మరోసారి రామ్ చరణ్ హీరోగా రూపొందిన 'గేమ్ చేంజర్' చిత్రంలో హీరోయిన్గా నటించింది.

సినిమాల్లో ఇప్పటికే అనేక సార్లు తన అందాలతో ప్రేక్షకులను అలరించిన ఈ నటి సోషల్ మీడియాలో కూడా ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా ఈమె తనకు సం

## కిల్లింగ్ లుక్స్‌తో
# కియారా

బంధించిన కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అందులో ఈ బ్యూటీ బ్రౌన్ కలర్‌లో పొడవాటి టైట్ స్టైల్ గౌన్ ధరించి ఎంతో ఆకర్షణీయంగా నిలబడి స్టిల్స్ ఇచ్చింది.

ఇందులో ఆమె ఒక చేతిని తలపై ఉంచి, తన హెయిర్‌ను ముందుకు వేసి కిల్లింగ్ లుక్స్ తో ఆకట్టుకుంటోంది. ఈమె ధరించిన నెక్లెస్ ఆమె అందాన్ని మరింతగా పెంచింది. ఈ ఫోటోలలో ఈ బ్యూటీ ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇవ్వడంతో, ఒక్కసారిగా ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.